POLITICAL NEWS9 (PN9TV)
NVR tv
ప్రతి మాట జనం కోసం
NAMA BORADCASTING PVT. LTD.
APTEL/RNI/2025/65981
# పొలిటికల్ పవర్
POLITICAL POWER
సమగ్ర జాతీయ తెలుగు దిన పత్రిక
Cell : 7780443591, www.politicalpower.in,
e-mail : politicalpower2021@gmail.com
BHARAT TELUGU TV
N99 TV తెలుగు న్యూస్
సంపుటి : 5 సంచిక : 43 మంగళవారం 24-2-2026 ఎడిటర్ : నామ వినోద్ పేజీలు : 12 వెల : 2-00

- ఆందోళన కలిగించేలా బెంగాల్లో చొరబాట్లు
- బంగారు బంగ్లా కలలు సాకారం చేసుకుందాం
- బెంగాల్ ప్రజలకు ప్రధాని మోడీ బహిరంగ లేఖ

## వికసిత్ బెంగాల్ బాధ్యత
# నాది



(పొలిటికల్ పవర్)

న్యూఢిల్లీ, ఫిబ్రవరి23 పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరుగనున్న వేళ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బెంగాల్ ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితిపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరి కొద్ది నెలరోజుల్లో బెంగాల్ భవితను నిర్ణయించే కీలక ఎన్నికలు జరుగ నున్నాయని, భావితరాల భవిష్యత్తును నిర్ణయించే ఈ ఎన్నికల్లో ప్రజలు వివేకవంతమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. బంగారు బంగ్లా కలల సాకారానికి తాను భరోసా ఇస్తున్నానని అన్నారు. జై మహాకాళి' అంటూ ప్రధాని తన లేఖను ప్రారంభించారు. 'మరి కొద్ది నెలల్లోనే బెంగాల్ భవిష్యత్తు నిర్ణయం కోబోతోంది. మీరు తీసుకునే తెలివైన నిర్ణయం పైనే భావితరాల భవిష్యత్తు, దిశానిర్దేశర ఆధారపడి ఉంటుంది. సోనార్ బంగ్లా కోసం యువకులు, పెద్దలు, మహిళలు కన్న కలలు కల్లలుగా మిగిలిపోతున్న పరిస్థితి ఇవాళ ఉంది. వారి బాధలు నన్ను కలిచివేస్తున్నాయి. ఇందుకోసం హృదయపూర్వకంగా ఒక తీర్మానం చేసుకున్నాను. వికసత్ బంగ్లా సాధనకు నిర్ణయం తీసుకున్నాను' అని ఆ లేఖలో మోదీ పేర్కొన్నారు. గత 11 ఏళ్లుగా దేశ ప్రజల ఆశీస్సుల బలంతో ప్రజాసంక్షేమానికి, దేశ సర్వతోముఖాభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం పాటుపడిందని, రైతుల సంక్షేమం నుంచి యువత కలల సాకారం, మహిళా సాధికారత వరకూ కృషి చేసిందని చెప్పారు. ప్రభుత్వ విధానాల వల్ల సాధించిన సానుకూల

11లో



## రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకు
# సిద్ధం కండి

- రానున్న ఎన్నికల్లో అత్యధిక ఎంపి స్థానాలు దక్కేలా కృషి
- దేశ సమస్యలకు అదొక్కటే పరిష్కారం
- డిసిసి అధ్యక్షుల శిక్షణాశిబిరంలో డిప్యూటి సిఎం భట్టి



(పొలిటికల్ పవర్)

వికారాబాద్, ఫిబ్రవరి 23 : రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితేనే ఈ దేశంలోనే రుగ్మతలకు పరిష్కారం లభిస్తుందని, ఆయనను ప్రధానమంత్రిగా చేసే వరకు రెండు రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నిరంతరం పనిచేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రెండు రాష్ట్రాల్లో అత్యధిక ఎంపీ స్థానాలు గెలుచుకునేలా కృషి చేయాలని డిప్యూటీ సీఎంఅన్నారు. వికారాబాద్ లో నిర్వహిస్తున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో సోమవారం ఆయన మాట్లాడారు. కుల సమస్యలు, రిజర్వేషన్లు, కాంగ్రెస్ వాదిగా కుల వివక్ష నిర్మూలనకు ఎలా పోరాటం చేయాలన్న అంశంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రసంగించారు. దేశంలో అంటరానితనం, వివక్ష సమస్య ఎక్కడ ఎదురైనా రాహుల్ గాంధీ అక్కడ ప్రత్యక్షం అవుతారని తెలిపారు. హైదరాబాద్

11లో

## గౌరవెల్లి ప్రాజెక్ట్‌కు
# లీగల్ సమస్యలు

- ప్రాజెక్ట్ ఆలస్యానికి అదే కారణం
- సచివాలయంలో సమీక్షించిన మంత్రులు ఉత్తమ్,పొన్నం




(పొలిటికల్ పవర్)

హైదరాబాద్, ఫిబ్రవరి 23 : అనేక కారణాలు, లీగల్ సమస్యల వల్ల గౌరవెల్లి ప్రాజెక్టు..ఆలస్యం అవుతుందని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

11లో

## మరోమారు భారీగా పెరిగిన
# బంగారం ధరలు
### అంతర్జాతీయ పరిణామాలే కారణమన్న నిర్మలా సీతారామన్



(పొలిటికల్ పవర్)

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23 :దేశీయ మార్కెట్లో విలువైన లోహాల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. సోమవారం ట్రేడింగ్‌లో వెండి ధర ఏకంగా కిలోకు రూ.15,000 పైగా పెరగగా, బంగారం ధర 10 గ్రాములకు రూ.3,000 పైగా ఎగబాకింది. ఈ అసాధారణ పెరుగుదలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందిస్తూ.. పెట్టుబడిదారులకు మరియు వినియోగదారులకు కీలక విషయాలు వెల్లడించారు.. ఆర్బీఐ బోర్డు సమావేశం అనంతరం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. బంగారం, వెండి ధరల పెరుగుదల వెనుక ఉన్న అంతర్జాతీయ పరిణామాలను వివరించారు.. కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు.. గతంలో కేవలం భారత్, చైనా డిమాండ్ వల్లే ధరలు పెరిగేవి. కానీ, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని దేశాల కేంద్ర బ్యాంకులు భారీగా బంగారాన్ని కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నాయి. ఇదే ప్రస్తుత పెరుగుదలకు ప్రధాన కారణం అని వెల్లడించారు. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు మరియు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న కొత్త సుంకాల హెచ్చరికల వల్ల స్టాక్

11లో



# జాతరలో అమానుష ఘటన

- చర్యలు తీసుకోవాలని డిజిపికి ఫిర్యాదు

(పొలిటికల్ పవర్)

హైదరాబాద్,ఫిబ్రవరి 23:కుమ్మేరా జాతరలో అమానుష ఘటనపై మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డీజీపీకి ఫిర్యాదు చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని కార్యాలయంలోకి వెళ్లి డీజీపీ శివధర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ అగ్రకులానికి చెందిన నాయకుడు రజక కులానికి చెందిన రెండు నెలల పసికందును తన్ని చంపిన వ్యక్తులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి నిజాలు వెలికితీయాలని , బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుం డా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట బీసీ కమిషన్ మాజీ సభ్యులు కిషోర్ గౌడ్,ఉపేందర్ చారి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ బాలరాజు యాదవ్,నేతలు స్వామియాదవ్,రాజు తదితరులున్నారు.

## ఎల్ అండ్ టి నుంచి
# మెట్రో రైలు పూర్తి స్వాధీనం

- మెట్రో విస్తరణకు తొలగనున్న అడ్డంకులు
- స్వాధీన ప్రక్రియ పర్యవేక్షణకు భట్టి ఆధ్వర్యంలో ఉపసంఘం
- మార్చి 31లోగా మెట్రో స్వాధీన ప్రక్రియ పూర్తికి నిర్ణయం
- డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా వైద్యవిధాన పరిషత్
- అన్ని జిల్లా కేంద్రాల్లో కాంగ్రెస్ కార్యాలయాలకు భూ కేటాయింపులు
- మార్చి 16 నుంచి 30 వరకు అసెంబ్లీ సమావేశాలు
- తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలు

(పొలిటికల్ పవర్)

హైదరాబాద్, ఫిబ్రవరి 23 : హైదరాబాద్ మెట్రో రైలును ఎల్ అండ్ టీ నుంచి పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని తెలంగాణ క్యాబినెట్ నిర్ణయించింది. ఇప్పటికే దీనిపై ప్రకటన విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. స్వాధీనం చేసుకునే ప్రక్రియను పర్యవేక్షించడానికి మంత్రి వర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని ఈ కమిటీలో.. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు సభ్యులుగా ఉంటారు.. ఇకపోతే మార్చి 16 నుంచి తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగనున్నాయి. 30 వరకు ఈ సమావేశాలు జరుగుతాయి. తొలిరోజు ఉభయ సభలను



ఉద్దేశించిన గవర్నర్ ప్రసంగం ఉంటుంది. 20న బడ్జెట్ ప్రవే శ పెడతారు. దీనికి కేబినేట్ ఆమోదం తెలిపింది. ఇకపోతే

11లో

# జిల్లాలా జైలులో బాల్క సుమన్‌కు పరామర్శ

- మాజీమంత్రి కొప్పుల, మాజీ ఎమ్మెల్యే కోరుకొండ చందర్‌ల భేటీ
- బెయిల్ పిటిషన్‌పై వాదనలు నేటికి వాయిదా

(పొలిటికల్ పవర్)

ఆదిలాబాద్, ఫిబ్రవరి 23 : ఆదిలాబాద్ జిల్లా జైలులో ఉన్న బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే కోరుకొండ చందర్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితిని, జైలులో వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు.అనంతరం జైలు బయట వారు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన కొనసాగిస్తుందని విమర్శించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు 14 మంది గెలిచినా మంత్రి వివేక్ అధికార దౌర్జన్యంతో ఎన్నికలను నిలిపివేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రాళ్లతో దాడి చేసి బీఆర్ఎస్ నాయకులపైనే కేసులు నమోదు చేశారని దుయ్యబట్టారు. సుమన్ పై ఉన్న పాత కేసులు తోడి బెయిల్ రాకుండా ప్రభుత్వం అడ్డుకుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. దౌర్జన్యంగా క్యాతనపల్లి మున్సిపాలిటీని కైవసం చేసుకోవాలని మంత్రి వివేక్ ప్రయత్నిస్తున్నాడని మండిపడ్డారు. అధికార పార్టీ దౌర్జన్యాలను అడ్డుకుంటామని అన్నారు. 10 సంవత్సరాలు అధికారంలో

11లో

## నా పేరుతో ఎలాంటి
# సంస్థలు లేవు: కెటిఆర్

(పొలిటికల్ పవర్)



హైదరాబాద్, ఫిబ్రవరి23 : తన పేరుతో ఎలాంటి సంస్థలు లేవని, అలా సంస్థలు స్థాపించి కార్యకలాపాలు నిర్వహించేందుకు ఎలాంటి అనుమతులు లేవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టంచేశారు. కొంతమంది 'కేటీఆర్ సేవా సమితి', 'కేటీఆర్ సేన' లాంటి పేర్లతో సంస్థలను ఏర్పాటు చేసి కార్యకలాపాలు చేపడుతున్నట్లు తెలిసిన నేపథ్యంలో ఆయన పైవిధంగా స్పందించారు. 'నా పేరుతో ఎలాంటి సంస్థలకు అనుమతి లేదు. అలాంటి ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించబోం' అని కేటీఆర్ పేర్కొన్నారు. ఎవరైనా సేవా దృక్పథంతో పనిచేయాలనుకుంటే కచ్చితంగా భారత రాష్ట్ర సమితి పరిధిలోనే పనిచేయాల్సి ఉంటుందని స్పష్టంచేశారు.

# కామారెడ్డిలో తగ్గని ఉద్రిక్తత

- ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డికి అస్వస్థత
- పరీక్షించిన వైద్యులు..రెస్ట్ తీసుకోవాలని సూచన

(పొలిటికల్ పవర్)

కామారెడ్డి, ఫిబ్రవరి23 : ఓవైపు కామారెడ్డిలో ఉద్రిక్తత కొనసాగుతున్న వేళ,కామారెడ్డి ఎమ్మెల్యే కె.వెంకట రమణారెడ్డి సోమవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గత రెండు మూడు రోజులుగా కామారెడ్డి లో కొనసాగుతున్న రాజకీయ పరిణామాల ఒత్తిడి నేపథ్యంలో ఆయన జ్వరంతో బాధపడుతున్నారు. ప్రస్తుతం ఆయన పోలీసుల బందోబస్తు నడుమ గృహ నిర్బంధంలో

11లో

# సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోండి - జీవితాన్ని ఆస్వాదించండి బాలల సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ భారత రాణి





పొలిటికల్ పవర్ తెలుగు దినపత్రిక ఎన్ వి ఆర్ టివి తెలుగు న్యూస్ ఖమ్మం జిల్లా బ్యూరో ఎన్ శివకుమార్.

విద్యార్థి దశ నుంచి సానుకూల దృక్పథాన్ని అలవాటు చేసుకోవాలని తద్వారా అన్ని సానుకూలంగా మారతాయని మనం ఏం కోరుకుంటామో అదే మన భవిష్యత్తు అని బాలల సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ శ్రీమతి జి.భారతరాణి హితవు పలికారు. యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎన్ఎస్పి క్యాంపు నందుగల షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ, బాలుర వసతి గృహ సముదాయం నందు ఒత్తిడి నిర్వహణ - సంతోషకరమైన బాల్యం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బాలల సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ శ్రీమతి జి.భారతరాణి మాట్లాడుతూ ఎవరి జీవితము పూలపాన్పు కాదని, కష్టతరమైన లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని ఆ దిశగా ప్రయత్నం చేస్తేనే విజయం యొక్క రుచిని ఆస్వాదిస్తారని అన్నారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, సత్ప్రవర్తన, సజ్జన సాంగత్యం, సానుకూల దృక్పథంతో ఆలోచించడం అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. చిన్న చిన్న విషయాలకి కృంగిపోవడము ఒత్తిడికి లోనవడము ఒంటరిని అనే భావనను వదిలివేయాలని, చదువుపై శ్రద్ధ ఆసక్తి , సాధన అనేది మన భవిష్యత్తు ను నిర్ణయిస్తాయని తెలిపారు. పదవ తరగతి పరీక్షలకు హాజరు కాబోయే విద్యార్థులు సబ్జెక్టు పై పట్టు సాధించాలని చిన్నచిన్న విభాగాలుగా అంశాలను విభజించి చిత్రాల రూపంలో గుర్తుంచుకొని ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే చైల్డ్ లైన్ 1048 కి ఫోన్ చేసి సహాయం పొందాలని కోరారు. బాలలకు సహాయకారిగా ఉండడానికి నిరంతరం అందుబాటులో ఉంటామని తెలిపారు.

ఎయిడ్ సంస్థ డైరెక్టర్ పి ఎస్ ఎస్ హరి ప్రసాద్ రావు మాట్లాడుతూ అపజయాలు ఎప్పుడూ మన భవిష్యత్తుకు కొలమానం కాదని, కృంగిపోకుండా మరోసారి ప్రయత్నం లోపం లేకుండా శ్రద్ధ పెడితే విజయం చేతికందుతుంది అని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు ఎక్కువగా ఆందోళనకు గురవుతున్నారని ఇది చాలా సాధారణ విషయమని దానిని అధిగమించాలంటే మనల్ని మనం తెలుసుకోవడం ఏకైక మార్గమని తెలిపారు. భావోద్వేగాలను అణిచివేయకుండా, నమ్మకమైన వ్యక్తులతో చర్చించడం ద్వారా లేదా మనసుకు నచ్చిన పని ఏదైనా ఆటలు ఆడడం, డ్రాయింగ్, బుక్ రీడింగ్, ధ్యానం, వంటివి అలవాటు చేసుకోవడం ద్వారా ఆందోళన తగ్గించుకోవచ్చని తెలిపారు. తమ సంస్థ ద్వారా నిరంతరం బాలలకు మానసిక ఒత్తిడి అధిగమించడానికి అవగాహన కార్యక్రమంలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్, హాస్టల్ వెల్ఫేర్ ఫోరం జిల్లా అధ్యక్షులు కోటపాటి రుక్మారావు, వసతి గృహ సంక్షేమ అధికారులు టీ.స్టాలిన్, ఎన్.రమేష్, నాల్గవ తరగతి సిబ్బంది ఎన్.తిరుపతిరావు, రాములు,ఇందిర, మరియు కాంప్లెక్స్ వసతిగృహాల విద్యార్థులు సిబ్బంది తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మార్చి 14వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

## - జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం





పొలిటికల్ పవర్ తెలుగు దినపత్రిక వనపర్తి జిల్లా బ్యూరో 23 ఫిబ్రవరి 2026.

మార్చి 14వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణకు సంబంధించి చేవట్టాల్సిన ఏర్పాట్లపై సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పదో తరగతి వార్షిక పరీక్షలు కొనసాగుతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 7,228 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా 37 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల నిర్వహణ కోసం 37 మంది సూపరింటెంట్లు, 37 మంది డిపార్ట్మెంటల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. సంబంధిత అధికారులు పరీక్షల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు సజావుగా పూర్తయ్యేలా బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. హాహానిర్ణీత సమయానికి విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. లోటుపాట్లకు తావులేకుండా పరీక్షలు సజావుగా కొనసాగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్షలు జరిగే సమయంలో పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని ఆదేశించారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలను సెంటర్లలో నియమించాలని, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష సమయాలకు అనుగుణంగా బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రశ్న పత్రాలు, అన్సర్ షీట్లను తగిన భద్రత మధ్య తరలించాలని సూచించారు. కేంద్రాలలోకి సెల్ఫోన్లను అనుమతించకూడదన్నారు. పరీక్షా కేంద్రాల చీఫ్



నావరింటెండెంట్ల బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, డిఇఓ అబ్దుల్ ఘని, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దేశ ప్రజలకు ప్రధాని మోదీ కీలక హెచ్చరిక!



పొలిటికల్ పవర్ తెలుగు దినపత్రిక ఎన్ వి ఆర్ టి వి తెలుగు న్యూస్ బ్యూరో

దేశంలో డిజిటల్ మోసాలు పెరిగిపోతున్నాయి. శాంతి భద్రతల పరిరక్షణ కంటే డిజిటల్ మోసాలను కట్టడి చేయటం పోలీసులకు పెద్ద కష్టంగా మారింది. ప్రజలలో అవగాహన కల్పిస్తున్నా సరే ఎక్కడో ఒక చోట ప్రజలు మోసపోతూనే ఉన్నారు.

ఈ క్రమంలో తాజాగా నేడు మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ డిజిటల్ మోసాలపైన ప్రజలను అప్రమత్తం చేశారు.

డిజిటల్ అరెస్ట్ పై ప్రధాని మోదీ వ్యాఖ్యలు

ప్రధానమంత్రి మన్ కి బాత్ కార్యక్రమంలో డిజిటల్ అరెస్ట్ గురించి మరోసారి ప్రస్తావించారు. డిజిటల్ అరెస్ట్, డిజిటల్ మోసాలపై సమాజంలో ఇప్పటికే చాలా అవగాహన వచ్చిందన్నారు. అయితే ఇటువంటి సంఘటనలు ఇప్పటికీ మన చుట్టూ జరుగుతున్నాయన్నారు. ఇవి క్షమించరానివని, డిజిటల్ అరెస్టుకు, ఆర్థిక మోసానికి అమాయకులు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి మోసాల పట్ల అప్రమత్తంగా, అవగాహనతో ఉండటం చాలా ముఖ్యమన్నారు.

కేవైసీ పట్ల అప్రమత్తంగా ఉండాలన్న ప్రధాని మోదీ

బ్యాంకు లావాదేవీల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, కేవైసీ- నో యువర్ కస్టమర్- పట్ల అప్రమత్తత అత్యంత ముఖ్యమైన అంశమని ప్రధాన మంత్రి మోదీ తెలిపారు. ఈ ప్రక్రియ అందరికీ తెలిసినప్పటికీ అప్రమత్తంగా ఉండాలన్నారు. మోసగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాన్నారు. బ్యాంక్ ఖాతా సురక్షితంగా ఉండేలా బ్యాంకులు ఎప్పటికప్పుడు తిరిగి- కేవైసీ నిర్వహిస్తాయన్నారు.

కేవైసీ పేరుతో సైబర్ మోసాలు .. జాగ్రత్త

ఇదే అవకాశంగా నేరస్థులు నకిలీ కాల్స్ చేస్తారని, ఎస్ ఎం ఎస్, లింకులను పంపుతారని, అలాంటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. మీకు వచ్చే మెసేజ్ లను నమ్మొద్దని, అనుమానం ఉంటే నేరుగా బ్యాంకుకే వెళ్లి నిర్ధారించుకోవాలని సూచించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సందేశాన్ని గమనించి,. కేవైసీని నవీకరించుకోవాలన్నారు. కేవలం బ్యాంక్ యాప్స్ లేదా బ్రాంచ్‌ల ద్వారానే ఈ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు.

పాస్ వర్డ్స్ తరచూ మారుస్తూ జాగ్రత్తగా ఉండాలి

ఒకే పాస్ వర్డ్ చాలా కాలం పాటు ఉంచకుండా పాస్‌వర్డ్లు తరచూ మారుస్తూ జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రజలలో అప్రమత్తతే అన్నిటి కన్నా ముఖ్యమని, కనుక ప్రజలు డిజిటల్ మోసాలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు, అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అప్రమత్తంగా లేకుంటే మీ కష్టార్జితం సైబర్ నేరగాళ్ళ పాలు అయ్యే ప్రమాదం ఉంటుందని ప్రధాని మోడీ హెచ్చరించారు.

# మణిగిళ్ల గ్రామంలో మార్నింగ్ వాక్ లను సందర్శించిన సర్పంచ్





పొలిటికల్ పవర్ తెలుగు దీనపత్రిక వనపర్తి జిల్లా బ్యూరో 23 ఫిబ్రవరి 2026: పెద్దమందడి మండలం మణిగిళ్ల గ్రామంలో సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో 03 వ వార్డు సందర్శించడం జరిగినది. గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ వార్డ్ మెంబర్స్ శ్రీకాంత్ రెడ్డి, కావాలి సరోజ ఉషన్న పాల్గొనడం జరిగినది. వార్డులోని ప్రజలు వడ్ల కృష్ణ ఇంటిదగ్గర స్తంభాన్ని రీప్లేస్మెంట్ చేయాలని రోడ్డుకు అడ్డం ఉందని మరియు అండర్ డ్రైనేజీ మోరి గురించి త్వరలోనే పనులు ప్రారంభించబడతావని గ్రామ నూతన సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ వార్డ్ లోని ప్రజలకు తెలియజేయడం జరిగినది. అదేవిధంగా చౌట చెరువు వెంకన్న చెరువు పెద్ద కాలువ నీళ్లు దోమలు ఎక్కువగా ఉన్నవి త్వరలోనే దోమల మందు స్ప్రే చేయించబడతదని గ్రామ ప్రజలకు సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు గ్రామ యువత కూడా పాల్గొనడం జరిగింది. మధిరాల రామ్ రెడ్డి, ఆనంద్ రెడ్డి, బోయిని కృష్ణ, ఎం బుచ్చన్న, కావలి యాదయ్య, కావలి ఉషన్న, మందడి బాలకృష్ణ, కావాలి శివ, గౌడుగు చంద్రశేఖర్, మేకల రాములు, భూపని కాశి, తదితరులు పాల్గొన్నారు.

# యుగధర్మం కాదది.. కలియుగ ఖర్మం..!




పొలిటికల్ పవర్ తెలుగు దినపత్రిక పిఎన్9 టీవీ తెలుగు న్యూస్ ఎడిటర్ డెస్క్.

(కలియుగం మొదలైన రోజట..)

శ్రీకృష్ణుని అవతార పరిసమాప్తితో చుట్టుకున్న శ్రీకారం.. అంతా వికారం.. అదోలాంటి హాహాకారం.. సంస్కార సంకరం.. అన్నిటా వెటకారం.. అక్రమమే సక్రమమై.. అన్యాయమే న్యాయమై.. మానవత మాయమై.. బ్రతుకు హేయమై.. రోజు దుర్భరమై.. రాజు దౌర్భాగ్యుడై.. సాగే కాలం.. మాయాజాలం.. కలికాలం..!

ఇప్పటికి 5127 వత్సరాలకు మునుపు.. ఇదే రోజున..

అంటే ఫిబ్రవరి 17..19 మధ్య..పొద్దుపొడుపు.. ఎర్రబడిన తూరుపు.. మారిపోయిన మనిషి రూపు.. పెద్ద మలుపు.. రక్కసికి మేలుకొలుపు.. మొత్తంగా సరికొత్త జగం.. ముంచుకొచ్చింది కలియుగం..!

దుర్మార్గం పెచ్చుమీరుతుంటే అన్యాయం రాజ్యమేలుతుంటే మానవుడే దానవుడై విక్రమార్కులు మాయమై అక్రమార్కులు పెరిగిపోతుంటే ఇంకెన్నాళ్ళురా ఈ కలియుగం.. అని నిస్పృహ చెందమాకు.. నువ్వున్నది ఆరంభంలోనే.. గడిచింది 5127.. మిగిలి ఉంది 426873 సంవత్సరాలు.. ఇప్పుడున్న ఎవరూ చూడని ఆరంభం.. ఊహించలేని ముగింపు.. అప్పటికి వస్తాడట కల్కి.. ఈలోగా మొత్తం దునియానే కల్తీ..!

నిజానికి దుర్యోధన జననంతోనే మొదలైందట కలియుగం.. ఔను మరి.. ధర్మరాజులకు తావుండని కాలంలో.. ఊరూరా ఊర మాసులు వీరవిహారం చేసే కలికాలంలో.. ఆకలికాలంలో.. రామరాజ్యం.. ధర్మరాజ్యం పూజ్యమై.. జగమే ఆకలిరాజ్యమై జీవనం క్లిష్టమై.. మంచికి కష్టమై.. అన్నీ దుర్మార్గానికే ఇష్టమై.. రావణకాష్టమై.. సాగే కాలం.. సాగుతున్న జాలం.. అదే అదే కలికాలం..!

ఇప్పుడే ఇంత సెగ.. ముందుండదా మొసళ్ళ పండగ.. మనిషి ఎన్నిటికో బానిస.. మందుకి.. డబ్బుకి.. దుర్మార్గానికి.. మత్తుకి..కామానికి.. కొత్తగా టెక్నాలజీకి.. మొత్తంగా స్వార్థానికి..!

సత్యయుగం..త్రేతాయుగం..

ద్వాపర యుగం.. ఆహా .. పేర్లు వింటుంటేనే శాంతి..

కలియుగం భ్రాంతి.. ఇప్పటికే దూరమైన మనశ్శాంతి..

దేశాల నడుమ వైషమ్యాలు.. మనుషుల మధ్య వైరుధ్యాలు.. మళ్ళీ..మళ్ళీ.. మత విద్వేషాలు.. అమ్మో..ఏమి ఆగడాలు.. అవే అవే.. కలికాలపు పోకడలు..!

కోతి నుంచి పుట్టిన మానవుడు.. మళ్ళీ మూలంలోకి చేసే పయనమే.. పలాయనమే.. నాలుగు యుగాల మర్మం.. కలియుగంలో కానరాని ధర్మం మనుష్యజాతి ఖర్మం..!

# జర్నలిస్టులకు పొంగులేటి భరోసా



పొలిటికల్ పవర్ తెలుగు దినపత్రిక పి ఎన్9 టీవీ తెలుగు న్యూస్.

హైదరాబాద్ రాష్ట్రంలో 44వేల మందికి పైగా జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయనున్నట్టు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు సచివాలయంలోని తన కార్యాలయంలో అక్రెడిటేషన్ కార్డుల జారీ విధానం, కమిటీ ఏర్పాటుపై సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ సీహెచ్ ప్రియాంక, సీఎం సీపీఆర్వో జీ మల్సూర్‌తో సుదీర్ఘంగా చర్చించారు.

2.50 లక్షలకు పైగా సర్క్యులేషన్ ఉన్న 8 పత్రికలకు 6,256 కార్డులు, 75 వేల నుంచి 2.50 లక్షల వరకు సర్క్యులేషన్ ఉన్న24 పత్రికలకు 17,784 కార్డులు, 25001 నుంచి 75 వేల వరకు సర్క్యులేషన్ ఉన్న 30 పత్రికలకు 3,390, అదే విధంగా 15001 నుంచి 25000 వరకు సర్క్యులేషన్ ఉన్న 169 చిన్న పత్రికలకు 11,661 , 15వేలలోపు సర్క్యులేషన్ ఉన్న 113 చిన్న పత్రికలకు 226, పీరియాడికల్స్‌కు 624, 20 న్యూస్ ఏజెన్సీలకు 68 అక్రెడిటేషన్లు పొందుతాయని తెలిపారు.

అలాగే 21 శాటిలైట్ చానళ్లకు 4,431 కార్డులు, 8 జాతీయ చానల్స్‌కు 32, వంద లోకల్ కేబుల్ చానళ్లకు 200, డిజిటల్ మీడియా విభాగానికి 10 కార్డులు మొత్తంగా 44,706 కార్డులు కేటాయించినట్టు తెలిపారు. ఇందులో రాష్ట్ర, జిల్లా స్థాయిలో 16,056, నియోజకవర్గ, మండలస్థాయిలో 28,650 మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. అక్రెడిటేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని మంత్రి తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా డెస్క్‌జర్నలిస్టులకు ఇచ్చే అక్రెడిటేషన్ల సంఖ్యను పెంచాలని డీజేఎఫ్‌టీ నాయకులు డిమాండ్ చేశారు. సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుత ప్రక్రియ ద్వారా పెద్ద సంఖ్యలో కార్డుల్లో కోత ఏర్పడిందని మంత్రితో పాటు ఐ అండ్ పీఆర్ కమిషనర్ ప్రియాంక దృష్టికి డీజేఎఫ్‌టీ అధ్యక్షుడు ఉపేందర్ తీసుకెళ్లారు. ఈ విషయంలో మంత్రి సానుకూలంగా స్పందించినట్టు ఆయన పేర్కొన్నారు. డీజేఎఫ్‌టీ ప్రతినిధులు డీ రాజారాం, కే రమేశ్, జీ సత్యప్రసాద్ ఉన్నారు.

# భద్రాచలం సఖిసోదరీమణులు సేవా కార్యక్రమం

**– నేషనల్ ఫౌండర్ అండ్ చైర్మన్ నరాల సత్యనారాయణ**
**– భద్రాచలంలో అన్నీ తానై నడిపిస్తున్న కుంజా రమాదేవి**
**– కారం నాగరాజు, సుశీలమ్మ కుటుంబానికి సేవా కార్యక్రమం**

పొలిటికల్ పవర్ తెలుగు దినపత్రిక పిఎన్9 టీవీ తెలుగు న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో ఎస్ రజిని

భద్రాచలం నియోజకవర్గం, చర్ల మండలం సత్యనారాయణ పురం గ్రామానికి చెందిన కారం నాగరాజు పెరిలిసిస్ తోబాధపడు తూ ఏ పని చేయలేకపోవడం వల్ల కుటుంబ భారము చాలా కష్టంగా మారిన సమయంలో ఆ కుటుం బాన్ని భద్రాచలం సఖి సోదరీమ ణులు ఆదుకోవడం జరిగినది

కారం నాగరాజు కుటుంబానికి 1. బియ్యము 2. నిత్యవసర వస్తువులు 3. బట్టలు 4. కూరగాయలు 5.1500 రూపాయలు ఇవ్వడం జరిగినది



సఖి అంటే సేవా కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు అంటే సఖి అని నిరూపిస్తున్న భద్రాచలం సోదరీమణులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. సఖి మహిళా మండలి గత మూడు సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలలో నెంబర్ వన్ స్థానంలో ఉన్నది. జాతీయస్థాయి ఖ్యాతిని ఆర్జించిన సంస్థ సఖి మహిళా మండలి. ఈ కార్యక్రమంలో యాశం ఈశ్వరమ్మ, కుంజా రమాదేవి, తుష్టి లక్ష్మి, కారం రామమ్మ, సోడే రమణ, మీడియం రంజిత, మీడియం శాంతి, కారం ప్రియాంక, తెల్లం లక్ష్మి, నూపా పార్వతి, మడివి జ్యోతి మౌనిక, భూక్యా హేమలత, సిరిసాని స్వప్న, నూప రాదా, పాటి విజయశ్రీల, ఊకె అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



# నా పేరు ఆనందరావు. నా పేరులోని ఆనందం ఎన్నడూ నా జీవితపు దరిదాపుల్లోకి రాలేదనే చెప్పాలి

పొలిటికల్ పవర్ తెలుగు దినపత్రిక ఎన్ వి ఆర్ టివి తెలుగు న్యూస్ స్టేట్ బ్యూరో.

నా వంటిమీదకి పాతికేళ్ళు ముంచుకొచ్చినా, ఇప్పటికీ ఒక్క అడుగు కూడా పురోగతి సాధించలేకపోయాను. అనునిత్యం నా బాధలూ, కష్టాలనూ నెమరు వేసుకుంటూ, అందరిముందు సాగిలపడుతూ సాదాసీదాగానే సాగిపోతున్నాను. నా మిత్రులందరి జీవితాలతో పోల్చుకుంటే నేను అతిగానే వెనుకబడిపోయానని ఒప్పుకుని తీరాలి. ఓటమిని సునాయాసంగా ఒప్పుకోవడం, అంగీకరించడం.. చిన్నప్పటి నుంచి అమ్మ నాకు అన్నంతోపెట్టిన అస్త్రవిద్యగా నా నరనరాన్నా జీర్ణించుకుపోయేలా బోధించింది. తరువాతర్వాత అదే బతుకైపోయింది. తాగుడుకి బానిసైన నాన్న, ఓరోజు అమ్మనీ, నన్నూ, తమ్ముడూ, చెల్లాయిలనూ.. 'మీ బతుకులు.. మీరు చావండి..' అని నిర్దాక్షిణ్యంగా తాగిన మైకంలో తేలిపోతూ, మమ్మల్ని గాలికి వదిలేసి, గాలిలో కలిసిపోయాడు. 'ఇంటికి పెద్దదిక్కులేని కుటుంబం మనది. అందరి దగ్గర తగ్గి, తలొగ్గి బతకాలి..' అంటూ మా అమ్మ ప్రతిరోజూ, ప్రతీక్షణం బతుకుపాఠంగా నాకు నూరిపోసిన ఆ పిరికితనమే ఈరోజు నన్నిలా నా ఆత్మహత్యకు దారి తీయిస్తూ, అడుగులను ముందుకు వేయిస్తోంది. రూము అద్దె ఆరునెలలుగా చెల్లించలేదని మా హౌస్ ఓనర్ అన్న ఆ మాటలు ఇంకా నా చెవుల్లో గింగురుమంటున్నాయి. 'వెయ్యి రూపాయిల అద్దె కూడా కట్టుకోలేని బతుకు.. నీకు అవసరమా? ఇలాంటి బతుకు బతకడం కన్నా చావడం మేలు.. ఇంకెవరికైనా అద్దెకిచ్చుకుంటాను' అంటూ ఉదయాన్నే వచ్చి పరుషంగా నిందించి, కోపంగా వెళ్ళిపోయాడు. అయినా నాకు అతనిమీద ఎటువంటి కోపం రాలేదు. ఎందుకంటే అమ్మ నాలోని అణువణువునా అలాంటి సర్దుకుపోయే మనస్తత్వాన్ని రంగరించి నూరుపోసింది. ముందురోజు రాత్రే అమ్మ ఫోన్ చేసింది. 'ఒరే ఆనందూ, వడ్డీ డబ్బులకోసం పరమేశం వచ్చి, పెద్దగొడవే చేసాడురా! అసలూ, వడ్డీ కలిపి ఇస్తేనే ఇక్కడ నుంచి కదిలేది లేదంటూ మన గుడిసె దగ్గర నానారభసే చేశాడు చాలాసేపూ..' అంటూ అమ్మ ఎప్పటిలా కన్నీటి బాధని వెళ్ళగక్కింది. 'ఎవరి ఫోన్ నుంచైనా నీ స్నేహితుడు రాంబాబు ఫోనుకి డబ్బులు పంపించరా. ఎంతో కొంత వాడి మొహాన కొడితేగానీ, ఇక్కడ పరిస్థితి కాస్త సర్దుకునేలా లేదు..' అంటూ అమ్మ దీనంగా అర్థిస్తూ బాధపడింది. అమ్మ గొంతులోని దైన్యం నన్ను మరింత క్రుంగదీసింది. మా నాన్న చనిపోయినా.. అతను చేసిన అప్పులకీ నేటికీ పురుడు పోసుకుంటున్న విపరీత వడ్డీలు మమ్మల్ని దారిద్ర్యరేఖకు దిగువన కూడా బతకనీయకుండా రోజురోజుకి భయపెడుతూ, భరించలేనంతగా భారమైపోయాయి. నేను, ఓ డిపార్ట్‌మెంట్ స్టోరులో సేల్స్‌మేన్‌గా పనిచేస్తున్నాను. నేనీ ఉద్యోగం కోసం వెళ్లినరోజు – మా యజమాని నెలకు పదివేలు రూపాయలు జీతం ఇస్తానని గొప్పగా చెప్పాడు. నేను ఎంతో ఆనందించి, సంతోషంతో సరేనన్నాను. ఆ రోజు రాత్రి రూంకెళ్ళాక అమ్మకు ఫోన్ చేసి 'నాకు నెలనెలా పదివేల రూపాయలు జీతం..' అని ఎంతో గొప్పగా చెప్పుకుని, మురిసిపోయాను. ఆ ఆనందంతో ఆ రోజు రాత్రి సరిగ్గా నిద్రపట్టలేదు కూడా! 'ఈ ఉద్యోగం దొరకడం నీ అదృష్టంరా!' అంటూ అమ్మ ఎంతో పొంగిపోయింది. అమ్మ మాటలు నాలో కొండంత ధైర్యాన్నిచ్చాయి. ఆ తర్వాతే తెలిసింది నాకు అమ్మచెప్పిన నా అదృష్టం ఏ పాటిదో..!

నా ఉద్యోగంలో చేర్చుకున్నప్పుడు మా డిపార్ట్‌మెంట్ స్టోరు యజమాని ఓ షరతు పెట్టాడు. 'నువ్వెవరివో నాకు తెలియదు. కాబట్టి, నీ టెన్త్, ఇంటర్మీడియట్ ఒరిజినల్ సర్టిఫికెట్స్ నా దగ్గర హామీగా కుదవబెడితేనే.. నీకీ ఉద్యోగం..' అన్నాడు. నేను మరింకేమీ ఆలోచించకుండా ఆ కాగితాలు 'నా దగ్గర ఉంటేనేమి.. అతని దగ్గర ఉంటేనేమి...?!' అనుకుని అతనడిగిన నా ఒరిజినల్ సర్టిఫికెట్స్ అతని చేతుల్లో పెట్టాను. నేను ఉద్యోగంలో చేరి ఓ నెలరోజులు పూర్తికావస్తోండగా మా స్టోరు యజమాని 'రేపు నీ జీతం ఇస్తాను..!' అన్న మాటలు నన్నెంతో ఆనందానికి గురిచేశాయి. రాబోయే జీతం డబ్బులుతో ఏమేమి చేయాలో అర్ధరాత్రి వరకూ ఆలోచిస్తూ నిద్రపోయాను. రాత్రి సరిగ్గా నిద్ర పోలేకపోయినా ఉదయాన్నే ఉత్సాహంగా లేచి, డ్యూటీకి రెడీ అవుతుండగా నా కీప్యాడ్ సెల్‌ఫోన్ మోగింది. మా స్టోరులో నాతోపాటు పనిచేసే ఓ కుర్రాడు ఫోన్ చేసాడు. 'ఒరేరు, మన స్టోరులో షార్ట్ సర్క్యూట్ మూలంగా చాలా సామాన్లు కాలిపోయాయి. నువ్వు అర్జంటుగా రా..!' అంటూ పిడుగులాంటి వార్త నా నెత్తిన కుమ్మరించాడు. నేను హడావిడిగా బయలుదేరి వెళ్ళాను. మా స్టోరులో కొంతభాగం కాలిపోయింది. మరికొంత భాగం బాగానే వుంది. ఇన్స్యూరెన్సు క్లెయిమ్ చేయడానికి మా యజమాని ఫొటోలు, వీడియోలు తీయించాడు. ఎవర్నో రప్పించి స్టోరంతా దగ్గరుండి చూపించాడు. ఆ రోజు మా స్టోర్ తెరవలేదు. కానీ, మాకు డ్యూటీ చేయక తప్పలేదు. నేనూ, మరో ఇద్దరూ కలిసి సామానులన్నిటినీ పొందికగా సర్దిపెట్టడానికే సరిపోయింది ఆ రోజంతా. పనంతా పూర్తయ్యేసరికి నా వళ్ళంతా హూనమైపోయింది. రాత్రి పదకొండు గంటలు దాటిపోయింది. నేను ఇంటికి బయల్దేరేటప్పుడు మా యజమాని నా జీతం డబ్బులు ఇస్తాడేమోనని ఆశగా అతనికేసి చూసాను. అతను నా మనసులోని ఉద్దేశ్యాన్ని పసిగట్టినట్టుగా 'ఒరేరు ఆనందూ! ఇన్స్యూరెన్సు డబ్బులు త్వరలో వచ్చేస్తాయి. అప్పుడు నీ జీతం ఇస్తాను..!' అన్నాడు. నేను ఇంకేమీ మాట్లాడలేక ఊరకుండిపోయాను. ఆ తర్వాత నేను ఎప్పుడన్నా జీతం గురించి అడిగినా 'ఇన్స్యూరెన్సు డబ్బులు ఇంకా రాలేదు..!' అంటూ నా ఆరునెలలుగా నా జీతాన్ని వాయిదా వేస్తూ నాతో పని చేయించుకుంటున్నాడు. నేను ఇంటి దగ్గర నుంచి అప్పు చేసి తెచ్చుకున్న డబ్బులు ఎంత పొదుపుగా వాడుకున్నా, ఎప్పుడో ఖర్చయిపోయాయి. తినడానికి కూడా ఇబ్బందిగా తయారైంది నా పరిస్థితి. ఈ విషయాన్ని మా యజమానికి చెప్తే.. నా జీతం ఇవ్వలేదు కానీ, తన ఇంటి దగ్గర నుంచి నా కోసం ఓ బాక్స్‌తో అన్నం తీసుకొస్తున్నాడు. నేను రాత్రి స్టోరు నుంచి నా రూముకి వచ్చేటప్పుడు టిఫిన్ చేయమంటూ రోజూ ఓ ఇరవై రూపాయలిచ్చి, తన ఖాతా బుక్‌లో లెక్క రాసుకుంటున్నాడు. నాకు ఆలస్యంగా అర్థమైంది. నా యజమాని నన్ను దగా చేస్తున్నాడని! కానీ నా రక్తంలో ప్రవహిస్తోన్న పిరికితనం నన్ను మరింకేమీ ఆలోచించనివ్వలేదు. హౌస్ ఓనర్ మాటలకు ఎంతగానో నొచ్చుకున్న నేను రూం నుంచి బయల్దేరినప్పుడు ఫలానా చోటుకి వెళ్లాలని ఏమీ అనుకోలేదు. కానీ ప్రస్తుత నా గమ్యం మాత్రం 'కచ్చితంగా చచ్చిపోవాలి' అనుకుంటూ వడివడిగా ముందుకు అడుగులు వేస్తున్నాను. దూరంగా రైల్వేస్టేషన్ కనిపించింది. అంటే– రైలు చక్రాల కింద నా కష్టాలూ, కన్నీళ్ళూ.. అన్నీ ఈ రోజుతో నుజ్జునుజ్జయిపోయి, అంతమైపోతున్నాయన్న మాట. ఆ ఆలోచన మనసుకి ఎంతో హాయినిచ్చింది. ఆ హాయి ఎలాంటిదంటే సమస్యల సుడిగుండాల్లోంచి సేదతీరిన చల్లటి అనుభూతి. మళ్ళీ అంతలోనే అమ్మా, తమ్ముడూ, చెల్లీ.. నా కుటుంబం అంతా కళ్ళ ముందు కదిలేసరికి, తట్టుకోలేని దుఃఖం తన్నుకొచ్చింది. నా కళ్ళల్లో నీళ్లు ఒక్కసారిగా వెల్లువలా ధారలుకట్టాయి. అంతలోనే స్పృహలోకి వచ్చిన నేను 'ఎవరూ చూడలేదు కదా' అని చుట్టూ చూసి చొక్కాతో కళ్ళు తుడుచుకున్నాను. ఆ రోడ్డు మీద నడుస్తోన్న వారంతా తమతమ సాధకబాదకాలతో పరుగులు తీస్తున్నారు. అప్పుడే రోడ్డు పక్క నా కంటపడిన ఓ దృశ్యం నన్ను ఉన్నచోటినే ఆగిపోయేలా చేసింది. ఓ కోడిపెట్ట తన పిల్లలను తన రెక్కలతో రక్షణ కలిపిస్తూ, వాటిని ఎలాగైనా ఎత్తుకుపోవాలని ప్రయత్నిస్తోన్న గ్రద్దను.. తన శక్తి మేరకు ఎగిరెగిరి ఎదురిస్తూ తీవ్రంగా ప్రతిఘటిస్తోంది. ఆ గ్రద్ద తన ప్రయత్నాన్ని అలాగే చాలాసేపూ హోరాహోరీగా పోరాడుతూనే ఉంది. ఆ తల్లికోడి తన శక్తిసామర్థ్యాలను మించి గ్రద్దను ఎదుర్కొంటోంది. చిట్టచివరకు ఆ గ్రద్ద తన ఓటమిని అంగీకరిస్తూ అక్కడ నుంచి దూరంగా పారిపోయింది. అంతే ఆ తల్లికోడి ఒక్కసారిగా తల విదిలించుకుని, ఒక్కసారిగా ఊపిరి ఎగబీల్చుకుని మొండి ధైర్యంతో, అంతులేని ఆత్మవిశ్వాసంతోనూ ఆకాశంకేసి ఎర్రగా చూసింది. ఆ చూపుల్లో సడలిపోని తెగింపు తొంగి చూస్తోంది! దాని కళ్ళల్లో అనిర్వచనీయమైన బతుకు బాధ్యత సుస్పష్టంగా ప్రస్ఫుటిస్తోంది.

# బంజారా సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్ రమేష్ నాయక్ నియామకం

పొలిటికల్ పవర్ తెలుగు దీనపత్రిక వనపర్తి జిల్లా బ్యూరో 23 ఫిబ్రవరి 2026:

బంజారా సేవ సంఘము రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ నాయక్ నియమించడం జరిగింది. సోమవారం రోజు బంజారా సేవా సంఘం అధ్యక్షుడు కిషన్ నాయక్ చేతులమీదుగా నున్సావత్ రమేష్ నాయక్ ను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అధికారికంగా నియమించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ... బంజారా సమాజ అభివృద్ధి, ఐక్యత, సేవా కార్యక్రమాల విస్తరణలో భాగంగా రాష్ట్ర స్థాయిలో సంఘ కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడం కోసం ఈ నియామకం చేపట్టినట్లు తెలిపారు.



నూతన రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంఘ ఆశయాలు, లక్ష్యాలకు అనుగుణంగా కృషి చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన నున్సావత్ రమేష్ నాయక్ మాట్లాడుతూ... సంఘ అభివృద్ధి బంజారా సమాజ ఐక్యత కోసం అంకితభావంతో పని చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రమేష్ నాయక్, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అదిలాబాద్ జిల్లా అధ్యక్షులు షేక్. అస్లాం ఆధ్వర్యంలో చేరికలు టిఆర్ఎస్ డి పార్టీలో భారీ చేరికలు

**– 7 వ వార్డులో భారీ చేరికలు**





పొలిటికల్ పవర్ తెలుగు దినపత్రిక పిఎన్9 టీవీ తెలుగు న్యూస్ తెలంగాణ స్టేట్ బ్యూరో కే సతీష్ కుమార్.

టిఆర్ఎస్ (డి) పార్టీ అదిలాబాద్ జిల్లాలో చేరికలు నిర్వహించడం చాలా సంతోషదాయకం ఆనందదాయకమని రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు నరాల సత్యనారాయణ తెలియజేశారు. రాబోయే ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో టిఆర్ఎస్ (డి) పోటీ చేస్తుందని, అందులో భాగంగానే ఈరోజు అదిలాబాద్ జిల్లాలో చేరికల కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని తెలియజేశారు. టిఆర్ఎస్ (డి) మహిళలకు, యువతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ఈ సందర్భంగా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నరాల సత్యనారాయణ తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో అదిలాబాద్ టౌన్ ప్రెసిడెంట్ షేక్ రసూల్, స్టేట్ సోషల్ మీడియా కన్వీనర్ సయ్యద్ రహమత్ తోపాటు యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉత్తమ పంచాయతీ సెక్రెటరీకి ఘనంగా సన్మానం

కోమరోలు పొలిటికల్ పవర్ పిఎన్9టీవీ తెలుగుఎం వెంకటేశ్వర్లుకడప (జిల్లా):–


కే గంగాధర్ నాయుడు పంచాయతీ సెక్రెటరీ నుంచి గ్రూప్2 ఉద్యోగం వచ్చినందుకు అంబవరం పంచాయతీ ప్రజలుమరియు తోటి ఉద్యోగులు చాలా గర్వపడ్డారు, అలాగే అతను చేసే ఉద్యోగం పంచాయతీ సెక్రటరీగా అందరితో మంచిగా నడవడికతో ఉన్నాడు అని ఘనంగా ప్రభుత్వ పాఠశాలలో సన్మానం చేసారు. భార్య పూర్ణ చంద్రిక సహకారం, తల్లి దండ్రులు కూనపులి గంగినాయుడు, వెంకటరత్నమ్మ ప్రోత్సాహంతో ఈ ఉద్యోగం సాధించగలిగాను అని అతన్ని మాటల్లో చెప్పలేని సంతోషం వ్యక్త పరిచారు, గ్రామస్తులు తమ ఊరికి మంచి అధికారి పోతున్నాడని కానీ మళ్లీ ఇలాంటి అధికారి రావాలని కోరుకుంటూ ఘనంగా సన్మానం చేయడం జరిగింది.



# ఎమ్మెల్యేకి రైతులందరూ కృతజ్ఞతలు ధన్యవాదాలు

**- బండి శ్రీనివాసరావు**

పొలిటికల్ పవర్:సిమెంట్ ఫ్యాక్టరీలను నిర్మిస్తామని చెప్పి రైతుల వద్ద చౌకగా భూములు కొన్న యాజమాన్యాలు ఫ్యాక్టరీలు నిర్మించకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన అసెంబ్లీలో గళం విప్పారు. ఫ్యాక్టరీలు నిర్మితమైతే పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని రైతులు ఆశపడ్డారన్నారు. చేతిలో పొలం లేక, ఫ్యాక్టరీ నిర్మాణం కాక రైతులు కూలీలుగా మారిపోయారన్నారు.పల్నాడులో రైతుల నుంచి భూములు తీసుకుని పరిశ్రమలు నెలకొల్పని సంస్థలకు నోటీసులు జారీ చేసినట్లు మంత్రి టీజీ భరత్ అసెంబ్లీలో వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పరిశ్రమల కోసం కేటాయించిన వేలాది ఎకరాలను బ్యాంకుల్లో కుదువ పెట్టే అధికారం ఎవరిచ్చారని ఎమ్మెల్యే యరపతినేని ప్రశ్నించారు. ఈ భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారుఈ ఈ విషయం తెలుసు కున్న నీటి సంఘం ప్రెసిడెంట్ బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో కూడా రైతుల సమస్యలపై గురజాల నియోజకవర్గం తరపున తాగునీటి కోసం గళం విప్పిన నాయకుడు రైతుల ఆత్మీయ బంధువు యరపతి నేని చెప్పవచ్చు ఎందుకంటే ఈ ప్రభుత్వం రైతుల ప్రభుత్వా మనీగురజాల నియోజకవర్గంలో నిధులు




రాకుండానే సొంత నిధులతో పంటకాల్వల ను మరమ్మత్తులు చేసి రైతుల పంట పొలాలకు సాగు నీరుతాగునీరు అందించిన ఘనత గొప్పతనం ఎమ్మెల్యే యరపతినేని అని ఆయన ద్వారా పిల్లలకి ఎంతోమంది ఉద్యోగాలు వచ్చాయనిరైతులు ఈ సందర్భంగా తెలియజేశారు ఈ విషయం తెలుసుకున్న ఫ్యాక్టరీ వారికి పొలం అమ్మినరైతులు ఎమ్మెల్యే యరపతినేనికి అసెంబ్లీలో భూమి గురించి మాట్లాడినందుకు మా పిల్లలు ఉద్యోగాల గురించి వివరించినందుకు రైతులు అందరు కలిసి ఎమ్మెల్యే యరపతినేనికి కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు.

# వైయస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు ఏటిపోరంబోకు భూములన్నీ పేదలకు పెంచాలి

**– భూ కబ్జాదారుల చెర నుండి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలి.**

**– చౌడూరు గ్రామ రైతులకే తోపుపోరంబోకు భూములు పంపిణీ చేయాలి. ఉప్పరపల్లె స్మశాన భూమిని సబ్జా చేసిన వారిపై పి.డి.ఆక్ట్ పెట్టాలి.**

**– పాలకులు, ప్రభుత్వ అధికారులు నిష్పాక్షికంగా పేద ప్రజలకు భూములు ఇవ్వాలి.**

**– ఉపాధి హామీ పనులు ప్రారంభించాలి.**

**– సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్.**




పొలిటికల్ పవర్ తెలుగు దినపత్రిక పిఎన్ 9టీవీ తెలుగు న్యూస్ వైయస్సార్ కడప జిల్లా బ్యూరో ఎం వెంకటేష్.

2026 ఫిబ్రవరి 23వ తేదీ ఉదయం 10 గంటలకు, పొద్దుటూరు ఎన్జీవో హోం నందు, వ్యవసాయ కార్మిక సంఘం (ఏ.ఐ.ఏ.డబ్ల్యూ.యూ.), కులవివక్షత వ్యతిరేక పోరాట సంఘం (కె.వి.పి.ఎస్.) సంయుక్తంగా జి.డేవిడ్ రాజు అధ్యక్షతన "భూ సదస్సు" జరిగింది. భూమిలేని పేదలను దేశించి భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్), సిపిఎం కడప జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ... ప్రొద్దుటూరు ఏటిపోరంబోకు ప్రభుత్వ భూములన్ని పేదలకు పంచాలని, భూ కబ్జాదారుల చెర నుండి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని, చౌడూరు, కల్లూరు, ఉప్పరపల్లె, చౌటపల్లి, అయ్యప్ప స్వామి గుడి, ఖాదర్ బాద్, అమృత నగర్, గోపవరం తదితర గ్రామీణ ప్రభుత్వ భూములు వందల ఎకరాలు గుర్రై ఉందని అన్నిచోట్ల ప్రభుత్వ భూమి బోర్డులను పెట్టాలని డిమాండ్ చేశారు. పాలక



ప్రభుత్వాలు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు నిష్పాక్షికంగా, నిష్కపటత లేకుండా పేదల అభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్రాల హక్కులను పాలక ప్రభుత్వాలే లాక్కుంటున్నాయని ఆరోపించారు. పేదరిక నిర్మూలనకై తెచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని పాతర పెట్టిన కేంద్ర ప్రభుత్వాన్ని గుణపాఠం నేర్పాలన్నారు. గ్రామీణ ల్యాండ్ మాఫియా రౌడీలపై రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారులు సమన్వయంతో పి.డి. యాక్ట్ కింద క్రిమినల్ కేసులు పెట్టి కట్టడి చేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.అన్వేష్ మాట్లాడుతూ... గ్రామీణ ఉపాధి హామీ పథకం పై గాంధీ బొమ్మను తొలగించిన బిజెపి ని, ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు. గాంధీ గ్రామ స్వరాజ్యాన్ని బిజెపి కార్పొరేట్ రాజ్యాంగా మార్చిందన్నారు. ఉపాధి హామీపై దాడిని గ్రామీణ పేదలు, రైతులపై దాడిగా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కే.సత్యనారాయణ, ఐద్వా మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ముంతాజ్ బేగం, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ సురేష్, చేనేత వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు డి.ఓబులేసు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాహుల్, డివైఎఫ్ఐ నాయకులు సునీల్, పొద్దుటూరు సిఐటియు నాయకులు సాల్మన్, విజయ్ కుమార్, బాలసుబ్బయ్య, వ్యవసాయ కార్మిక సంఘం పొద్దుటూరు మండల నాయకులు శేఖర్, ఐద్వా మహిళా సంఘం నాయకురాలు సుబ్బమ్మ, చెన్నారెడ్డి, భూమిలేని పేదలు పాల్గొన్నారు.

# పట్రా కులస్థుల కళ్యాణ మండపం ను పరిశీలించిన గౌరవ అధ్యక్షులు, వేముల ఎంపీపీ




పొలిటికల్ పవర్ తెలుగు దినపత్రిక పిఎన్9 టీవీ తెలుగు న్యూస్ వైఎస్ఆర్ కడప జిల్లా బ్యూరో ఎం వెంకటేష్

వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరు నియోజకవర్గం బ్రహ్మం గారి మఠం నందు పట్రా కులస్తులు ఆద్వర్యం లో నూతనంగా అత్యంత సుందరంగా నిర్మిస్తున్న పట్రా కులస్థుల కళ్యాణ మండపం మరియు అన్నదాన సత్రం ను ఆదివారం ఉదయం ఆంధ్ర ప్రదేశ్ పట్రా ప్రగతి మరియు సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పెద్దపోతుల చిన్న ఆంజనేయులు, వేముల ఎంపీపీ చల్లా గంగాదేవి వెంకట నారాయణ, సత్యసాయి జిల్లా అధ్యక్షులు, మాజీ యం.బి.సి డైరెక్టర్ గుజ్జు రామాంజనేయులు, సారే వెంకటేశ్వర్లు,తాళ్లపల్లి వెంకట రమణ, పెంచలయ్య సందర్శించి ప్రారంభోత్సవ పనులను పరిశీలించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ మార్చి 8న వ తేదీన బ్రహ్మం గారి మఠం లో నూతనంగా నిర్మించిన పట్రా నాయుళ్ళ కళ్యాణ మండపం ప్రారంభోత్స వానికి రాష్ట్రంలో నలుమూల నుంచే కాకుండా, పక్క రాష్ట్రలలో ఉన్నటువంటి ప్రతి ఒక్క పట్రా కులస్తులు పాల్గొని విజయవంతం చేయాలి అని, కళ్యాణ మండపం నిర్మాణానికి ఆర్థికం గా సహకరించిన ప్రతి ఒక్క పట్రా కులస్తునికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. దాదాపు 3 కోట్ల వ్యయంతో బ్రహ్మంగారిమఠం లోని కాలానికి అనుగుణంగా అత్యంత సుంద రంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టువంటి ఈ కళ్యాణ మండపం పట్రా కులస్తులకు ఎంతో గర్వకారణమని కావున ప్రతి ఒక్కరూ ఈ ప్రారంభోత్సవ వేడుకలకు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

# ఈనెల 23 ,24 ఏపీ అంగన్వాడి వర్కర్స్ తమ సమస్యల పరిష్కారం కొరకు దీక్షలు జయప్రదం చేయాలి

**– అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ కు కనీస వేతనాలు 26,000 కల్పించాలి**

**– సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు యన్ భైరవ ప్రసాద్....**

పొలిటికల్ పవర్ తెలుగు దినపత్రిక పిఆర్9 టీవీ తెలుగు న్యూస్ వైఎస్ఆర్ కడప జిల్లా బ్యూరో ఎం వెంకటేష్.

23/2/2026వ తేదీ ఉదయము 11 గంటలకు స్థానిక ఎమ్మార్వో ఆఫీస్ ముందు ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ (సిఐటియు ఆధ్వర్యంలోతమ న్యాయమైన సమస్యల పరిష్కారం కొరకు కనీస వేతనాలు 26,000 పెంచాలని పోరుమామిళ్ల ఎమ్మార్వో ఆఫీస్ ముందు 23వ తేదీన సోమవారము దీక్షలు ప్రారంభం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు యన్ భైరవ ప్రసాద్ సిఐటియు జిల్లా కమిటీ సభ్యురాలు ఓబులాపురం విజయమ్మ ఏపీ అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ పోరుమామిళ్ల ప్రాజెక్టు సహాయ కార్యదర్శి జ్యోతమ్మ ఇరువురు సంయుక్తంగా మాట్లాడుతూ.... ఏపీ అంగడి వర్కర్స్ హెల్పర్స్ అయినటువంటి ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కొరకు సిఐటియు ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్రంలో ప్రతి ఐసీడీస్ ఆఫీసు ముందు ఎమ్మార్వో ఆఫీసుల ముందు ఈరోజు నుంచి ఈ నెల 24 తేదీ వరకు తమ న్యాయమైన సమస్యలు, కనీస వేతనాలు 26 వేల రూపాయలు జీతం పెంచాలని ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, 8 సంవత్సరలుగా జీతాలు పెంచని తీరుపై దీక్షలు ప్రారంభమైనాయి అని వారన్నారు గత ప్రభుత్వము వైయస్సార్ పార్టీగా జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అంగన్వాడీ ఉద్యోగులు 42 రోజులుగా ఎంతో ఓర్పుతో తమ కష్టాలన్నీ తీరుతాయని ప్రభుత్వం జీతాలు పెంచుతాదని సమ్మెలో కెళ్ళి తమ బాధను ప్రభుత్వానికి విన్నవించుకుంటే ఆ ప్రభుత్వము జీతాలు పెంచక అంగన్వాడి వాళ్ళ పైన దుర్మార్గంగా లాటి చార్జీ చేపియడము జైలుకు పంపేయడం ఎన్నెన్నో దుర్మార్గాలు చేసినటువంటి ప్రభుత్వం వైయస్సార్ పార్టీఅనీ, ఆ పార్టీని విమర్శిస్తూ అప్పుడు ప్రతిపక్షం లో ఉన్నటువంటి టిడిపి బిజెపి జనసేన పార్టీలు కూటమిగా ఏర్పడి అంగన్వాడీల దీక్షలు సమ్మెలోకి వచ్చి మేమున్నామంటూ భరోసా ఇచ్చి ఓట్లు దండుకొని కుర్చీ ఎక్కి రెండు సంవత్సరాలైనా కూటమి పార్టీ వచ్చి ఈరోజు రెండు సంవత్సరాలు అయినా గాని ప్రభుత్వం వచ్చి ఏ ఒక్క రూపాయి



పెంచకుండా దోబూచులాడుతుందని వారు అన్నారు గత ప్రభుత్వాలు పెంచలేదని మేము పెంచుతామని ప్రగల్భాలు అలికిననటువంటి ఈ ప్రభుత్వం అంగన్వాడీల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదని వారన్నారు ఇప్పటికైనా ఈ ప్రభుత్వము అంగన్వాడీ వర్కర్లకు న్యాయమైనటువంటి డిమాండ్లను పరిష్కారం చేసి వాళ్ళకు కనీసం వేతనాలు కల్పించి ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యం కల్పించి వాళ్లకు భద్రత కల్పిస్తే ఈ కూటమి ప్రభుత్వానికి భవిష్యత్తు ఉంటుందని లేని పక్షం అయితే గత ప్రభుత్వానికి పట్టినగతి ఈకూటమి ప్రభుత్వనికి 2029లో పడతాది అనీ ఈరోజు ఈ సందర్భంగా వారు అన్నారు అంగన్వాడీలకు గ్రాడ్యుటి అమలు చేయాలని, జీతాలు పెంచాలని, పిఎడీఏలు చాలా కాలం నుంచి రాలేదని కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని పౌష్టిక ఆహార నాణ్యత పెంచాలని, హాస్టళ్లకు హై స్కూల్ లకు సంబంధించినటువంటి పిల్లలకు మాత్రమే ఎంత సన్న బియ్యం ఇవ్వడం అంగన్వాడి పసిపిల్లలకు దుడ్డు బియ్యం ఎంత దుర్మార్గము అని వారన్నారు ఇప్పటికైనా ఈ కూటమి ప్రభుత్వము అంగన్వాడి వర్కర్ల పైన గౌరవంతో వారికి అడిగినటువంటి కనీస వేతనాలు రూపంగా జీతాలు పెంచాలని వారి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బాలవీరయ్య, కుసులూరు రవి, విజయమ్మ జ్యోతిమ్మ, ఫాతిమా, రవణమ్మ, కాశమ్మ, దస్తగిరిమ్మ

అభినందనలతో....

యన్ భైరవ ప్రసాదు సిఐటియుజిల్లా ఉపాధ్యక్షులు

# రెవెన్యూ శాఖలో పెండింగ్‌లో ఉన్న భూ భారతి దరఖాస్తులపై తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించాలి

**– రాబోయే వారంలోగా పూర్తి స్థాయిలో దరఖాస్థుల పరిష్కారమే లక్ష్యంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశశీ**

పొలిటికల్ పవర్ తెలుగు దినపత్రిక వనపర్తి జిల్లా బ్యూరో 23 ఫిబ్రవరి 2026.

రెవెన్యూ శాఖలో పెండింగ్‌లో ఉన్న భూ భారతి దరఖాస్తులపై తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించాలని, రాబోయే వారంలోగా పూర్తి స్థాయిలో దరఖాస్థుల పరిష్కారమే లక్ష్యంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో భూ భారతి పెండింగ్ దరఖాస్తుల స్థితిగతులపై అన్ని మండలాల తహసీల్దార్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో పెండింగ్‌లో ఉన్న భూ భారతి దరఖాస్తులపై తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించాలని, రాబోయే వారంలోగా పూర్తి స్థాయిలో దరఖాస్థుల పరిష్కారమే లక్ష్యంగా పని చేయాలని ఆదేశించారు. రెవెన్యూ దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం జరుగకుండా చూడాలని సూచించారు. ముఖ్యంగా 60 రోజులకు పైగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై తహసీల్దార్ లు ప్రాధాన్యతతో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని పేర్కొన్నారు.రాబోయే వారంలోగా "జీరో పెండెన్సీ" లక్ష్యంతో పనిచేయాలని, దరఖాస్తులను క్లియర్ చేయాలని సూచించారు. పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియను జిల్లా కలెక్టర్ కార్యాలయం పర్యవేక్షిస్తుందని, ఫైళ్ల కదలికపై నిరంతరం మానిటరింగ్ ఉంటుందని తెలిపారు.కొన్ని మండలాల నుంచి ఆన్‌లైన్లో ఫైల్స్ తమ వద్దకి వస్తున్నాయని, కాని భౌతిక ఫైళ్లు



కార్యాలయాలకు చేరడం లేదని, ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచించారు. కొత్త మండలాల్లో తహసీల్దార్ కార్యాలయ భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేసి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ఎస్ ఐ ఆర్ లో భాగంగా మ్యాపింగ్ ప్రక్రియలో వెంకబడిన మండలాల్లో త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశం లో అదనపు కలెక్టర్ రెవెన్యూఖీమ్య నాయక్, ఏ ఓ బాను ప్రకాష్, తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధాప్యం లో ఉన్న తల్లిదండ్రుల పోషణ వారసుల బాధ్యత

**– సమస్యలు విన్న వెంటనే ఫోన్ ద్వారా అధికారులకు ఆదేశాలు జారి చేసిన జిల్లా ఎస్పీసునిత రెడ్డి ఐపీఎస్,**



పొలిటికల్ పవర్ తెలుగు దినపత్రిక వనపర్తి జిల్లా బ్యూరో 23 ఫిబ్రవరి 2026.

వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల సంరక్షణ, పోషణ పిల్లలపై వారసుల బాధ్యతని, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదద్రులను విస్మరించునట్లు పిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ. సునిత రెడ్డి ఐపీఎస్ హెచ్చరించారు. ప్రతి సోమవారం వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయములో నిర్వహించే ప్రజావాణిలో భాగంగా జిల్లాలో సోమవారం వివిధ ప్రాంతాల నుండి 16 మంది పిర్యాదుదారులు వివిధ సమస్యలపై నేరుగా జిల్లా ఎస్పీ. సునిత రెడ్డి ఐపీఎస్ కి ఫిర్యాదులు అందించారు. ఫిర్యాదు చేసిన ప్రతి ఫిర్యాదుపై వనపర్తి ఎస్పీ స్పందించి స్వయంగా ఫిర్యాదును పరిశీలించి సంబంధిత పోలీస్టేషన్ అధికారులకు తక్షణమే సదరు ఫిర్యాదులపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అదేశాలు జారీ చేశారు. వృద్ధుల గౌరవం కాపాడటం ప్రతి కుటుంబపు బాధ్యత తల్లిదండ్రులు పిల్లల కోసం కష్టపడిన రోజుల్ని గుర్తు చేసుకుంటూ, దీనితో ఫిర్యాదు దారులకు న్యాయం జరుగుతుందనే బరోసాను కలిగించే విధంగా జిల్లా ఎస్పీ గారు చర్యలు తీసుకోవడంపై వచ్చిన ఫిర్యాదుదారులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రజావాణిలో మొత్తం 16 ఫిర్యాదుల్లో 02 – భార్యభర్తల పిర్యాదులు 07 – భూతగాదాల ఫిర్యాదులు 07 – పరస్పర గొడవలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయని ఆమె తెలిపారు.

# ఇంటర్ పరీక్ష: ఇది విధి రాసిన అగ్ని పరీక్ష.. ఇంట్లో తండ్రి మృతదేహం.. మరోవైపు ఇంటర్ ఎగ్జామ్..

పొలిటికల్ పవర్ న్యూస్ 9టీవీ తెలంగాణ స్టేట్ బ్యూరో కూశనపెల్లి సతీష్:

పేద కుటుంబం.. ఆ తండ్రి తనకొచ్చిన కష్టం తన బిడ్డకు రాకూడదని అనుకున్నాడు. బాగా చదువుకుని మంచి జీవితాన్ని సాధించాలని ఆకాంక్షించాడు.. ఉన్నతంగా చదివించాలని కలలు కన్నాడు. ఇలా కొడుకు టెన్త్ అయిపోయింది. ఇంటర్ చదవుతున్నాడు. తెల్లారితే కొడుకు ఇంటర్ పరీక్ష. ఉన్నట్టుండి విషాదం. గుండెపోటుతో మృతి చెందాడు. ఇంట్లో కన్నతండ్రి మృతదేహం. ఇటు పరీక్ష.. ఇలాంటి అగ్ని పరీక్ష మరెవరికీ రాకూడదు అంటూ కన్నీరుమున్నీరయ్యాడు. ఇలా ఆ విద్యార్థి కష్టం హృదయ విదారకంగా మారింది. నేటి నుండి ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. అయితే పరీక్షల రోజున అర్ధాంతరంగా తండ్రి గుండెపోటుతో మరణించడం.. ఆ బిడ్డను పరీక్షకు హాజరు కావాలా వద్దా అనే మీమాంసలో పడేసింది. ఈ ఘటన ఏపీలో నెల్లూరు జిల్లా సంగం మండలంలో జరిగింది. నెల్లూరు జిల్లా సంగం మండల కేంద్రంలోని కందల శివకుమార్




ఆదివారం గుండెపోటుతో మరణించాడు. అతని కుమారుదు రామ సాయి ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు.. సోమవారం ఉదయం నుండి ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు మొదలయ్యాయి.. ఇంట్లో తండ్రి మృతదేహం ఒక వైపు మరో వైపు ఇంటర్ పరీక్షలు.. పరీక్షలకు హాజరు కావాలా? వద్దా ? ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో విద్యార్థి రామసాయి దుఃఖ సాగరమయ్యాడు.

# ప్రజావాణి లో ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు వేగంగా పరిష్కరించాలి

**– జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం**

పొలిటికల్ పవర్ తెలుగు దినపత్రిక వనపర్తి జిల్లా బ్యూరో 23 ఫిబ్రవరి 2026.



ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, అర్జీలను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్య నాయక్, ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో కలిసి హాజరై ప్రజల నుంచి అర్జీలు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత అధికారులపై ఉంద న్నారు. ప్రజావాణి కార్యక్రమంలో 40 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, అర్జీలను పరిశీలించి, సత్వర పరిష్కారం చూపేలా సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, వెంటనే పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీఎం, జిల్లా మంత్రి ప్రజావాణి నుంచి వచ్చిన, పెండింగ్ లో ఉన్న అర్జీలను సైతం వారంలో పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం పోలీస్ కమిషనరేట్

**– రాష్ట్ర స్థాయి క్రీడల్లో మెరిసిన పోలీస్ క్రీడాకారులు–పోలీస్ కమిషనర్ అభినందనలు**

**– ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహిస్తామని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీ అంబర్ కిషోర్ తెలిపారు.**



పొలిటికల్ పవర్ న్యూస్ 9టీవీ తెలంగాణ స్టేట్ బ్యూరో కూశనపెల్లి సతీష్:

క్రీడల్లో ప్రతిభ కనబరిచిన పోలీస్ క్రీడాకారులను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. 4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్–2026 సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ గ్రౌండ్స్‌లో హోరాహోరీగా నిర్వహించబడిన క్రీడోత్సవాలు రెండు రోజుల క్రితం ముగిశాయి. ఈ క్రీడల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన పోలీస్ క్రీడాకారులను సోమవారం రామగుండం పోలీస్ కమిషనర్ అభినందించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అభినందన సభకు కమిషనర్ ముఖ్య అతిథిగా హాజరై, పతకాలు సాధించిన క్రీడాకారులను వ్యక్తిగతంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచినందుకు క్రీడాకారులను అభినందించారు. క్రీడలకు సమయం కేటాయించే పోలీస్ అధికారులకు పూర్తి స్థాయి సహకారం అందించబడుతుందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి విజయాలు సాధించి శాఖకు మరింత కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడల్లో విజయం సాధించడం క్రమశిక్షణ, సమన్వయం మరియు నిరంతర సాధన వల్లే సాధ్యమని పేర్కొంటూ, శాఖ తరపున క్రీడాకారులకు అన్ని విధాల మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయని, విధి నిర్వహణలో క్రీడాస్ఫూర్తి ఎంతో అవసరమని తెలిపారు. 4వ తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ మీట్–2026లో కాళేశ్వరం జోన్ నుండి 150 మంది పాల్గొనగా, అందులో 30 మంది క్రీడాకారులు 23 పతకాలు సాధించారు. అందులో బంగారు పతకాలు –7, వెండి పతకాలు –8, కాంస్య పతకాలు –8 ఉన్నాయి. రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు చెందిన 15 మంది క్రీడాకారులు, ములుగు జిల్లా నుండి 5 మంది, కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా నుండి 6 మంది, జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుండి 4 మంది పతకాలు సాధించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఏవో శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ కృష్ణ, ఆర్ఐలు శేఖర్, పెద్దన్న, సీసీ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రేమ్సాగర్ రావు

పొలిటికల్ పవర్ న్యూస్ 9టీవీ తెలంగాణ స్టేట్ బ్యూరో కూశనపెల్లి సతీష్:





మంచిర్యాల నియోజకవర్గం లక్షెట్టిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ,నైతిక విలువలు అలవర్చుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆయన సూచించారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి జిల్లా,రాష్ట్ర స్థాయిలో పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పలు విద్యార్థులు నృత్యం చేసిన విద్యార్థులకు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు బహుమతులు అందజేసి అభినందించారు. కళాశాల అభివృద్ధికి అవసరమైన సౌకర్యాల విషయంలో తన సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ముందుగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు కి ఘన స్వాగతం పలికిన ఉపాధ్యాయులు, విద్యార్థులు. అనంతరం ఎమ్మెల్యే గారిని శాలువాతో మరియు గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కొట్నాక తిరుపతి, కళాశాల ప్రిన్సిపాల్ లక్మణ్, మున్సిపల్ చైర్మన్ దొంత అంజలి నర్సయ్య, మంచిర్యాల జిల్లా ఆర్టిఏ మెంబర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, స్వరంచులు, వార్డు మెంబర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు..


# హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఇన్‌స్టా పరిచయం దారుణంగా మారింది - బ్లాక్‌మైల్‌తో లక్షల మోసం, నిందితుడి అరెస్ట్

పొలిటికల్ పవర్ న్యూస్ 9టీవీ తెలంగాణ స్టేట్ బ్యూరో కూశనపెల్లి సతీష్.

హైదరాబాద్ నగరంలోని బంజారాహిల్స్ ప్రాంతంలో సోషల్ మీడియా పరిచయం ఓ యువతికి తీవ్ర మానసిక వేదనకు దారితీసిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం పెంచుకుని, ఆ తర్వాత బ్లాక్‌మైల్ చేస్తూ లక్షల రూపాయలు కాజేసిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బంజారాహిల్స్ రోడ్ నం.14లో నివసిస్తున్న 24 ఏళ్ల యువతి తన ఇంట్లో విద్యుత్ పనుల కోసం ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న కొమ్ము వంశీకృష్ణ (20)ను సంప్రదించింది. పనులు పూర్తి చేసిన మరుసటి రోజు వంశీకృష్ణ ఇన్‌స్టాగ్రామ్‌లో "హాయ్" అంటూ మెసేజ్ పంపడంతో ఇద్దరి మధ్య చాటింగ్ ప్రారంభమైంది. పరిచయం క్రమంగా సన్నిహితంగా మారింది. కొంతకాలానికి నిందితుడు డబ్బులు అవసరమని చెప్పి మొదట రూ.20,000 తీసుకున్నాడు. అనంతరం వ్యక్తిగత విషయాలను బయటపెడతానని బెదిరిస్తూ యువతిని బ్లాక్‌మైల్ చేయడం ప్రారంభించాడు. ఈ విధంగా విడతలవారీగా రూ.2 లక్షలు, ఆ తర్వాత మరోసారి రూ.2 లక్షలు తీసుకుని మొత్తం లక్షల రూపాయలు కాజేశాడు. డబ్బుల డిమాండ్లు పెరగడంతో యువతి అతనితో సంబంధం తెంచుకోవాలని నిర్ణయించుకుంది. దీంతో కక్ష పెంచుకున్న వంశీకృష్ణ ఆమె రాకపోకలను గమనిస్తూ అడ్డగించడం, వేధించడం ప్రారంభించాడు.



మూడు రోజుల క్రితం ఆటో కోసం ఎదురు చూస్తున్న సమయంలో కత్తితో బెదిరించి రూ.2,000 లాక్కున్నాడు. ఈ ఘటనతో బాధితురాలు తీవ్ర భయాందోళనకు గురైంది. ప్రాణహాని ఉందని, బయటకు వెళ్లలేకపోతున్నానని, కార్యాలయానికి కూడా హాజరు కాలేకపోతున్నానని పేర్కొంటూ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన బంజారాహిల్స్ పోలీసులు నిందితుడిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనతో సోషల్ మీడియా పరిచయాల విషయంలో జాగ్రత్త అవసరమని పోలీసులు సూచించారు. అనుమానాస్పద ప్రవర్తన, బెదిరింపులు, బ్లాక్‌మైల్ వంటి ఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# మోడై నిలిచిన మనసుకు మోహనమై మోదము పంచే ఉదయం

పొలిటికల్ పవర్ న్యూస్ 9టీవీ తెలంగాణ స్టేట్ బ్యూరో కూశనపెల్లి సతీష్

వెలితిలో మునిగి శిధిలమవుతున్న మదిని చేయూత నిచ్చి నిలబెట్టే ఉదయం
వెంటాడే మమతలతో వేటాడే తలపులకు ఊరట నిచ్చే ఉదయం
శూన్యంలో తారాడుతూ దైన్యం నిండిన ఎదదకు చిరు ఆశ కలిగించే ఉదయం
చేరువైన చెలిమి చెప్పకుండా దూరమై చెమ్మగిల్లిన కన్నుల నవ్వు నింపే ఉదయం
కళ తప్పిన కలలతో కలవరపడే కనులకు కనువిందు కలగ చేసే ఉదయం
అగాధమంటి జీవనజలధిలో ఆణిముత్యమంటి అనుభూతి అందచేసే ఉదయం
గుండె పొరలో మండే మంటను చల్లార్చి మనసు శాంతితో నింపే ఉదయానికి.

# మదనాపూర్ లో ఇటుక తయారీ పరిశ్రమలకు రైతు బంధు

## - పచ్చని పంట పొలాలు సాగుచేస్తున్నట్లు,రైతుల పేరిట ప్రభుత్వానికి బురిడీ
## రూ.లక్షల్లో రైతుబందు స్వాహా



పొలిటికల్ పవర్ తెలుగు దినపత్రిక వనపర్తి జిల్లా బ్యూరో 23 ఫిబ్రవరి 2026.

వనపర్తి జిల్లా మదనాపూర్ మండలంలోని వ్యవసాయ పొలాల్లో యథేచ్చగా అక్రమ ఇటుక పరిశ్రమ నిర్వహిస్తూ, కోట్ల రూపాయలు గడిస్తున్నారు కొందరు వ్యాపారులు. పచ్చని పంట పొలాలు పండిస్తున్నట్లు ప్రభుత్వానికి లెక్కలు చెపుతూ, ఇప్పటికే లక్షల రూపాయల రైతుబందు నొక్కేశారు. అధికారులు కూడా ఈ భూముల వివరాలను ప్రభుత్వానికి నివేదిక ఇవ్వకుండా, వ్యవసాయ భూములుగానే పరిగణిస్తున్నారు.అందుకే ఆ పొలాల్లో ఇటుక పరిశ్రమలు నడుపుతున్నా, రైతుబందు మాత్రం కంటిన్యూ గా వస్తున్నట్లు తెలిసింది. ఈ పరిశ్రమకు నాన్ అగ్రికల్చర్ సరిఫికెట్, పొల్యూషన్ సర్టి ఫికెట్,ట్రేడ్ లైసెన్స్,లేబర్ లైసెన్స్,మైనింగ్ పర్మిషన్,జీఎస్టీ, అనుమతులు లేకుండానే కోట్లలో వ్యాపారం జరుగుతుంది.ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖల అధికారులు మాత్రం మా సొమ్ము ఏమి పోతుందిలే ప్రభుత్వానిదే కదాని నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహస్తున్నట్లు అర్థమవుతుందని ప్రజలు వాపోతున్నారు.బిస్కెట్ పాకెట్ అమ్మేవాడు కూడా ప్రభుత్వానికి టాక్సీ చెల్లిస్తున్నాడు. లక్షల్లో ఇటుక తయారు చేసి, కోట్లలో వ్యాపారం చేస్తూ, సామాన్యులకు సైతం అధిక ధరలకు ఇటుకను విక్రయించి రక్తం త్రాగుతున్న వ్యాపారులపై తక్షణ చర్యలకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయాలని పలువులు కోరుతున్నారు.ఈ విషయంలో నాలా అనుమతులు మాత్రమే తీసుకునేందుకు స్థానిక తహసీల్దార్ ఇటుక వ్యాపారులకు నోటీసులు జారీ చేశామన్నారని తెలిపారు.

# వీఎస్ఆర్ విమానం




పొలిటికల్ పవర్ తెలుగు దినపత్రిక పిఎన్9 టీవీ తెలుగు న్యూస్ ఎడిటర్ డెస్క్

టీడీపీ మౌనంతో అందరిలోనూ మరింతగా అనుమానం అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మృతి వెనుక శక్తులపై రోహిత్ పవార్ ఆరోపణలు రూ.35 కోట్ల విలువయ్యే విమానానికి రూ.265 కోట్ల ఇన్సూరెన్స్ ఎందుకు చేశారు? విమానంలో టాయ్‌లెట్ వెనుక పెట్రోల్ క్యాన్లు ఎందుకు పెట్టారు? ట్యాంకులో సామర్థ్యానికి మించి ఎందుకు ఫ్యూయల్ నింపారు? ప్రమాదంలో బ్లాక్ బాక్స్ కాలిపోవడమేంటి? ఎంత వరకు నిజం? ఏ విచారణ జరక్క ముందే వీఎస్ఆర్‌కు టీడీపీకి చెందిన కేంద్ర మంత్రి క్లీన్‌చిట్ ఎలా ఇచ్చారు? ఎందుకంటే వీఎస్ఆర్ వెంచర్స్ విమానాల కొనుగోలుకు నిధులిచ్చింది హెరిటేజ్ ఫిన్‌లీజ్ కాబట్టే హెరిటేజ్ ఫిన్‌లీజ్ అనేది సీఎం చంద్రబాబు కుటుంబ సంస్థ వీఎస్ఆర్ ద్వారా దుబాయ్‌లో రూ.650 కోట్లతో టీడీపీ కీలక నేత లెగసీ విమానం కొనుగోలు ఇదే వీఎస్ఆర్ విమానాల్లో సీఎం చంద్రబాబు కుటుంబం చక్కర్లు అందుకే కేంద్ర మంత్రి రామ్మోహన్ దర్యాప్తు సాగనివ్వడం లేదన్న రోహిత్ రోహిత్ వ్యాఖ్యల్లో నిజం ఉండటం వల్లే టీడీపీ, హెరిటేజ్ నోరు విప్పడం లేదంటున్న విశ్లేషకులు

# పెళ్లి పేరిట జరిగే మోసాలు, బ్లాక్ మెయిల్స్ పట్ల యువతులు అప్రమత్తంగా ఉండాలి!

## - పరువుకు భయపడి మౌనంగా ఉండొద్దు..
## - ధైర్యంగా షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేయండి
## - హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్.



పొలిటికల్ పవర్ న్యూస్ 9టీవీ తెలంగాణ స్టేట్ బ్యూరో కూశనపెల్లి సతీష్ : హైదరాబాద్ పెళ్లి ముసుగులో యువతులను మోసగిస్తూ, బ్లాక్ మెయిల్ కు పాల్పడుతున్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ ఎక్స్ వేదికగా హెచ్చరించారు. కేవలం ప్రేమ వ్యవహారాల్లోనే కాకుండా, పెద్దలు కుదిర్చిన సంబంధాల మాటున కూడా నిశ్చితార్థం తర్వాత యువతులకు మాయమాటలు చెప్పి లొంగదీసుకోవడం, ఆపై అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్న ఘటనలపై ఇటీవల హైదరాబాద్ షీ టీమ్స్ కు ఫిర్యాదులు అందుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో యువతులు, వారి తల్లిదండ్రులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

మోసం సాగుతోందిలా..


ముందుగా పక్కా ప్రణాళికతో, సంప్రదాయబద్ధంగా పెళ్లి చూపులు, ఆపై ఘనంగా నిశ్చితార్థం చేసుకుంటున్నారు. 'ఇక పెళ్లి ఖాయమైంది కదా' అనే చనువుతో యువతులకు దగ్గరవుతున్నారు. 'ఎలాగూ పెళ్ళే కదా.. ఇప్పుడైతే ఏంటి?' అని మాయమాటలు చెబుతూ, ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేస్తూ ఒత్తిడితో శారీరకంగా లోబరుచుకుంటున్నారు. తీరా కోరిక తీరాక అసలు రంగు బయటపెడుతున్నారు. పెళ్లి పీటలు ఎక్కాలంటే తమకు భారీగా డబ్బు కావాలని, అదనపు కట్నం ఇస్తేనే తాళి కడతామని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే పెళ్లి రద్దు చేసుకుంటామని బెదిరింపులకు పాల్పడుతున్నారు. నిశ్చితార్థం జరిగిపోవడం, బంధుమిత్రులందరికీ తెలిసిపోవడంతో.. ఇప్పుడు పెళ్లి ఆగిపోతే సమాజంలో పరువు పోతుందన్న భయంతో చాలామంది యువతులు, వారి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెనుకడుగు వేస్తున్నారు. దీన్నే ఆసరాగా చేసుకుంటున్న నయవంచకులు మరింతగా వేధింపులకు గురిచేస్తున్నారు. 'పరువు పోతుందన్న భయంతో మౌనంగా ఉంటే.. జీవితాంతం నరకం అనుభవించాల్సి వస్తుంది. కాబట్టి ఎవరూ భయపడకుండా ధైర్యంగా ముందుకు రావాలి' అని సీపీ స్పష్టం చేశారు.

ఇవి గుర్తుంచుకోండి..

పెద్దలు కుదిర్చిన సంబంధమే కదా అని గుడ్డిగా నమ్మొద్దు. అబ్బాయి ప్రవర్తన, స్నేహితులు, అలవాట్లపై పెళ్లికి ముందే క్షుణ్ణంగా ఆరా తీయాలి. నిశ్చితార్థం జరిగినప్పటికీ, పెళ్లి పీటలు ఎక్కేవరకు అప్రమత్తంగానే ఉండాలి. పెళ్లికి ముందే ఏకాంతంగా కలవడానికి, శారీరక సంబంధానికి ఒత్తిడి చేస్తే కచ్చితంగా అనుమానించాలి. వారి ప్రయత్నాలను మొహమాటం లేకుండా తిరస్కరించాలి. డబ్బు డిమాండ్ చేసినా, బ్లాక్ మెయిల్ చేసినా భయపడొద్దు. మోసగాళ్ల చేతిలో చిక్కుకుంటే సంకోచించకుండా పోలీసులను ఆశ్రయించండి. బాధితుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతాం. ఇలాంటి బెదిరింపులు ఎదురైతే వెంటనే హైదరాబాద్ షీ టీమ్స్ వాట్సాప్ నంబర్ 9490616555 కు గానీ, డయల్ 100 కు గానీ కాల్ చేసి ఫిర్యాదు చేయాలి.

# అస్తమించిన శ్రమజీవి

## నెలకు 90 రూపాయల నుండి పంచాయతీ ప్రజల శ్రేయస్సు కోసం పారిశుధ్యం పనిచేసిన తంబర్ల లక్ష్మి.





జూలూరుపాడు, ఫిబ్రవరి 23, (పొలిటికల్ పవర్ ) ప్రతినిధి :

మంద లక్ష్మినారాయణ మండల మెయిన్ సెంటర్ అయినటువంటి వెంగన్నపాలెం గ్రామ ఉమ్మడి గుండెపూడి పంచాయతీలో ఉండగా అప్పటినుండి గుండెపుడి పంచాయతీలో పారిశుద్ధ్యం కార్మికురాలుగా నెలకు 90 రూపాయలు జీతం తీసుకుంటూ పంచాయతీ ప్రజల ఆరోగ్యమే ముఖ్యంగా ముందుకు సాగుతూ ఎంతటి కష్టమైన పనిని కూడా ఇష్టంగా చేస్తూ ప్రతి ఒక్కరిని చిరునవ్వుతో పలకరిస్తూ ముందుకు సాగిన తంబర్ల లక్ష్మి ఈరోజు లేకపోవడం చాలా బాధాకరమైన విషయం అంటూ వెంగన్నపాలెం మెయిన్ సెంటర్లో ఎవరి నోట విన్న ఇదే మాట విన్నటువంటి సందర్భాల్లో ప్రతి ఒక్కరికి దుఃఖం ఆగనటువంటి పరిస్థితి ఏదిఏమైనా అందర్నీ చిరునవ్వుతో పలకరిస్తూ చలాకీగా తిరిగేటటువంటి ఆమె లేకపోవడం కుటుంబ సభ్యులకి కాకుండా పంచాయతీ ప్రజలకు కూడా తీరని లోటే అంటున్నారు కొందరు ప్రజలు.

# ఖమ్మం కొత్త బస్ స్థాండుకు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ పేరు పెట్టాలి



పొలిటికల్ పవర్ తెలుగు దినపత్రిక పిఎన్ 9టీవీ తెలుగు న్యూస్ ఖమ్మం జిల్లా బ్యూరో బత్తుల గోపాలరావు. ఖమ్మం న్యూస్:-

ఖమ్మం పట్టణంలోని నూతన బస్ స్థాండుకు భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరు పెట్టాలని ఎస్సీ ఎస్టీ బీసీ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ సేవా సంఘం ఘాటుగా డిమాండ్ చేసింది ఏప్రిల్ 14 జయంతి సందర్భంగా ప్రభుత్వం అధికార ప్రకటన చేసి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ బస్ స్థాండు గా నామకరణ చేయాలని విజ్ఞప్తి చేసింది ఫిర్యాదుల దినం సందర్భంగా జిల్లా కలెక్టర్ ను కలిసి వినతి పత్రం అందజేయగా ప్రభుత్వం తో చర్చించి డిమాండ్ నెరవేర్చే దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు కూడా పార్టీలకు అతీతంగా ముందుకు వచ్చి అంబేద్కర్ పేరు ప్రకటించాలని స్పష్టం చేశారు ప్రపంచ దేశాల్లో జై భీమ్ నినాదాలతో అంబేద్కర్ విగ్రహాలకు నివాళులు అర్పిస్తుంటే ఖమ్మంలో మాత్రం నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు గుర్తు తెలియని వ్యక్తుల పేర్లతో విగ్రహాలు ఏర్పాటు చేస్తూ కాలయాపన చేయడం మానుకుని రాజ్యాంగ శిల్పికి తగిన గౌరవం ఇవ్వాలని హెచ్చరించారు జయంతి లోపే నామకరణపై స్పష్టమైన ప్రకటన చేయకపోతే ప్రజా ఉద్యమాలు తప్పవని ప్రకటించారు.

# అసెంబ్లీలో ఇవీ చర్చించాలి -నార్నె వెంకట సుబ్బయ్య




Feb 22,2026 పొలిటికల్ పవర్ తెలుగు దినపత్రిక పిఎన్9 టీవీ తెలుగు న్యూస్ ఎడిటర్ డెస్క్ హైదరాబాద్

ఎమ్మెల్యేలందరూ ఉదయం తొమ్మిదికి అసెంబ్లీ సమావేశాలకు రావాలని, సమస్యలను సీరియస్‌గా చర్చించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఇటీవల ఆదేశించటం అభినందనీయం. అయితే వారు ఏ సమస్యల మీద చర్చిస్తారో తెలియదు. ముఖ్యంగా పట్టణాలలో ఇంటి పన్ను విషయం చర్చించాలి. గత ప్రభుత్వం హౌస్ టాక్స్ ప్రతి సంవత్సరం 15 శాతం పెంచుతూ బిల్ తెచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా దానినే కొనసాగిస్తుంది. అంటే ప్రతి సంవత్సరం15 శాతం. ఇలా పెంచుకుంటూ పోతే చివరికి సామాన్యుడికి టాక్స్ కట్టలేని స్థితి వస్తుంది. కనుక తక్షణమే 15 శాతం ఇంటి పన్ను కలుపుతూ పోయే బిల్లు రద్దు పరచేలా అసెంబ్లీలో చర్చించాలి. రద్దు చేయాలి. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించినా బస్టాండుకు వెళ్ళినప్పుడు మరుగుదొడ్లు వాడితే మాత్రం ఐదు రూపాయలు చెల్లించాల్సి వస్తున్నది. పక్క రాష్ట్రమైన తెలంగాణలో హైదరాబాద్ గాంధీ బస్టాండులో తాటికాయంత అక్షరాలతో "ఉచిత మూత్రశాల" అని ఉంటుంది. సినిమా హాళ్లు, హోటళ్లకు వెళ్లినా ఉచిత మూత్రశాల ఉంటుంది. విజయవాడ, గుంటూరులో, అన్ని బస్టాండ్లలో ఐదు రూపాయలు ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. కనుక తక్షణమే ఆర్టీసి బస్టాండుల్లో ఉచిత మూత్రశాలలు ఏర్పాటు చెయ్యాలి. తరువాత రాష్ట్రంలో దొంగబాబాలు ప్రభుత్వ భూములను ఆక్రమించి ఆశ్రమాల పేరుతో మోసం చేస్తున్నారు. తక్షణం ఈ అంశాలపైనా అసెంబ్లీలో చర్చించి, తగు చర్యలకు ఆదేశించాల్సిందిగా కోరుతున్నాం.

నార్నె వెంకట సుబ్బయ్య

# బొడ్డు శశి కుమార్ కుటుంబ సభ్యులకు 20000/- రూపాయలు ఫిక్స్ డిపాజిట్



పొలిటికల్ పవర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో రాంప్రసాద్

గత నెల కరీంనగర్ లో ఆక్సిడెంట్లో చనిపోయిన రాశీపూర్ ఏరియాలోని పేద కుటుంబానికి చెందిన మున్సిపల్ పారిశుద్ధ కార్మికుడు బొడ్డు శశి కుమార్ కుటుంబ సభ్యులకు 20000/- రూపాయలు ఫిక్స్ డిపాజిట్ రూపంలో భార్య బొడ్డు ప్రసన్నకు ఆర్థిక సహాయాన్ని అందించి చేయూత నిచ్చిన ఫ్రెండ్లీ వాకర్ అసోసియేషన్ GP గ్రౌండ్ రాశీపూర్, కరీంనగర్. అసోసియేషన్ కమిటీ గౌరవాధ్యక్షులు బుర్ర జగదీశ్వర్ గౌడ్ PRO 304DIST కరీంనగర్, కమిటీ అధ్యక్ష కార్యదర్శులు గంగా తిరుపతి మధుసూదన్ గౌడ్, సలహాదారు విష్ణుభక్తుల రాజేందర్, లీగల్ అడ్వైజర్ ఖజ మూర్తి, ఉపాధ్యక్షులు అమరేంధర్ రెడ్డి, మాడ మల్లారెడ్డి, ఎడ్ల రమేష్', భూపతి రెడ్డి, వెంకన్న యాదవ్, సుధాకర్ రెడ్డి, పిట్టల రాజు, విజయ్ం, నరసింహారెడ్డి, సారంగపాణి, రమేష్, చారి మరియు సీనియర్ వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

# హిట్లర్ కాలంలో జర్మనీలో నాజీ పాలన ప్రచారం కోసం గోబెల్స్ సినిమాను అత్యంత ప్రభావవంతంగా ఉపయోగించాడు

పొలిటికల్ పవర్ తెలుగు దినపత్రిక పిఆర్9 టీవీ తెలుగు న్యూస్. ఎడిటర్ డెస్క్.

హిట్లర్‌ను దేవుడిగా కీర్తిస్తూ 1935లో వచ్చిన 'ట్రయంఫ్ ఆఫ్ ది విల్' అత్యంత ముఖ్యమైన నాజీ ప్రచార చిత్రాలలో ఒకటి. 1938లో 'ఒలింపియా' చిత్రం ఆర్యన్ జాతి అథ్లెటిక్ పరాక్రమాన్ని ప్రపంచానికి చాటితే, మిలియన్ల మంది యూదుల మారణహోమాన్ని శాస్త్రీయంగా సమర్థించడానికి 'ది ఎటర్నల్ జ్యూ' అనే డాక్యుమెంటరీ రూపొందించబడింది. ఐరోపా నుండి తుడిచిపెట్టుకుపోవాలని హిట్లర్ చేసిన ఉద్రేకపూరిత ప్రసంగం తర్వాత చప్పట్లతో ఈ డాక్యు మెంటరీ ముగుస్తుంది. అదేమాదిరిగా భారతదేశంలోనూ గోబెల్స్ తరహా సినిమాలు పునరావృతం అవుతున్నాయి. ఉన్నత కులాల హిందువులను కీర్తించే సినిమాలు, విదేశీ ముస్లిం పాలకులచే దేశం నాశనం చేయబడిందని చూపే సినిమాలు, ముస్లింలు ప్రేమ నటిస్తూ... హిందూ అమ్మాయిలను కిడ్నాప్ చేసి మతమార్పిడి చేస్తున్నారని నిరూపించడానికి ప్రయత్నించే 'ది కేరళ స్టోరీ' వంటి సినిమాలు దేశంలో విద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్నాయి.

1960 నాటి 'మా భూమి' వంటి సినిమాలు సామాజిక మార్పునకు ఎంతగానో దోహద పడ్డాయి. సినిమా అనేది ప్రజలను ఏకం చేయడానికి వారధిగా వుండాలి. కానీ, బిజెపి అధికారం లోకి వచ్చిన తర్వాత సినిమాను ప్రజల మధ్య విభజనలు సృష్టించే సాధనంగా మార్చారు. కేరళ ప్రజల్లోని సామరస్యతను నాశనం చేసే లక్ష్యంతో, ఉద్దేశపూర్వకంగా విడుదల చేసిన 'కేరళ స్టోరీ-2' చిత్రం రాష్ట్రంపై జరుగుతున్న మరో సాంస్కృతిక యుద్ధం. 2023లో వచ్చిన 'కేరళ స్టోరీ' చిత్రం ఆసాంతం...మతోన్మాద మూకలు కేరళ గురించి వ్యాప్తిచేస్తున్న కొండంత అబద్ధాల ఆధారంగా రూపొందిన కట్టు కథ. కేరళకు చెందిన ముప్తై రెండు వేల మంది మహిళలు ఇస్లాంలో చేరారనే నినాదంతో ఈ చిత్రం విడుదలైంది. దేశంలోని లౌకిక సమాజం దీనికి వ్యతిరేకంగా తీవ్ర నిరసన వ్యక్తం చేయడంతో.. ముప్తై రెండు వేల మంది కేవలం ముగ్గురిగా మారారు. ఈ అబద్ధాల పునాదిపై నిర్మించిన కట్టుకథకు గాను సుదీప్తో సేన్ 2025లో ఉత్తమ దర్శకుడిగా జాతీయ అవార్డును అందుకున్నారు. తాజాగా 'గోస్ బియాండ్' పేరుతో విడుదలైన 'కేరళ స్టోరీ 2' టీజర్... మొదటి భాగం కంటే ఎక్కువ ప్రమాదకరంగా, కేరళతో పాటు దేశవ్యాప్తంగా ఉద్రిక్తతలను మరింత రెచ్చగొట్టేదిగా వుంది.

లౌకిక విలువలను, సోదరభావాన్ని నిలబెట్టిన కేరళను చూసి భయపడుతోన్న ఆర్‌ఎస్‌ఎస్, సంఘ పరివార్ శక్తులు... కేరళను ఉగ్రవాదానికి పుట్టినిల్లుగా చిత్రీకరించాలనే మతతత్వ ఎజెండాతో ఈ తరహా సినిమాలను ప్రజల్లోకి వదులుతున్నారు. 'మతం పేరుతో విద్వేషాన్ని పెంచుకుంటూ పోతే, అది మన ఇంటినే దహించివేస్తుంది' అంటారు ప్రముఖ రచయిత ఖుష్వంత్ సింగ్. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక భారతదేశం. ముఖ్యంగా కేరళ రాష్ట్రం... అన్ని మతాల ప్రజలు కలిసిమెలిసి వుండే సంస్కృతికి పెట్టింది పేరు. ఆ ప్రజలను నేరస్తులుగా, ఉగ్రవాదులుగా చిత్రీకరించే ఇలాంటి సినిమాను సెన్సార్ బోర్డు ఎలా అనుమతిస్తుంది? 'ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'బీఫ్' అనే పదాన్ని, 'జానకి' అనే పేరును కూడా ఉపయోగించకుండా సినిమాలను నిరోధించారు. ఆ భాగాలను కత్తిరించిన తర్వాతనే ఆ చిత్రాలను ప్రదర్శనకు అనుమతించారు. వేర్పాటువాదాన్ని ప్రేరేపించే విషపూరిత సృజన 'కేరళ స్టోరీ-2'కు క్లీన్ యుఎ సర్టిఫికెట్ ఇవ్వడం శోచనీయం. 'సమాజంలో విభజన, విద్వేషాన్ని వ్యాప్తిచేసే లక్ష్యంతో నిర్మించిన విషపూరిత చిత్రం ఎలా అనుమతించబడుతుందో ఆశ్చర్యంగా ఉంది' అని కేరళ ముఖ్యమంత్రి సైతం ఘాటుగా స్పందించారు. కేరళ నిజమైన చరిత్ర వర్గపోరాటం, త్యాగాలు, సామాజిక సంస్కరణలతో కూడుకున్నది. సామాజిక సూచికలలో కేరళ సాధించిన పురోగతి, నిరుపేదలను విముక్తి చేసే ప్రయత్నం, కొండచరియలు విరిగిపడే భూమిలో అద్భుతంగా మనుగడ సాగించడం నిజమైన కేరళ కథ. వాస్తవాలను మసకబార్చే కట్టుకథలతో సినిమాలు తీస్తూ, విద్వేషాన్ని ప్రచారం చేయడం దేశ భవిష్యత్‌కు మంచిది కాదు. విచక్షణను వినియోగించవలసిన సెన్సార్ బోర్డు పెద్దలు పరివార్ కళ్లజోళ్లు తొలగించి వాస్తవాలను పరికించాలి. కేంద్ర పాలకుల ఒత్తిళ్లకు తలొగ్గడం తగదు. ప్రజలు ఇటువంటి విద్వేష రాజకీయ చిత్రాల పట్ల అప్రమత్తంగా వుండాలి.

# పాతతారాయపల్లిలో చెత్త సేకరణ పరిశీలించిన ఎంపీడీవో



పొలిటికల్ పవర్ పిఎన్9 న్యూస్ రిపోర్టర్ శ్రీహరి

అనంతసాగరం, ఫిబ్రవరి23 గ్రామ పంచాయతీలలో గ్రీన్ అంబాసిడర్ల ద్వారా చెత్త సేకరణ నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ పేర్కొన్నారు. సోమవారం పాత దేవరాయపల్లి గ్రామంలో ప్రతి ఇంటి నుండి జరుగుతున్న చెత్త సేకరణను ఎంపీడీవో పరిశీలించారు. గ్రామ పంచాయతీ సర్పంచుల సహకారంతో అందరూ పంచాయతీ అభివృద్ధి అధికారులు (పంచాయతీ కార్యదర్శులు) గ్రీన్ అంబాసిడర్ ల ద్వారా తడి చెత్త పొడి చెత్త సేకరణ విడివిడిగా నిర్వహించి ఎస్ డబ్ల్యూ పిసి కేంద్రాల ద్వారా వానపాములతో ఎరువు తయారీ చేసి గ్రామాలలో పారిశుధ్య నిర్వహణతో , గ్రామపంచాయతీల ఆదాయ వనరులను పెంపొందించుకోవడానికి కృషి చేయాలని కోరారు. ప్రతి నెల మొదటి వారంలో ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా ఈ విషయమై ప్రభుత్వము ప్రజలతో సంప్రదిస్తున్నందున ఎలాంటి అలసత్వానికి తావు లేకుండా ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో షానవాజ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మా భూమిని మాకు స్వాధీనం చేయండి...మంద తిరుపతమ్మ

పొలిటికల్ పవర్ పిఎన్ 9 న్యూస్ రిపోర్టర్ శ్రీహరి

అనంతసాగరం,ఫిబ్రవర23 సంజీవ్ నగర్ గ్రామంలోని దళితులకు ఇచ్చిన భూమిని మాకు స్వాధీనం చేయాలని బాధితురాలు మంద తిరుపతమ్మ పేర్కొన్నారు. బాధితులు మంద తిరుపతమ్మ మాట్లాడుతూ మంద పెంచలయ్య సంజీవ్ నగర్ గ్రామంలో వారసత్వముగా సర్వే నెంబర్ 538 పట్టా నెంబర్ 471లో మా బంధువులు జోకచర్ల నరసింహులు, మాకు ఆ భూమి మీద హక్కు కలిగి ఉన్నదని అన్నారు. ఎస్సీ కులం కు చెందిన వారని అన్నారు. ఆ భూమి మీద మా గ్రామంలోని అగ్రవర్ణాలకు చెందిన దౌర్జన్యం చేస్తున్నారని భూమిని ఆక్రమించుకున్నారన్నారు. అధికారుల దృష్టికి తీసుకుని వెళ్ళగా అధికారులు ఆ భూమి మా భూమి గా తేల్చారన్నారు. మా భూమిని ఆక్రమించిన అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తులు కోర్టుకు వెళ్లారన్నారు. కోర్టులో కూడా భూమి మాదే అని తీర్పు ఇచ్చారని అన్నారు. మా భూమి లోనికి మమ్మల్ని రానీయకుండా ఐదు సంవత్సరాల నుంచి ఇబ్బందులు పెడుతూ మా మీద దౌర్జన్యం చేస్తున్నారని అన్నారు. అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తులురెవిన్యూ అధికారులు మమ్మల్ని మభ్యపెట్టి తప్పుడు డాక్యుమెంట్లను సృష్టించి వారి పేరు మీద రిజిస్టర్ చేసుకొనుటకు చూస్తున్నారన్నారు. కోర్టు తీర్పు చూపించిన మా మాట వినడం లేదని అన్నారు. మండల రెవెన్యూ అధికారులు విచారించి కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని అన్నారు, ఇటీవల ఆత్మకూరు ఆర్డీవో, డిఎస్పి, అనంతసాగరం రెవిన్యూ బృందం భూములు పరిశీలించారని 541 సర్వే నెంబర్లు రెవెన్యూ అధికారులు బోర్డు ఏర్పాటుచేసిన దానిని తొలగించి మామిడి చెట్లు నాటుతున్నారనిఆమె ఆరోపించారు.

# కాకిలపై (నల్లకోటు న్యాయవాదుల) కన్నెర్ర

## - రుద్రూర్ పోలీస్ స్టేషన్లో బార్ అసోసియేషన్ ధర్నా...






పొలిటికల్ పవర్ ఎన్ వి ఆర్ టీవీ ప్రతినిధి నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండలం, ఫిబ్రవరి 23...

మహిళా న్యాయవాది పై దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. రుద్రూర్ మండల కేంద్రంలోని జేఎన్ సి కాలనీలో ఆదివారం ఓ నలుగురు వ్యక్తులు అకారణంగా ఓ వ్యక్తి పై దాడి చేస్తున్నప్పుడు ఆ సంఘటన చూసిన, అదే కాలానికి చెందిన న్యాయవాది కళ్యాణి బంధువుల ఫంక్షన్ చేసుకొని తిరిగి వెళుతున్న క్రమంలో, మహిళా న్యాయవాది వారు చేస్తున్న దాడిని ప్రశ్నించగా, ఆమె న్యాయవాది అని తెలిసి కూడా మరో వర్గానికి చెందిన వ్యక్తులు మహిళ న్యాయవాదిపై అసభ్యకరమైన పదజాలలతో దూషిస్తూ దాడికి పాల్పడ్డారని, ఈ దాడిని నిరసిస్తూ సోమవారం రుద్రూర్ పోలీస్ స్టేషన్ ఎదుట న్యాయవాదులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ.. ఓ మహిళా న్యాయవాదిపై మరో వర్గానికి చెందిన వ్యక్తులు అసభ్యకరమైన పదజాలలతో దూషిస్తూ కృరత్వంగా ప్రవర్తిస్తూ దాడికి పాల్పడ్డారన్నారు. తన పై జరిగిన దాడి పై ఆ మహిళ న్యాయవాది పోలీస్ స్టేషన్ లో దరఖాస్తు ఇవ్వగా, ఈ కేసు పై ఎస్సై, పోలీసులు నిర్లక్ష్యం వహిస్తూ, ఆ దరఖాస్తులో ఉన్న పదాలను తీసివేసి, ఆగమేగాల మీద వేరే పదాలను జోడించి ఆ దరఖాస్తును కోర్టుకు పంపించారన్నారు. ఓ మహిళ కు న్యాయం, చేయాల్సిన పోలీసులు అమ్మాయిల పట్ల దురుసుగా ప్రవర్తించారని కనీసం మర్యాద కూడా ఇవ్వకుండా, పిటీషన్ తారుమారు చేసి, ఆగ మేఘాలపైన ఎఫ్ఐఆర్ నమోదు చేసి కోర్టుకు పంపించారన్నారు, పోలీసులు మాత్రం నిందితులకు సహకరిస్తున్నారని, ఇలా నిందితులకు సహకరించడం సిగ్గుచేటని పేర్కొన్నారు. న్యాయవాది మహిళపై దాడికి పాల్పడిన వారి పై నాన్ బెయిల్ సెక్షన్ లు అమలు చేసి, వారిని వెంటనే అరెస్టు చేసి రిమాండ్ కు పంపాలని, మహిళా న్యాయవాదికి న్యాయం జరగని పక్షంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కేసు విషయంలో నిందితులను శిక్షించి, మహిళా న్యాయవాదికి న్యాయం చేస్తామని, ఏసీపీ శ్రీనివాసులు, సీఐ కృష్ణ, ఎస్సై సాయన్న వారికి నచ్చజెప్పడంతో వారు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

# సన్న బియ్యం నిల్వలో ఎలాంటి అక్రమాలకు పాల్పడిన కఠిన చర్యలు

## - తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు..





పొలిటికల్ పవర్ తెలుగు దినపత్రిక పిఎన్9 టీవీ తెలుగు న్యూస్ తెలంగాణ స్టేట్ బ్యూరో కే సతీష్ కుమార్

ది.23.02.2026 నిజామాబాద్ జిల్లా,లాకోరా లోని గిడ్డంగుల సంస్థ గోడౌన్ లను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు గారు తనిఖీ చేశారు..ఈ తనిఖీ లో భాగంగా గోడౌన్ లో నిల్వ చేసిన సన్న బియ్యం నాణ్యతను పరిశీలించారు.. గోడౌన్ లో ఎంత మేరకు నిల్వలు ఉన్నాయనేది, రికార్డు లో నమోదు ఉన్నాయా, లేదా అనేది తనిఖీ చేశారు,స్టాప్ రిజిస్టర్ ను తనిఖీ చేశారు..సన్న బియ్యం నిల్వల్లో ఎలాంటి అక్రమాలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు..కెమికల్స్ ఉపయోగించే విధానాన్ని పరిశీలించారు..బియ్యం నిల్వల్లో జాగ్రత్తలు పాటించాలని సూచించారు..ఈ కార్యక్రమంలో యస్.సి.శ్రీనివాస్,జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు..


# దాతకు భక్తులచే సత్కారం



పొలిటికల్ పవర్ తెలుగు దినపత్రిక పిఎన్9 టీవీ తెలుగు న్యూస్ ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ బ్యూరో

మార్కాపురం జిల్లా గిద్దలూరు పట్టణంలోని శ్రీ శ్రీ భగవాన్ కాశిరెడ్డి నాయన ఆశ్రమం నరవ రోడ్ కుంట నందు ప్రతి సోమవారం దాతల ఆర్థిక సహాయంతో భోజనం ఏర్పాటు చేయడం జరుగుతుంది దాత బోధనపు పెద్ద పిచ్చిరెడ్డి ధర్మపత్ని సుబ్బలక్ష్మి కుటుంబ సభ్యులు పేదలకు భోజనం అందించాలని 6500 నిర్వాహకులకు అందించారు. ఈ సందర్భంగా దాత బోధనపు పెద్ద పిచ్చిరెడ్డి విశ్రాంత ఉపాధ్యాయులు మాట్లాడుతూ కాశినాయన దగ్గర భోజనం ఏర్పాటు చేయడం అనేది మనకు అదృష్టంగా భావించాలని కోరారు కాశినాయన తిరుగుతున్న సమయంలో ప్రతి దేవాలయం దగ్గర భోజనాలు ఏర్పాటు చేపించేవారని తెలిపారు ఈ సందర్భంగానే నేను కాశినాయన దగ్గర భోజనం ఏర్పాటు చేయడానికి 6500 పెద్ద సమస్య కాదని మరిన్ని రోజులలో నా వంతుగా కాశినాయనకోసం ఎప్పుడూ ముందు ఉంటానని తెలిపారు శ్రీ శ్రీ భగవాన్ కాశిరెడ్డి నాయన అన్న వితరణ సేవాశ్రమం తరఫున పిచ్చిరెడ్డి దంపతులకు శాలువా పూలమాల కాశినాయన పటంతో భక్తుల మధ్యన ఘనంగా సత్కరించి ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో వడ్డీ వీరారెడ్డి విశ్రాంత లెక్చరర్ పాలుగుళ్ళ కాశిరెడ్డి విశ్రాంత సూపర్డెంట్ ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి యస్ నారాయణరెడ్డి సంఘ సేవకులు ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్ గిద్దలూరు వారు రెడ్డి మల్లారెడ్డి విశ్రాంత సర్వేయర్ కాశినాయన ప్రథమ శిష్యురాలు ముక్కంటి నరసమ్మ చిల్లర దుకాణం లక్ష్మీదేవమ్మ గంగంపల్లి ఆదినారాయణ రెడ్డి సూరారంగస్వామి రెడ్డి భక్తులు పాల్గొన్నారు.

# ఆరు పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈఓ 2 కాటంరెడ్డి



పొలిటికల్ పవర్ పిఎన్9 న్యూస్ రిపోర్టర్ శ్రీహరి

అనంతసాగరం,ఫిబ్రవరి23 మండలంలోని బొమ్మ వరం, యాకర్లపాడు, గోగులపల్లి, అగ్రహారం గ్రామాలలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను సోమవారం ఎంఈఓ 2 కాటంరెడ్డి ప్రభాకర్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ప్రార్థనకు హాజరయ్యారు, వర్క్ బుక్కలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# హిట్లర్ కాలంలో జర్మనీలో నాజీ పాలన ప్రచారం కోసం గోబెల్స్ సినిమాను అత్యంత ప్రభావవంతంగా ఉపయోగించాడు



పొలిటికల్ పవర్ తెలుగు దినపత్రిక పిఆర్9 టీవీ తెలుగు న్యూస్. ఎడిటర్ డెస్క్.

హిట్లర్‌ను దేవుడిగా కీర్తిస్తూ 1935లో వచ్చిన 'ట్రయంఫ్ ఆఫ్ ది విల్' అత్యంత ముఖ్యమైన నాజీ ప్రచార చిత్రాలలో ఒకటి. 1938 లో 'ఒలింపియా' చిత్రం ఆర్యన్ జాతి అథ్లెటిక్ పరాక్రమాన్ని ప్రపంచానికి చాటితే, మిలియన్ల మంది యూదుల మారణ హోమాన్ని శాస్త్రీయంగా సమర్థించడానికి 'ది ఎటర్నల్ జ్యూ' అనే డాక్యుమెంటరీ రూపొందించబడింది. ఐరోపా నుండి తుడిచిపెట్టుకుపోవాలని హిట్లర్ చేసిన ఉద్రేకపూరిత ప్రసంగం తర్వాత చప్పట్లతో ఈ డాక్యు మెంటరీ ముగుస్తుంది. అదేమాదిరిగా భారతదేశంలోనూ గోబెల్స్ తరహా సినిమాలు పునరావృతం అవుతున్నాయి. ఉన్నత కులాల హిందువులను కీర్తించే సినిమాలు, విదేశీ ముస్లిం పాలకులచే దేశం నాశనం చేయబడిందని చూపే సినిమాలు, ముస్లింలు ప్రేమ నటిస్తూ... హిందూ అమ్మాయిలను కిడ్నాప్ చేసి మతమార్పిడి చేస్తున్నారని నిరూపించడానికి ప్రయత్నించే 'ది కేరళ స్టోరీ' వంటి సినిమాలు దేశంలో విద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్నాయి.

1960 నాటి 'మా భూమి' వంటి సినిమాలు సామాజిక మార్పునకు ఎంతగానో దోహద పడ్డాయి. సినిమా అనేది ప్రజలను ఏకం చేయడానికి వారధిగా వుండాలి. కానీ, బిజెపి అధికారం లోకి వచ్చిన తర్వాత సినిమాను ప్రజల మధ్య విభజనలు సృష్టించే సాధనంగా మార్చారు. కేరళ ప్రజల్లోని సామరస్యతను నాశనం చేసే లక్ష్యంతో, ఉద్దేశపూర్వకంగా విడుదల చేసిన 'కేరళ స్టోరీ–2' చిత్రం రాష్ట్రంపై జరుగుతున్న మరో సాంస్కృతిక యుద్ధం. 2023లో వచ్చిన 'కేరళ స్టోరీ' చిత్రం ఆసాంతం...మతోన్మాద మూకలు కేరళ గురించి వ్యాప్తిచేస్తున్న కొండంత అబద్ధాల ఆధారంగా రూపొందిన కట్టు కథ. కేరళకు చెందిన ముప్తై రెండు వేల మంది మహిళలు ఇస్లాంలో చేరారనే నినాదంతో ఈ చిత్రం విడుదలైంది. దేశంలోని లౌకిక సమాజం దీనికి వ్యతిరేకంగా తీవ్ర నిరసన వ్యక్తం చేయడంతో.. ముప్తై రెండు వేల మంది కేవలం ముగ్గురిగా మారారు. ఈ అబద్ధాల పునాదిపై నిర్మించిన కట్టుకథకు గాను సుదీప్తో సేన్ 2025లో ఉత్తమ దర్శకుడిగా జాతీయ అవార్డును అందుకున్నారు. తాజాగా 'గోస్ బియాండ్' పేరుతో విడుదలైన 'కేరళ స్టోరీ 2' టీజర్... మొదటి భాగం కంటే ఎక్కువ ప్రమాదకరంగా, కేరళతో పాటు దేశవ్యాప్తంగా ఉద్రిక్తతలను మరింత రెచ్చగొట్టేదిగా వుంది.

లౌకిక విలువలను, సోదరభావాన్ని నిలబెట్టిన కేరళను చూసి భయపడుతోన్న ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్ పరివార్ శక్తులు... కేరళను ఉగ్రవాదానికి పుట్టినిల్లుగా చిత్రీకరించాలనే మతతత్వ ఎజెండాతో ఈ తరహా సినిమాలను ప్రజల్లోకి వదులుతున్నారు. 'మతం పేరుతో విద్వేషాన్ని పెంచుకుంటూ పోతే, అది మన ఇంటినే దహించివేస్తుంది' అంటారు ప్రముఖ రచయిత ఖుష్వంత్ సింగ్. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక భారతదేశం. ముఖ్యంగా కేరళ రాష్ట్రం... అన్ని మతాల ప్రజలు కలిసిమెలిసి వుండే సంస్కృతికి పెట్టింది పేరు. ఆ ప్రజలను నేరస్తులుగా, ఉగ్రవాదులుగా చిత్రీకరించే ఇలాంటి సినిమాను సెన్సార్ బోర్డు ఎలా అనుమతిస్తుంది? 'ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'బీఫ్' అనే పదాన్ని, 'జానకి' అనే పేరును కూడా ఉపయోగించకుండా సినిమాలను నిరోధించారు. ఆ భాగాలను కత్తిరించిన తర్వాతనే ఆ చిత్రాలను ప్రదర్శనకు అనుమతించారు.

వేర్పాటువాదాన్ని ప్రేరేపించే విషపూరిత సృజన 'కేరళ స్టోరీ–2'కు క్లీన్ యుఎ సర్టిఫికెట్ ఇవ్వడం శోచనీయం. 'సమాజంలో విభజన, విద్వేషాన్ని వ్యాప్తిచేసే లక్ష్యంతో నిర్మించిన విషపూరిత చిత్రం ఎలా అనుమతించబడుతుందో ఆశ్చర్యంగా ఉంది' అని కేరళ ముఖ్యమంత్రి సైతం ఘాటుగా స్పందించారు.

# మానవత్వం చాటుకున్న ఆత్మకూరు నియోజవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ నలిశెట్టి

పొలిటికల్ పవర్ పిఎన్ 9 న్యూస్ రిపోర్టర్ శ్రీహరి

అనంతసాగరం,ఫిబ్రవరి23 ఆత్మకూరు నియోజకవర్గంలో చేజర్ల మండలంపాతపాడు గ్రామం ఎల్లంటి ప్రసాద్ బంధువు ఎల్లంటి లక్ష్మీ రెండు నెలలుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. ఆత్మకూరు నియోజకవర్గం జనసేన నాయకులు ఇన్చార్జి నలిశెట్టి శ్రీధర్ దృష్టికి తీసుకుని వెళ్లారు. వెంటనే స్పందించి నలిశెట్టి శ్రీధర్ దయ హృదయంతో 5000 రూపాయలు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న లక్ష్మీకి ఆర్థిక సహాయం చేశారు. ఆత్మకూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ నలిశెట్టి శ్రీధర్ మానవత్వం చాటుకున్నారు.

# అంగన్వాడి కార్యకర్తల, హెల్పర్లుకు వేతనాలు పెంచాలని కోరుతూ నిరసన దీక్షలు

పొలిటికల్ పవర్ పిఎన్9 న్యూస్ రిపోర్టర్ శ్రీహరి

అనంతసాగరం, ఫిబ్రవరి23 అంగన్వాడి కార్యకర్తల, హెల్పర్లుకుకనీస వేతనాలు పెంచాలని కోరుతూ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ CITU ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జ×ుఖ ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు వసుంధర, సునీత మాట్లాడుతూ గత ప్రభుత్వం లో అంగన్వాడి లు 42రోజుల చారిత్రాత్మక సమ్మె నిర్వహించి డిమాండ్ లతో G.O లు సాధించుకొన్నమని అన్నారు. కనీస వేతనం పెంచుతామని మినిట్స్ రాసి ఇచ్చారని,ఎన్నికల ముందు కూటమి నాయకులు సమ్మె శిబిరాల వద్దకు వచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కచ్చితంగా అంగన్వాడి ల వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారు. ఇంతవరకు ఉసే ఎత్తడం లేదని అన్నారు. వేతనలాల పెంపు కోసం, గ్రాటివిటీ గైడ్ లైన్స్ రూపొందించాలని, వేసవి సెలవులు మంజూరు చేయాలని ఫిబ్రవరి 23వ తేదీ నుండి ఫిబ్రవరి 27వ వరకు నిరసన దీక్షలు చేస్తామని, ప్రభుత్వం స్పందించకుండా ఉంటే మార్చి 2వ తేదీ చలో విజయవాడ కు వెళ్లి మహా ధర్నా నిర్వహింస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి అన్వర్ బాషా, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ CITU నాయకులు నాగమణి,నూర్జహాన్, పెంచలనరసమ్మ, రమ,నరసమ్మ,సుబ్బమ్మ,సునీత, అరుణ,సుజాత,పద్మ, ఆదిలక్ష్మి,జయసుధ మరియు అంగన్వాడి వర్కర్లు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో పరివార్ పాచికలు - తెలకపల్లి రవి



ఫిబ్రవరి 22, 2026 పవర్ తెలుగు దినపత్రిక పిఎన్ 9 టీవీ తెలుగు న్యూస్ ఎడిటర్ డెస్క్

విదియనాడు కనిపించని చంద్రుడు తదియనాడు తానే కనిపిస్తాడన్నట్టు తయారైంది తెలుగు రాష్ట్రాల్లో మత రాజకీయాల పరిస్థితి. టీడీపీ, జనసేన, వైసీపీలతో సహా ఇందులో భాగమవుతున్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల యుద్ధంలోనూ మతతత్వ వ్యతిరేకత ఎజెండా లోంచి మాయమై బీజేపీ, మజ్లిస్‌లు కాలూనుతున్నాయి. తమ తమ స్థానిక ఆధిపత్యాల కోసం ఈ పార్టీలు పోటీలు పడుతుంటే పిట్టపోరు పిట్టపోరు పిల్లి తీర్చినట్టు బీజేపీ, ఆరెస్సెస్‌లు పట్టు పెంచుకోవడానికి సమాలోచనలు చేస్తున్నాయి. దక్షిణాది రాష్ట్రాలకోసం ప్రత్యేకంగా ఆలయాలు, కులమతాలు, ఆహారాలు, సినిమాలు మీడియా, పండగలు దేన్నీ వదలిపెట్టడం లేదని ఇటీవల చాలా ఉదంతాలు హెచ్చరిస్తున్నాయి. వామపక్షాలు అనవసరంగా బీజేపీ బోగీ తీసుకొస్తున్నాయనే మాటలు ఎంత అనాలోచితమో ఈ సందర్భాలు స్పష్టం చేస్తాయి. ప్రతిష్టాత్మక జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ నుంచి హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం వరకూ దేశవ్యాపితంగా అనేకచోట్ల అగ్గిరాజేసిన విద్వేష రాజకీయం ఇప్పుడు ఆంధ్రా యూనివర్సిటీలోనూ ప్రత్యక్షమైంది. అంతర్జాతీయ స్థాయి నౌకాదళ విన్యాసాలు జరుగుతున్నప్పుడే కుహనా జాతీయవాదం సనాతన మతవాదం మేళవించిన ఆరెస్సెస్ కవాతు తలపెట్టడం యాదృచ్ఛికమేమీ కాదు. ఎస్‌ఎఫ్‌ఐ వంటి విద్యార్థి సంఘాలు, కమ్యూనిస్టు పార్టీలూ కుట్రపన్నాయని ఆరోపించడం మరింత దారుణం. దీనికి ముందే ప్రసిద్ధ మేడారం జాతరలో సంప్రదాయకంగా కోవాబన్ను అమ్మే చిరు ముస్లిం వ్యాపారులపై నిందలు వేసి దాడులు చేశారు. అనివార్య పరిస్థితులలో మంత్రి లోకేశ్, జనసేన ఎమ్మెల్సీ నాగబాబు వంటివారు కూడా దీన్ని ఖండించ వలసి వచ్చిందిగానీ వెనక వున్న మతతత్వ పోకడలను మాత్రం వారు అసలు ప్రస్తావించలేదు. పైగా సోషల్ మీడియాలో ఈదాడిని సమర్థిస్తూ రకరకాల వ్యక్తులు వ్యాఖ్యలు పెట్టారు. ఇదే తరుణంలో హైదరాబాద్ గణేష్ ఉత్సవ సమితి సభలోనూ ఇదే ధోరణి శ్రుతిమించింది. ఇళ్లలో రిపేర్లు, చిన్న చిన్న పనులు చేసి పెట్టేవారంతా అన్యమతస్తులేనని ద్వేషవాక్కులు వినిపించాయి. సభలో మాట్లాడిన పూజారులతో సహా విదేశీయులను తరిమి కొట్టాలని రెచ్చిపోయారు. షరామామూలుగా మునిసిపల్ ఎన్నికల్లోనూ బీజేపీ నేతలు కేంద్ర మంత్రులతో సహా విద్వేషవ్యాఖ్యలే చేశారు. ఫలితాల్లోనూ ఆ ప్రభావం కొన్నిచోట్ల కనిపించింది. బీజేపీ అనుకున్న స్థాయిలో విజ యాలు సాధించకపోయినా కరీంనగర్ కార్పొరేషన్ కైవసం చేసుకుంది. బీఆర్ఎస్ అక్కడ తటస్తవైఖరి తీసుకుంది. బైంసాలో మజ్లిస్ తిరుగుబాటు అభ్యర్థులు అందరి మద్దతుతో పీఠమెక్కారు. కొత్తగూడెంలో సీపీఐ మేయర్ ఎన్నికవడం మాత్రం వామపక్ష శక్తులకు సంతోషం కలిగించింది. అదే సమయంలో బీజేపీతో చేతులు కలిపినట్టు రాష్ట్ర వ్యాపితంగా కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు పరస్పరం ఆరోపణలు చేసుకున్నాయి తప్ప దాన్ని నిరోధించడమే కీలక సూత్రంగా పెట్టుకోలేదు. దేశమంతటా ఈ విషయంలో కాంగ్రెస్‌లో కనిపించే ఊగిసలాట లక్ష్యశుద్ధి లేకపోవడం వారు పాలించే తెలంగాణలోనూ ప్రతక్షమైంది. బీఆర్ఎస్‌పైనా గతంలోనే ఆలాటి ఆరోపణ లున్నాయి.

లడ్డూ టు పుడ్డు

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోనూ అంతకంతకూ బీజేపీ సనాతన జపం ఎక్కువ కావడం ఈ కాలంలో కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. పైగా ప్రధాని మోడీని మెప్పించడం కోసం పాలక కూటమి ప్రధాన ప్రతిపక్షం పోటీ పడుతున్న పరిస్థితి. తాజా బడ్జెట్‌లోనూ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మోడీ నాయకత్వాన్ని రాష్ట్రానికి చేసిన సహాయాన్ని అనవసరంగా కీర్తించడం అందరూ గమనించారు. కేంద్ర బడ్జెట్‌లో రాజధానితో సహా ఏ అంశంలోనూ రావలసింది రాలేదనే వాస్తవాన్ని కప్పిపెట్టి ముఖ్యమంత్రి చంద్రబాబు పొగడ్తలు గుప్పించారు. స్వయంగా సనాతన జపంలో మునిగితేలే ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అయితే అచ్చంగా అదే పనిలో వున్నారు.

రాజకీయ అవసరాల కోసం మాత్రమే గాక ఒక వ్యూహంగానూ మతపరమైన అంశాలపై రభస ఈ కాలంలో పెరిగింది. తిరుపతి లడ్డూ నెయ్యి కల్తీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోగా పరస్పరం ఆరోపణలతో మతాలవారిగా, పార్టీల పరంగా చిచ్చు రగిలిస్తూనే వున్నారు.

ఈ కాలమంతటా తిరుపతి పాలకమండలిలో కొనసాగుతున్న బీజేపీ తనకేమీ సంబంధం లేనట్టు వ్యవహరిస్తూ అక్కడ పట్టు కాపాడుకోవడంలో నిమగ్నమైంది. నిజానికి ఈ రెండు ప్రభుత్వాల హయాంలోనూ కొండపై తిష్టవేసింది హిందూత్వ సంస్థలూ, మతాల లాబీయిస్టులే. వ్యాపార కార్పొరేట్ బ్యూరోక్రాట్ల పట్టు కూడా అదే స్థాయిలో సాగుతున్నది. మతం చుట్టూ తిరిగిన ఈ వివాదం ఇప్పుడు హెరిటేజ్ కంపెనీకి సంబంధం వుందనే విధంగా వైసీపీ ఆరోపిస్తుంటే ఆ కంపెనీ అధికారిక వైఖరినే ప్రభుత్వం కూడా వినిపిస్తున్నది.

పరువు నష్టం నోటీసులు, కంపెనీ పద్ధతుల్లో వారు ఖండించుకోవలసింది కాస్త అధికారిక విధానంగా మారినట్టు అగుపిస్తున్నది. ఈ క్రమంలో వైసీపీ, టీడీపీ, జనసేన తామే అసలైన భక్తి ప్రపత్తులు గలవారమని చాటుకోవడానికి ప్రయత్నిస్తూ అదే చర్చచుట్టూ రాష్ట్రాన్ని తిప్పుతున్నారు. వైసీపీ నేతలు వెంకన్న ఫొటోలతో సభకు రావడం దానిపై ప్రభుత్వపక్షం విరుచుకుపడటం ఇందులో భాగమే. తిరుపతికి పరిమితమైన ఈ వివాదం కాస్త ఇటీవల అన్ని క్షేత్రాలలోనూ ప్రసాదాలకు విస్తరింపచేస్తూ మతపరమైన ఆందోళన రెచ్చగొట్టడానికి తంటాలు పడుతున్నారు. అంతర్వేది, రామతీర్థం వంటి చోట్ల జరిగిన దురదృష్టకర ఘటనలతో ఎన్నికల ముందు ఈ శక్తులు చిచ్చు రాజేసేందుకు రాజకీయం నడిపాయని మర్చిపోలేము. అదే తొక్కిసలాట ఘటనలు మరణాల వంటివాటి తర్వాత కూడా పాలనాయంత్రాంగం పటిష్టత కోసం పెద్ద కేంద్రీకరించి లేదు. వారి నిజమైన లక్ష్యం ఏమిటో దీన్నిబట్టే తెలుస్తుంది.

అన్ని వేదికలపైనా..

ప్రత్యక్ష రాజకీయాలలోనే గాక కళాసాంస్కృతిక సామాజిక రంగాల్లోనూ ఈ మతతత్వ భావజాలం, తిరోగామి ధోరణలు ఇటీవల పెరుగుతున్నాయి. సినిమా రంగ ప్రముఖుడైన విజయేంద్ర ప్రసాద్‌కు రాజ్యసభ సభ్యత్వం ఇప్పించారు. పవన్ కళ్యాణ్ పదవి చేపట్టాక కూడా సినిమా రంగంలోనూ ఆ భావజాలం జొప్పించే దిశలో సాగుతున్నారు. నాగ్‌అశ్విన్ కల్కి, రాబోయే రాజమౌళి చిత్రం కూడా వారణాసి చుట్టూ తిరగడం యాదృచ్ఛికం కాదు. ఆ మాటకొస్తే మోడీ యోగి ఆదిత్యనాథ్‌లతో సహా కీలక నేతలంతా మోసిన కాశ్మీర్ ఫైల్స్ వంటి చిత్రాలు తీసిన నిర్మాత హైదరాబాదీ కావడం గమనించదగింది. గతంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వచ్చి ఎన్టీఆర్ వంటివారిని కలసివెళితే, ఇప్పుడు స్వయంగా ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ పర్యటన సందర్భంలో తెలుగు సినిమా ప్రముఖులతో మంతనాలు జరిపివెళ్లారు. చెన్నై కన్నా హైదరాబాదునే తమ తరహా సనాతన భావజాల చిత్రాలకు సరైన కేంద్రంగా పరివార్ భావిస్తున్నది. మీడియా సంస్థల్లో అధికభాగం బీజేపీతో ప్రత్యక్ష సంబంధం నెరుపుతున్నాయి. రిపబ్లిక్ టీవీ ఆర్నాబ్ గోస్వామి ఈ మధ్యనే వచ్చివెళ్లారు. సినిమా వేడుకల్లోనూ, వేదికల్లోనూ మహిళలపైన ఇష్టానుసారం మాట్లాడటం, మతపరమైన సంకేతాలు వదలడం పరిపాటి అవతున్నది. ద్వితీయ శ్రేణి సినీ జీవులు కొందరు అచ్చంగా ఇదే విడియోల విడుదలలో వుంటున్నారు. ఇటీవలి కాలంలో పుస్తకాల ప్రచురణలోకీ ప్రవేశించారు. ఉదాహరణకు అయోధ్య చేరిన కృష్ణ వంటి పుస్తకాలు విస్తారంగా అమ్ముడవుతున్నాయని చెబుతున్నారుగాని అవి కూడా అటూ ఇటూ తిరిగి ఈ భావజాలం దిశలోనే వుంటున్నాయి.

మార్కెట్ హంగామా మతభావాలు రంగరించి అంగరంగ వైభోగంగా వేడుకలు జరపడం నిత్యకృత్యమైంది. ఇటీవలి కాలంలో ఈ తరహా ఛానళ్లు, సోషల్‌మీడియా, ప్రవచనాలు విస్తారంగా తీసుకొస్తున్నారు. ప్రాంతీయ పార్టీల నేతలతో పాటు కేంద్ర నేతలు వీటిలో ప్రత్యక్షంగా పాల్గొని ప్రోద్బలమివ్వడం గమనించవచ్చు. మతపరమైన కోణాలు చాలక ఈ మధ్యన హిందూమతంలోనే శైవవైష్ణవ వివాదాలు కూడా ముందుకు తేవడానికి చినజియర్ స్వామి మాటలు కారణమైనాయి. నిజానికి మతతత్వంతో పాటు కుటతత్వాలు కూడా ప్రజ్వలింపచేసే పోకడలు పెరుగుతున్నాయి. ఏ కులాన్ని తాము ప్రధానంగా తీసుకోవాలనేదానిపైనా బీజేపీకి అంచనాలున్నాయి, విభజన రాజకీయాల అనివార్య పర్యవసానమిది. తాజాగా అంబేద్కర్‌కు సంబంధించిన ఒక సంస్మరణ కార్యక్రమంలో విజయేంద్ర ప్రసాద్ దళితుల పట్ల తమ పెద్దలు వ్యవహరించిన తీరుకు క్షమాపణలు చెబుతున్నానని అనడం ప్రచారంలోకి వస్తున్నది. ఒకవైపున సనాతనం పేరిట వర్ణవ్యవస్థను కొనసాగిస్తూ మరోవైపున పశ్చాత్తాపం, ప్రాయశ్చితం వంటివి ప్రకటించడం దేశమంతటా పరివార్ అనుసరిస్తున్న వ్యూహంలో భాగమే. ఇదే రచయిత రాసిన బాహు బలిలో కట్టప్ప పాత్ర చూస్తే వర్ణవ్యవస్థపట్ల, వారిని బానిసలుగా ఉపయోగించుకోవడం పట్ల సనాతన దృష్టి కనిపిస్తుంది. 1938లో మాలపిల్ల, 1939లో మల్లీపెళ్లి, రైతుబిడ్డ వంటి చిత్రాలు అందించిన తెలుగు సినిమాకు సాంకేతిక జిలుగుల చాటున సామాజిక తిరోగమనం ఇది. ఈ తతంగం మొత్తం యువతను లక్ష్యంగా చేసుకుని సాగడం మరింత తీవ్రమైన విషయం.

ప్రాపకం కోసం పోటీలో ప్రమాదం

సినిమాల నుంచి మళ్లీ రాజకీయాల్లోకి వస్తే టీడీపీ, వైసీపీ జనసేనల మధ్య బీజేపీ పెద్దలు చాలా వ్యూహాత్మకంగా తమ పబ్బం గడుపుకొంటున్నారు. ఒకరిపైకి ఒకరిని ప్రయోగిస్తున్నారు. కూటమితో మొదట పవన్ కళ్యాణ్‌ను తర్వాత లోకేశ్‌ను ఎక్కువగా చేరదీస్తున్నట్టు కనిపిస్తూ భిన్నసంకేతాలతో తికమక పెడుతున్నారు. మరోవైపున జగన్‌తోనూ సంబంధం వదులుకోబోమనే చెబుతున్నారు. బీఆర్ఎస్ అంతర్గత తగాదాలు, కుటుంబ విభేదాలు, కేసులు, విచారణల మధ్య కొందరిని తమవైపు తిప్పుకోవడం కోసం చూస్తున్నారు. బీజేపీ సంస్థాగత వ్యవహారాలు చూస్తే ఆరెస్సెస్ ప్రతినిధి సంతోష్ చాలా స్పష్టంగానే ఇటీవల ఆదేశాలు ఇచ్చినట్లు చెబుతున్నారు. ఒకవైపున హిందూత్వంతో రెచ్చగొట్టడం, మళ్లీ దొరికిన అవకాశాలనూ, మనుషులనూ చేజిక్కించుకోవడం దేనికదే చేసుకుంటూ పోవాలన్నది పరివార్ వ్యూహాత్మకంగా వుంది. తాత్కాలిక అవసరాలతో వారి ప్రాపకం కోసం పాకులాడుతున్న ప్రాంతీయ పార్టీలు, వ్యాపార మీడియా వారి దీర్ఘకాలిక ప్రభావం పట్టించుకునే స్థితిలో లేకపోవడమే ఇక్కడ అనర్థకారణమవుతున్నది. ఇతర పార్టీలను కబళించడం ద్వారా, మతవివాదాలు రగిలించడం ద్వారా తాము ఎదగాలనుకునే బీజేపీ తీరుతెన్నులు తెలిసికూడా వీరు ఆ వలలో చిక్కడం స్వయం కృతాపరాధమే. మరి తెలుగురాష్ట్రాలు దానికి చెల్లించవలసి వచ్చే మూల్యం ఎంతన్నది ప్రశ్న.

# ఆరోగ్యం



## కొలెస్ట్రాల్ సమస్యకు దివ్యౌషదం..

### ఈ కూరగాయ తింటే చెరకు రసం పిండినట్లుగా కొలెస్ట్రాల్ ను పిండేస్తది

ప్రస్తుతం చాలామందిని ఇబ్బందిపెడుతున్న ఆరోగ్య సమస్య అధిక కొలెస్ట్రాల్. ఇది రక్తనాలాల్లో పేరుకుపోయి రక్త ప్రసరణకు అడ్డుగోడగా మారుతుంది. ఫలితంగా గుండెపోటు, స్ట్రోక్, అధిక రక్తపోటు వంటి ప్రాణాంతక సమస్యలు దాడి చేస్తాయి. దీనంతటికి ముఖ్య కారణం మన లైఫ్ స్టైయిల్, మన ఆహార అలవాట్లు మారడమే. ఏది పడితే అది తినడం వల్ల కొలెస్ట్రాల్ పెరగడం..దీంతో హాస్పిటల్స్ చుట్టూ తిరిగి లక్షల రూపాయలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. అయితే కొలెస్ట్రాల్ సమస్యకు సంజీవని మీ వంటగదిలోనే ఉందని మీకు తెలుసా? చాలామంది చూడగానే ముఖం తిప్పేసుకునే కూరగాయల్లో సొరకాయ ఒకటి. కొంతమంది ఈ పేరు వింటేనే వేరే కూర లేదా అబ్బా సొరకాయ అని డల్ అయిపోతుంటారు. వాస్తవానికి సొరకాయ అందించే ప్రయోజనాలు తెలిస్తే ఆ మాట మీ నోట రాదు. ఇదేం కూర అని ఛీత్కరించుకునే ఈ సొరకాయ మన శరీరానికి ఒక ఔషధ గని. చెడు కొలెస్ట్రాల్ ను సిరల నుండి చెరకు రసం పిండినట్లుగా పిండి బయటకు పంపగల శక్తి దీనికి ఉంది. ప్రతి రక్తపు చుక్కను శుభ్రపరిచే అద్భుతమైన గుణాలు ఇందులో ఉన్నాయి. సొరకాయతో కొలెస్ట్రాల్ కు ఎలా చెక్ పెడుతుంది సొరకాయలో సమృద్ధిగా ఉండే కరిగే ఫైబర్..శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది ప్రేగుల్లోని కొలెస్ట్రాల్ శోషణను అడ్డుకుని దాన్ని శరీరం నుండి బయటకు పంపుతుంది. సొరకాయలో కొవ్వు లేదా ఫ్యాట్ దాదాపుగా ఉండదు. దీనిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల బరువు అదుపులో ఉంటుంది. అధిక బరువు కారణంగా పెరిగే కొలెస్ట్రాల్ కూడా కంట్రోల్ లోకి వస్తుంది. సొరకాయలో ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రిస్తుంది. విటమిన్ %జ% ఒక శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్‌గా పనిచేసి రక్తనాళాల గోడలను చాలా ఆరోగ్యంగా, దృఢంగా ఉంచుతుంది. సొరకాయ శరీరంలోని విషతుల్యాలను బయటకు పంపి కాలేయాన్ని శుభ్రపరుస్తుంది. ఆరోగ్యకరమైన కాలేయం కొలెస్ట్రాల్ లెవల్స్ ని సమర్థవంతంగా కంట్రోల్ చేస్తుంది.

ఎలా, ఎంత తీసుకోవాలి? ఆరోగ్య నిపుణుల ప్రకారం ప్రతిరోజూ 100 నుండి 200 గ్రాముల సొరకాయను వండుకుని తినడం ఎంతో మేలు చేస్తుంది. దీనిని కూర, పులుసు, సూప్ లేదా రసం రూపంలో తీసుకోవచ్చు. సొరకాయ రసం తాగాలనుకుంటే అది కచ్చితంగా తాజాగా ఉండాలి. పరగడుపున తాగడం వల్ల కొందరిలో గ్యాస్ లేదా ఎసిడిటీ సమస్యలు రావచ్చు. అత్యంత ముఖ్యంగా రసం తాగే ముందు కొద్దిగా రుచి చూడండి. చేదుగా ఉంటే అస్సలు తాగవద్దు, అది ఆరోగ్యానికి హానికరం. %ణఱం-ఎశ్రీఖఱఎవతీ%: ఈ ఆర్టికల్ లో అందించిన సమాచారం సాధారణ సమాచారం,విద్యా ప్రయోజనాల కోసం మాత్రమే. ఇది వృత్తిపరమైన వైద్య సలహా, రోగ నిర్ధారణ లేదా ట్రీట్మెంట్ కు ప్రత్యామ్నాయంగా ఉద్దేశించబడలేదు. వైద్య పరిస్థితికి సంబంధించి మీకు ఏవైనా ప్రశ్నలు ఉంటే మీ డాక్టర్ లేదా సంబంధిత నిపుణుల సలహా తీసుకోండి.

# తెలుగు వంటలు

## అన్నం కూర ఎందుకు.. ఈ ప్రొటీన్ రిచ్ ఖిచిడి తింటే బోలెడు మేలు..

దాల్ కిచిడి..మనదేశంలో చాలా ప్రసిద్ధి చెందిన, పోషకమైన వంటకం. రెసిపి ప్రాంతాన్ని బట్టి టేస్ట్ మారుతూ ఉంటుంది. అయితే దీన్ని మన తెలుగువారి స్టైల్ లో చేస్తే ఆ టేస్ట్ జన్మలో మర్చిపోరు. మన దగ్గర రెస్టారెంట్లలో లేదా హోటల్స్ లో దొరికే దాల్ ఖిచిడి వెల్లుల్లి గుబాళింపుతో అదిరిపోతుంది. ఎదురుగా పెడితే ఎవరైనా యమ్మీ యమ్మీ అని లొట్టలేసుకుంటూ తింటారు. అయితే దీనిని ఇంట్లో కూడా రెస్టారెంట్ స్టైల్ తో ఈజీగా తయారుచేసుకోవచ్చు. బ్యాచిలర్స్ కూడా ఈజీగా తయారుచేసుకునే రెసిపి ఇది. అంతేకాకుండా ఇది ఆరోగ్యానికి బోలెడు మేలు చేస్తుంది. రెస్టారెంట్ స్టైల్ దాల్ కిచిడిని ఇంట్లోనే తయారుచేయడానికి కావాల్సిన పదార్థాలు,తయారీ విధానం ఇక్కడ చూడండి.

తయారీకి కావాల్సిన పదార్థాలు -పెసరపప్పు -బియ్యం -ఆయిల్ -నెయ్యి -జీలకర్ర -ఎండుమిర్చి -పచ్చిమిర్చి -అల్లం తరుగు -వెల్లుల్లి తరుగు -కారం -పసుపు -ధనియాల పొడి -జీలకర్ర పొడి -ఉప్పు -కొత్తిమీర -టమాటో -ఇంగువ

తయారీ విధానం -ముందుగా అరకప్పు బియ్యం, అరకప్పు పెసరపప్పు విడివిగా కనీసం గంట సేపు నానబెట్టాలి.

తర్వాత స్టవ్ మీద కుక్కర్ పెట్టి అందులో నానిన బియ్యం, నానిన పెసరపప్పు వేసి అందులోనే కొంచెం ఉప్పు, చిటికెడు పసుపు, 3 కప్పుల నీళ్లు, అర టీస్పూన్ నెయ్యి పోసి కుక్కర్ మూతపెట్టి మీడియం మంట మీద 4-5 విజిల్స్ రానివ్వాలి.

-తర్వాత స్టవ్ మీద బాండీ పెట్టి అందులో 3 టేబుల్ స్పూన్ల ఆయిల్ వేడి చెయ్యాలి. ఆయిల్ వేడెక్కిన తర్వాత రెండు చీరిన పచ్చిమిర్చి, అర టీస్పూన్ జీలకర్ర, 1 టేబుల్ స్పూన్ వెల్లుల్లి తరుగు, అర టేబుల్ స్పూన్ అల్లం తరుగు, చిటికెడు ఇంగువ వేసి తాళింపు ఎర్రగా వేగాలి. -ఇప్పుడు అందులో 1 ఉల్లిపాయ తరుగు వేసి అవి



మెత్తబడి గోల్డెన్ బ్రౌన్ కలర్ లోకి వచ్చేదాకా వేయించుకున్నాక అందులో 1 పెద్ద టమాటో తరుగు వేసి ముక్కలు గుజ్జుగా అయ్యేదాకా వేయించాలి.

-టమాటో ముక్కలపై స్కిన్ సపరేట్ అయ్యాక అందులో పావు టీస్పూన్ పసుపు, 1 టీస్పూన్ ధనియాల పొడి,అర టీస్పూన్ కారం, అర టీస్పూన్ వేయించిన జీలకర్ర పొడి వేసి వేయించాలి. -తర్వాత అందులో ఉడికించిన అన్నం వేసి ఇందులో ముప్పావు కప్పు వేడి నీళ్లు పోసి అన్నాన్ని గరిటతో బాగా కలుపుకోవాలి. గుజ్జుగా కావాలనుకుంటే మాష్ చేయండి లేదంటే అలానే వదిలేయండి. -ఇప్పుడు అందులో రుచికి సరిపడా ఉప్పు, కొత్తిమీర తరుగు వేసి కలిపాక మరో ముప్పావు కప్పు వేడి నీళ్లు పోసి కలిపి 4-5 నిమిషాలు అది దగ్గరపడేదాకా ఉడికించాలి. -తర్వాత స్టవ్ మీద మరో బాండీ పెట్టి అందులో 2 టేబుల్ స్పూన్ల ఆయిల్ వేడి చేశాక అందులో 1 టేబుల్ స్పూన్ వెల్లుల్లి తరుగు, 2 ఎండుమిర్చి,పావు టీస్పూన్ ఇంగువ వేసి వేయించి స్టవ్ ఆఫ్ చేసి అందులో రుచికి సరిపడా కశ్మీరీ కారం వేసి కలిపండి.

-ఈ తాళింపుని కిచిడీలో వేసి కలుపుకుంటే టేస్టీ దాల్ ఖిచిడీ రెడీ. దీనిని రైతాతో కలిపి తింటే అదిరిపోతుంది.

కొన్ని ప్రయోజనాలు దాల్ ఖిచిడి చాలా తేలికైన ఆహారం, సులభంగా జీర్ణం అవుతుంది. అందుకే అనారోగ్యంగా ఉన్నప్పుడు ముఖ్యంగా కడుపు నొప్పితో బాధపడుతున్నప్పుడు దీనిని సూచిస్తారు. బియ్యం, పప్పుల కలయిక జీర్ణవ్యవస్థపై భారం తగ్గించి, శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తుంది. ఇది కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలకు మంచి మూలం. ఇందులో ఉండే కార్బోహైడ్రేట్లు,ప్రోటీన్లు శరీరానికి నిరంతర శక్తిని అందిస్తాయి. దాల్ ఖిచిడిలో ప్రోటీన్ మరియు ఫైబర్ అధికంగా ఉండటం వల్ల త్వరగా కడుపు నిండిన భావన కలుగుతుంది, తద్వారా అతిగా తినడం తగ్గుతుంది. ఇది బరువు తగ్గాలనుకునే వారికి, కండరాలను పెంచుకోవాలనుకునే వారికి మంచి ఆహారం.

## మామిడి తాండ్ర ఎలా చేసుకోవాలంటే



మామిడి తాండ్ర తయారీకి కావాల్సిన పదార్థాలు -మామిడికాయలు -చక్కెర లేదా బెల్లం -నెయ్యి లేదా ఆయిల్ -మ్యాంగ్ ఎసెన్స్ -నిమ్మరసం.

మామిడి తాండ్ర తయారీ విధానం -ముందుగా బాగా పండిన 1 కేజీ మామిడికాయ ముక్కలు తీసుకోండి. ముక్క కోసుకునే మామిడిపండ్లు అయితే కరెక్ట్ గా ఉంటుంది. -మామిడి పండ్ల ముక్కలపై ఉండే తొక్కను తీసేసి వాటిని మిక్సీ గిన్నెలో వేసి ఫైన్ పేస్ట్ లా గ్రైండ్ చేసుకోవాలి. -తర్వాత స్టవ్ మీద మందంగా ఉండే కడాయిని పెట్టి అందులో గ్రైండ్ చేసుకున్న మామిడి పేస్ట్, పావు కేజీ చక్కెర లేదా బెల్లం తురుము అయినా వేసి అది కరిగేవరకు తక్కువ మంట మీద ఉంచాలి. -తర్వాత అందులో 1 టీస్పూన్ నిమ్మరసం, పావు టీస్పూన్ మ్యాంగో ఎసెన్స్ వేసి కలిపి 10-15 నిమిషాలు తక్కువమంట మీద ఉడికించాలి. మధ్య మధ్యలో కలుపుతూ ఉండాలి. -మ్యాంగో మిశ్రమాన్ని మరీ దగ్గరికి అయ్యేట్లు ఉడికించకూడదు.కొంచెం జెల్లీలా అయిన తర్వాత స్టవ్ ఆఫ్ చేసేసి లైట్ గా చల్లారనివ్వాలి. -ఇప్పుడు ఓ స్టీల్ ప్లేట్ తీసుకొని దానీమిద 3 నెయ్యి చుక్కలు లేదా నూనె బొట్లు వేసి ప్లేట్ మొత్తం రుద్దాలి. -తర్వాత మ్యాంగో మిశ్రమాన్ని దానిమీద సన్నని లేయర్ గా స్ప్రెడ్ చేయండి. -ఇప్పుడు ఆ ప్లేట్ ని ఎండలో పెట్టి దానిమీద డస్ట్ పడకుండా పల్చటి గుడ్డ కప్పండి. -2-3 రోజులు బాగా ఎండిన తర్వాత గట్టి లేయర్ గా ఏర్పడుతుంది. ఇప్పుడు దాన్ని ప్లేట్ లో నుంచి ఎడ్జెట్ ను జరుపుతూ మెల్లిగా తీసేయండి. అంతే మామిడి తాండ్ర రెడీ. దీనిని మీకు నచ్చిన షేపులో కట్ చేసుకొని వాటిని బాక్సుల్లో పెట్టుకుంటే సంవత్సరం మొత్తం వీటిని ఆస్వాదించవచ్చు.

## ఈ మిల్లెట్ ఇడ్లీ వారానికోసారైనా తినాలి

మన తెలుగు ప్రజలు ఎక్కువగా తినే బ్రేక్ ఫాస్ట్ లలో ఇడ్లీ ప్రధానమైనది. అయితే ఎక్కవగా తెల్ల ఇడ్లీనే తింటుంటారు. అయితే రెగ్యులర్ గా అవే ఇడ్లీ తిని తిని కొందరికి బోర్ కొట్టేస్తుంటది? అయితే ఇళ్లల్లో మాత్రం అమ్మలు ఆరోగ్యానికి మంచిది అని ఇడ్లీనే ఎక్కువగా తయారుచేస్తుంటారు. అయితే మీ ఇళ్లల్లో కూడా పిల్లలు,పెద్దలు ఇడ్లీ బోర్ కొడుతుంది తినబుద్ధి కావట్లేదు అంటుంటే టేస్టీగా అదే సమయంలో ఆరోగ్యానికి మేలుచేసేలా సజ్జ ఇడ్లీ చేసి పెట్టండి. ఒక్కసారి తిన్నారంటే మళ్లీ మళ్లీ చేసిపెట్టాలని బతిమాలతారు. సజ్జలలో ఐరన్, జింక్ ఎక్కువగా ఉండటం వల్ల ఎముకలు ఉక్కులా బలంగా మారుతాయి. ఫైబర్ కంటెంట్ కూడా ఎక్కువగా ఉండటం వల్ల మలబద్దకం సమస్య ఉన్నోళ్లకి, డైట్ ఫాలో అయ్యేవాళ్లకి సజ్జలతో చేసిన ఇడ్లీ చాలా మేలు చేస్తుంది. టేస్టీగా,మెత్తడి దూదిలాంటి సజ్జ ఇడ్లీ ఎలా తయారుచేసుకోవాలో ఇక్కడ చూడండి.

సజ్జ ఇడ్లీ తయారీకి కావాల్సిన పదార్థాలు -మినపగుళ్లు -సజ్జ రవ్వ -ఉప్పు -వంటసోడా

సజ్జ ఇడ్లీ తయారీ విధానం -ముందుగా ఒక పెద్ద గిన్నె తీసుకొని అందులో 1 గ్లాసు మినపగుళ్లు వేసి నీళ్లు పోసి రెండుసార్లు శుభ్రంగా కడగండి. - తర్వాత నీళ్లు పోసి 4-5 గంటలు నానబెట్టుకోవాలి. - తర్వాత నానిన మినపగుళ్లలోని నీటిని 90శాతం వంపేసి మిగతావాటిని మినపగుళ్లతో సహా మిక్సీ గిన్నెలో వేసి వీలైనంత సాఫ్ట్ గా గ్రైండ్ చేసుకోవాలి. -తర్వాత ఓ పెద్ద గిన్నెలో 2 గ్లాసుల సజ్జ రవ్వ పోసి నీళ్లు పోసి శుభ్రంగా కడిగి నీళ్లు వంపేసి సజ్జ రవ్వను పక్కనపెట్టుకోండి. -ఇప్పుడు ఓ హాట్ బాక్స్ లేదా పెద్ద గిన్నెలో గ్రైండ్ చేసుకున్న పిండిని, కడిగిన సజ్జ రవ్వను వేసి బాగా కలిసేలా కలిపి మూతపెట్టేసి రాత్రంతా లేదా 7-8 గంటలు పక్కన ఉంచాలి. -



తర్వాత మూత తీసి పులిసిన పిండి ఒకసారి కలిపి అందులో రుచికి సరిపడా ఉప్పు, పావు టీస్పూన్ వంటసోడా వేసి కలుపుకోవాలి. పిండి మరీ గట్టిగా ఉంటే కొన్ని నీళ్లు పోసుకొని కలపండి. -ఇప్పుడు ఇడ్లీ పాత్రలోకి పిండిని పెట్టి ఉడికించుకోవాలి. అంతే సజ్జ ఇడ్లీ రెడీ. దీనిని నచ్చిన చట్నీతో లేదా కారం పొడులతో తింటే టేస్ట్ ఇంకా అదిరిపోతుంది. కొన్ని ప్రయోజనాలు సజ్జ ఇడ్లీలు రుచికరమైనవే కాకుండా, ఆరోగ్యానికి కూడా చాలా మంచివి. మీ దినచర్యలో వీటిని చేర్చుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు పొందవచ్చు. సజ్జల్లో ఫైబర్ ఎక్కువ ఉండటం వల్ల కొద్దిగా తిన్నా కడుపు నిండిన భావన కలుగుతుంది. దీనివల్ల అతిగా తినడం తగ్గి, బరువు అదుపులో ఉంటుంది. అదేవిధంగా సజ్జల్లో ఉండే ప్రోటీన్ కండరాల నిర్మాణానికి, కణజాల మరమ్మత్తుకు సహాయపడుతుంది. సజ్జ పిండి శరీరంలోని విష పదార్థాలను బయటకు పంపడంలో సహాయపడుతుంది. దీనివల్ల మూత్రపిండాలు, కాలేయ సమస్యల నుండి రక్షణ పొందవచ్చు. సజ్జలకు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుంది. అంటే ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను నెమ్మదిగా పెంచుతాయి కాబట్టి షుగర్ పేషెంట్లకు ఇవి చాలా మంచివి. సజ్జల్లో మెగ్నీషియం, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, గుండెపోటు, స్ట్రోక్ వంటి వాటిని నివారించడంలో తోడ్పడతాయి

# సినిమా న్యూస్



## సర్దార్ 2 సాహసానికి మాళవిక సవాల్



ప్రముఖ సినిమాటోగ్రాఫర్ మోహనన్ కుమార్తెగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన మాళవిక మోహనన్, తక్కువ టైమ్ లోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకున్నారు. మలయాళ సినీ పరిశ్రమలో ప్రారంభమైన ఆమె ప్రయాణం, తమిళం, తెలుగు భాషల్లో విస్తరించి ఇప్పుడు పాన్ సౌత్ స్థాయికి చేరుకుంది. గ్లామర్ రోల్స్‌కే పరిమితం కాకుండా, సవాళ్లతో కూడిన పాత్రలను ఎంచుకోవడంలో ఆమె చూపిస్తున్న ధైర్యం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ప్రస్తుతం మాళవిక నటిస్తున్న సర్దార్2లో తన పాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని సమాచారం. యాక్షన్ ప్రధానంగా సాగే ఈ సినిమాలో ఆమెకు కొన్ని కూల్, ఛాలెంజింగ్ సీన్స్ ఉన్నాయని స్వయంగా మాళవికనే వెల్లడించారు. ముఖ్యంగా యాక్షన్ ఎపిసోడ్‌లు ప్రేక్షకుల నరాలు కదిలేలా ఉంటాయని, వాటి కోసం ఎంతో శ్రమించాల్సి వచ్చిందని ఆమె పేర్కొన్నారు. సాధారణంగా హీరోలకే పరిమితమయ్యే హై ఆక్టేన్ సీన్స్ లో తాను భాగమవడం తనకు కొత్త అనుభవమని చెప్పారు. యాక్షన్ సీన్స్ కోసం స్పెషల్ ట్రైనింగ్ సర్దార్2 మూవీలో తన క్యారెక్టర్ గత సినిమాల కంటే భిన్నంగా ఉండబోతుందని మాళవిక స్పష్టం చేశారు. ఈమూవీలో శారీ రకంగా మాత్రమే కాకుండా మానసికంగా కూడా సిద్ధమవాల్సిన సీన్స్ ఉన్నాయని, యాక్షన్ సీక్వెన్స్‌ల కోసం స్పెషల్ ట్రైనింగ్ తీసుకున్నట్లు ఆమె తెలిపారు. భారీ సెటప్‌ల మధ్య, టెక్నికల్‌గా కఠినమైన సీన్స్ లో నటించడం తనకొక పెద్ద సవాలుగా అనిపించిందని.. అయినప్పటికీ ఆ కష్టానికి ఫలితం తెరపై కనిపిస్తుం దని నమ్మకంగా చెబుతున్నారు మాళవిక. గ్లామర్‌కు మాత్రమే పరిమిత మవకుండా ఎక్స్‌పెరిమెంటల్ క్యారెక్టర్లు చేయడమంటే తనకు ఇష్టమని, ప్రయోగాత్మక పాత్రలు చేసి ఆడియన్స్ ను ఆకట్టుకోవడమే తన టార్గెట్ అని ఆమె చెప్తున్నారు. మాళవిక చెప్తున్న దాన్ని బట్టి చూస్తుంటే సర్దార్2 లో తన పాత్ర ఆమె కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచే అవకాశమున్నట్టు తెలుస్తోంది. కార్తీ హీరోగా తెరకెక్కుతున్న సర్దార్2 కు పి.ఎస్ మిత్రన్ దర్శకత్వం వహిస్తుండగా, 2022లో వచ్చిన సక్సెస్‌ఫుల్ మూవీ సర్దార్ కు సీక్వెల్ గా ఇది తెరకెక్కుతుంది. ప్రస్తుతం విజయ్ సేతుపతితో పాకెట్ నావెల్ మూవీతో పాటూ పలు సినిమాలతో బిజీగా ఉన్న మాళవిక దృష్టి ప్రస్తుతం సర్దార్2 పైనే ఉ ందని తెలుస్తోంది. తానెంతో కష్టపడి చేసిన యాక్షన్ సీన్స్ ను ఆడియన్స్ ఎలా స్వీకరిస్తారో అని తెలుసుకోవడానికి మాళవిక చాలా ఎగ్జైటింగ్ గా ఎదురుచూస్తున్నట్టు చెప్పారు.

## వెంకీ ఆలోచనలో లాజిక్ కనిపిస్తుందిగా!



టాలీవుడ్‌లో రీమేక్‌ల ట్రెండ్ ను ఒకప్పుడు సేఫ్ జోన్‌గా భావించేవారు. హిట్ అయిన సినిమా కథను తీసుకుని దాన్ని ఇక్కడి నటీనటులతో తెరకెక్కిస్తే మినిమమ్ గ్యారెంటీ అనే నమ్మకముండేది. కానీ గత రెండు మూడేళ్లుగా ఆ ఈక్వేషన్ మారిపోయింది. ఈ నేపథ్యంలోనే విక్టరీ వెంకటేష్ గతంలో తీసుకున్న తన నిర్ణయాన్ని మార్చుకుంటున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే దృశ్యం సిరీస్ నుంచి రెండు సినిమాలు రాగా, ఆ రెండు సినిమాలూ మంచి సక్సెస్ ను అందుకున్నాయి. ఈ రెండు సినిమాలనీ తెలుగులో వెంకటేష్ తోనే రీమేక్ చేశారు. ఇప్పుడు మలయాళంలో దృశ్యం3 తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాను కూడా తెలుగులో వెంకీతోనే చేయాలనే ప్లాన్స్ ఉన్నప్పటికీ, వెంకీ దానిపై పెద్దగా ఆసక్తి చూపించడం లేదని తెలుస్తోంది. మలయాళ వెర్షన్ థియేటర్లలో రిలీజైన కొన్నాళ్లకే ఓటీటీలో అందుబాటులోకి రానుండటంతో, అదే కథను మళ్లీ థియేటర్లలో చూడ్డానికి ఆడియన్స్ ఇంట్రెస్ట్ చూపించకపోవచ్చని ఆయన భావిస్తున్నారు. ఇటీవల కాలంలో రీమేక్ సినిమాల పరిస్థితిని చూస్తే వెంకీ ఆలోచనలో లాజిక్ ఉందనిపిస్తుంది. భీమ్లా నాయక్ లాంటి కొన్ని రీమేక్స్ స్టార్‌డమ్ వల్ల మంచి ఓపెనింగ్స్ ను సాధించినా, గాడ్ ఫాదర్ లాంటి సినిమాలు మిక్స్డ్ టాక్ తో సరాసరి ఫలితాలకే పరిమితమైన సంగతి తెలిసిందే. పైగా ఓటీటీలో ఆల్రెడీ చూసిన కథను మళ్లీ థియేటర్ కు వెళ్లి చూడాలనే ఇంట్రెస్ట్ ఆడియన్స్ లో కూడా తగ్గిపోయింది. మరోవైపు వెంకీ కెరీర్ ను చూసుకుంటే, ఆయన రీమేక్‌లు చేసినా అందులో కూడా బాగానే సక్సెస్‌లు అందుకున్నారు. అయినప్పటికీ వెంకీ ప్రస్తుతమున్న ట్రెండ్‌కు తగ్గట్టుగా మార్పులు చేసుకునే ప్రయత్నం చేస్తున్నట్టు అనిపిస్తోంది. సంక్రాంతికి వస్తున్నాం బ్లాక్ బస్టర్ తో మంచి ఫామ్ లో ఉన్న వెంకీ, ప్రస్తుతం సేఫ్ గేమ్ కంటే ఫ్రెష్ కంటెంట్ అయితేనే బెటర్ అని, దాని వైపే మొగ్గ చూపుతున్నట్టు కనిపిస్తోంది. ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో ఆదర్శ కుటుంబం చేస్తున్న వెంకీ, అనిల్ రావిపూడితో తన తర్వాతి సినిమా కోసం చర్చలు జరుపుతున్నారని, సంక్రాంతి సీజన్ ను టార్గెట్ చేస్తూ ఫుల్ లెంగ్త్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ తో రావాలనే ప్లాన్ చేస్తున్నట్టు సమాచారం. రీమేక్ కథతో రిస్క్ చేయడం కంటే, తన ఇమేజ్ కు తగ్గ ఎంటర్టైనర్ తో రావడమే బెటర్ అని వెంకీ ఆలోచిస్తున్నారని తెలుస్తోంది.

## చిరు ఫ్యాన్స్ కోరిక శ్రీకాంత్ ఓదెల తీరుస్తాడా?



చిరు నుంచి రజనీ స్థాయి మాస్ మసాలా సినిమాని చాలా కాలంగా అభిమానులు ఆశిస్తున్నారు. రజనీ సినిమా అంటే కనిపించే వైబ్, బ్యాగ్రౌండ్ స్కోర్ .. ఆ హడావిడీ వేరుగా ఉంటుంది. మరి మన మెగాస్టార్ నుంచి అలాంటి సినిమా ఇంత వరకు ఎందుకు రావడం లేదు?. డైరెక్టర్లు పూనుకోవడం లేదా? లేక అలాంటి సినిమా చేయాలనే ఆలోచన మన వాళ్లలో ఎవరికీ రావడం లేదా? అనే చర్చ గత కొంత కాలంగా జరుగుతోంది. దీనికి యువ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరదించి సర్‌ప్రైజ్ చేయబోతున్నాడా? అంటే ఆవుననే సమాధానం వినిపిస్తోంది. వరుస ఫ్లాపుల తరువాత మెగాస్టార్ చిరంజీవి హిట్ మెషీన్ అనిల్ రావిపూడి డైరెక్ట్ చేసిన ఫ్యామిలీ యాక్షన్ కామెడీ డ్రామా –మన శంకరవరప్రసాద్ గారు–. ఈ సంక్రాంతి బరిలో నిలిచిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకుని మెగాస్టార్‌కు బ్లాక్ బస్టర్ హిట్‌ని అందించింది. ప్రపంచ వ్యాప్తంగా భారీ వసూళ్లని రాబట్టింది. చిరు సినిమాల్లో అత్యధిక వసూళ్లని రాబట్టిన సినిమాగా నిలిచి వరుస ఫ్లాపుల్లో ఉన్న చిరుకు కొత్త జోష్‌ని అందించింది. ఈ సినిమా అందించిన సక్సెస్ ఉ త్సాహంతో ఉన్న మెగాస్టార్ త్వరలో –విశ్వంభర– మూవీతో ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. మల్లిడి వశిష్ట డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ గ్రాఫిక్స్ ప్రధానంగా సాగే ఫాంటసీ యాక్షన్ డ్రామా. యువీ క్రియేషన్స్ అత్యంత భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ మూవీ గ్రాఫిక్స్ కారణంగా ఆలస్యం అవుతూ వస్తోంది. త్వరలోనే దీనికి సంబంధించిన రిలీజ్ డేట్‌ని మేకర్స్ ప్రకటించనున్నారు. ఇదిలా ఉంటే ఈ మూవీ తరువాత చిరు క్రేజీ ప్రాజెక్ట్‌ని చేయనున్న విషయం తెలిసిందే. నేచురల్ స్టార్ నానితో –ది ప్యారడైజ్–ని తెరకెక్కిస్తున్న యంగ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల ఈ మూవీని రూపొందించనున్నాడు. నేచురల్ స్టార్ నాని, సుధాకర్ చెరుకూరి సంయుక్తంగా ఈ భారీ మూవీని నిర్మించనున్నారు. ఇప్పటికే అధికారికంగా ప్రకటించిన ఈ ప్రాజెక్ట్ గురించి ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. శ్రీకాంత్ ఓదెల మార్కు బ్లడ్ షేడ్‌తో సాగే ఈ సినిమాలో చిరు క్యారెక్టర్ నెవర్ బిఫోర్ అనే స్థాయిలో ఉంటుందని, రస్టిక్ అండ్ ఇంటెన్స్, వయోలెంట్ గా ఉంటుందని ఇన్ సైడ్ టాక్. అంతే కాకుండా 1970 నేపథ్యంలో సాగే కథగా దీన్ని శ్రీకాంత్ ఓదెల తెరపైకి తీసుకురానున్నట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి. చిరు నుంచి ఓ పవర్ ఫుల్ మాస్ యాక్షన్ డ్రామాని ప్రేక్షకులు, అభిమానులు చాలా కాలంగా ఆశిస్తున్నారు.

## అందుకే పుట్టానేమో అనిపిస్తుంది



అలియా భట్ మొదటి సారి బ్రిటీష్ అకాడమీ ఫిల్మ్ అవార్డ్స్ స్టేజ్ పై అడుగుపెట్టి స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలిచారు. ఫిబ్రవరి 22న లండన్‌లోని రాయల్ ఫెస్టివల్ హాల్‌లో జరిగిన ఈ అంతర్జాతీయ వేడుకలో ఆమె బెస్ట్ ఫిల్మ్ నాట్ ఇన్ ది ఇంగ్లిష్ లాంగ్వేజ్ విభాగానికి ప్రెజెంటర్‌గా వ్యవహరించారు. ముంబై నుంచి నేరుగా లండన్‌కు చేరుకున్న అలియా, 30ల్లో జెట్ ల్యాగ్ మరింతగా ప్రభావం చూపుతుందని సరదాగా చెప్పినప్పటికీ, రెడ్ కార్పెట్‌పై మాత్రం అలసటకు ఎలాంటి ఆనవాళ్లను కనిపించనీయలేదు. కస్టమ్ గుచ్చి గౌన్‌లో అలియా ఓల్డ్ హాలీవుడ్ గ్లామర్‌ను గుర్తు చేశారు. హాలీవుడ్ లెజెండ్ మార్లిన్ మన్రో ధరించిన సిల్వర్ గౌన్ నుంచి ఇన్‌స్పైర్ అయిన ఈ లుక్‌కు స్పెషల్ గా షీర్‌లింగ్ ర్యాప్ జతచేసినట్టు తెలిపారు. ట్యూల్ ఫ్యాబ్రిక్‌పై సిల్వర్ సీక్విన్స్, మైక్రోబీడ్స్‌తో రూపొందించిన హాల్టర్ నెక్ డ్రెస్ అలియాకు సినిమాటిక్ గ్లోని అందించగా, ప్రెజెంటర్‌గా గ్లామరస్ ఉండాలి, కానీ అతి కాకూడదు. లుక్ ఎలిగెంట్‌గా, లైట్‌గా ఉండాలని అనుకున్నట్టు ఆమె పేర్కొన్నారు. గుచ్చీ తొలి భారతీయ గ్లోబల్ అంబాసిడర్‌గా క్రియేటివ్ ప్రాసెస్ లో భాగమవడం తనకు గర్వకారణమని అలియా ఈ సందర్భంగా వెల్లడించారు. గతేడాది కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ క్లోజింగ్ ఈవెంట్ లో గుచ్చీ హిస్టరీలో తొలి బెస్పోక్ లెహెంగా ధరించడం కూడా ఆమె స్టైల్ స్టేట్‌మెంట్‌గా నిలిచింది. 2012లో రిలీజైన స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ మూవీతో బాలీవుడ్‌లో కెరీర్ ను స్టార్ట్ చేసిన అలియా, దశాబ్దానికి పైగా స్టార్ హీరోయిన్ గా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా తన సినీ ప్రయాణం గురించి మాట్లాడుతూ, చిన్నప్పటి నుంచే సినిమాల్లోకి రావాలనేది తన కల అని, సినిమాల్లో నటించడానికే పుట్టానేమో అనిపిస్తుందని, కెమెరా ముందు నిలబడిన ప్రతిసారీ తనకు కొత్త ఉత్సాహం వస్తుందని, ఈ ఇండస్ట్రీలో భాగమవడం ఒక వరమని చెప్పారు. సినిమా అనుభవానికి భాష అడ్డంకి కాదని చెప్పిన అలియా, ఎమోషన్సే కథను ముందుకు నడిపిస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పర్సనల్ లైఫ్ పై కూడా అలియా స్పందించి మాట్లాడారు.

# రేవంత్‌వి డైవర్షన్ పాలిటిక్స్

## - మున్సిపల్ ఎన్నికలల్లో డ్రామా నడిపించారు
## - డ్రామాలతో కాలం గడుపుతున్న సిఎం రేవంత్
## - మండిపడ్డ కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

(పొలిటికల్ పవర్)

హైదరాబాద్, ఫిబ్రవరి 23 : సీఎం రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ విమర్శించారు. మున్సిపల్ ఎన్నికలు మొత్తాన్ని ఒక డ్రామా నడిపించారని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మెతుకు ఆనంద్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. సీఎం రేవంత్ రెడ్డి ఏ ఒక్క రోజూ మున్సిపాలిటీల అభివృద్ధి గురించి చెప్పలేదని సంజయ్ అన్నారు. ప్రజాస్వామ్యాన్ని నమ్ముకున్న వ్యక్తిగా, ఒక డాక్టర్‌గా, రాజ్యాంగాన్ని నమ్ముకున్న వ్యక్తిగా అన్ని వాస్తవాలను ప్రజల ముందు పెడుతున్నానని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల ముందు మా నాయకుడు హరీశ్‌రావు సిట్ పేరుతో నోటీసులు ఇచ్చి మొదటి డ్రామాకు తెరలేపారని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏమైనా ఉందా అంటే మన్ను లేదు మశానం లేదని అన్నారు. దావోస్ పేరుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విహార యాత్రకు చేశాడని.. మొత్తం 12 రోజుల పాటు వెళ్లిన ముఖ్యమంత్రి , దావోసు నుండి తెలంగాణకు వచ్చిన పెట్టుబడులు గురించి చెప్పలేదని పేర్కొన్నారు. పెట్టుబడులపై మంత్రి శ్రీధర్ బాబు అయినా మాట్లాడతాడని అనుకుంటే ఆయన కూడా మాట్లాడలేదని చెప్పారు. అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనను విహార యాత్ర అంటున్నామని విమర్శించారు. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా తెలంగాణ జాతిపిత అయిన కేసీఆర్‌కు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులిచ్చి రెండో డ్రామాకు తెరలేపారని సంజయ్ మండిపడ్డారు. ప్రజల దృష్టి మరల్చడంలో రేవంత్ రెడ్డి ఆయనకు ఆయనే సాటి అని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు ఉన్నప్పుడు మున్సిపాలిటీల్లో సభలు నిర్వహిస్తాడని.. మున్సిపల్ ఎన్నికలు ఉన్నప్పుడు గ్రామ పంచాయతీలో సభలు నిర్వహిస్తాడని చెప్పారు. ఏదో ఒక రకంగా ప్రజలను రేవంత్ రెడ్డి మభ్య పెడుతున్నాడని మండిపడ్డారు. ఇతర పార్టీలతో అంటకాగేది రేవంత్ రెడ్డి అని.. కానీ బీఆర్ఎస్‌కు బీజేపీకి లింక్ పెడుతున్నారని విమర్శించారు. వీణా వాణి గురించి నీచంగా మాట్లాడిన వ్యక్తి రేవంత్ రెడ్డి అంటూ ధ్వజమెత్తారు. ఈ రాష్ట్రానికి ముమ్మాటికి జాతిపిత కేసీఆరే అని స్పష్టం చేశారు. ప్రజలు అన్ని గమనిస్తూనే ఉన్నారని.. తగిన సమయంలో రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పడం ఖాయమని సంజయ్ స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికలు ముగిసే వరకు కేసీఆర్ ను తిట్టడం తప్పా, అభివృద్ధి గురించి మాట్లాడడం లేదని తెలిపారు. తప్పులు చేస్తే చెప్పండి అని మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి, ప్రతిరోజు తప్పులు చేస్తూనే ఉన్నాడని పేర్కొన్నారు. రాబోయే బడ్జెట్ సమావేశాల్లో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి సమస్యలపై మాట్లాడే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ బ్జడెట్ సమావేశాల్లో నిజాయితీగా ప్రజల సమస్యల పై చర్చ చేయాలన్నారు. ఈ బ్జడెట్ లో మహిళలకు, రైతులకు, నిరుద్యోగులకు ఇస్తామని చెప్పిన హామీలకు నిధులు కేటాయించకపోతే వారందరూ కలిసి కాంగ్రెస్‌కుబుద్ధి చెప్పడం ఖాయమని స్పష్టం చేశారు. ఈ బ్జడెట్ సమావేశాల్లో రేవంత్ రెడ్డికి ఫేవరేట్ స్జబెక్ట్ అయిన రియల్ ఎస్టేట్ గురించి మాట్లాడుదామని తెలిపారు. సమావేశాలకు వచ్చే ముందు దేవాదుల ఏ బేసిన్‌లో ఉందో తెలుసుంటే బావుంటుందని రేవంత్ రెడ్డిపై సెటైర్లు వేశారు. ఎట్టకేలకు దేవాదుల ప్రాజెక్టు దగ్గరకు వెళ్లినందుకు సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు శ్రీరామ రక్ష అని రేవంత్ రెడ్డికి తెలుసు అని సంజయ్ అన్నారు. అందుకే కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్ చేయాల్సిందేనని తెలిపారు. బ్జడెట్ సమావేశాల్లో మాకు మైక్ ఇవ్వమని చెప్పండి, జలాల పై చర్చకు సిద్ధమని పేర్కొన్నారు.

## మరోమారు భారీగా పెరిగిన బంగారం ధరలు

మొదటిపేజీ తరువాయి

మార్కెట్లు అస్థిరంగా ఉన్నాయి. దీంతో సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు ఇన్వెస్టర్లు మొగ్గ చూపుతున్నారని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. భారత్ తన బంగారం అవసరాల కోసం పూర్తిగా దిగుమతులపైనే ఆధారపడుతోంది.. దేశీయంగా తగినంత వెలికితీత వనరులు లేకపోవడం కూడా ధరలపై ప్రభావం చూపుతోందని వెల్లడించారు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. తాజా ధరల వివారల్లోకి వెళ్తే.. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 3,724 పెరిగి.. రూ. 1,60,600కి చేరింఇ.. ఇదే సమయంలో కిలో వెండి ధర రూ. 15,931 పెరిగి రూ. 2,68,875కు ఎగబాకింది.. అయితే, బంగారం, వెండి ధరల పెరుగుదలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. ఆర్బీఐ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోంది. కొనుగోళ్లు ఇంకా పరిమితి దాటలేదు' అని పేర్కొన్నారు ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్..

## గౌరవెల్లి ప్రాజెక్ట్‌కు లీగల్ సమస్యలు

మొదటిపేజీ తరువాయి

వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టుపై మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్.. సచివాలయంలో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ ప్రాజెక్టు కాలువల భూసేకరణ పూర్తి చేసి పనులు వేగవంతం చేసేలా సమీక్షా సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. పొన్నం ప్రభాకర్ గౌరవెల్లి ప్రాజెక్టు కోసం తమ మీద ఒత్తిడి తీసుకొస్తున్నారని తెలిపారు. సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ మూడు జిల్లాల కలెక్టర్‌లు, రాష్ట్ర అడ్వకేట్ జనరల్, ఇరిగేషన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించామని అన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టులో లీగల్ ఇబ్బందులు ఎలా క్లియర్ చేయాలో చర్చించామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు భూసేకరణ, పనుల వేగవంతంపై ఎలా ముందుకు వెళ్లాలో చర్చించామన్నారు. భూసేకరణ విషయంలో హామీ ఇచ్చామని తెలిపారు. సంబంధిత నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చామని అన్నారు. ఈ మేరకు బుధవారం నాడు సుప్రీంకోర్టులో ఈ ప్రాజెక్టు కేసు విచారణ ఉందని ప్రస్తావించారు. సర్వోన్నత న్యాయస్థానంలో ఎన్వీరాన్‌మెంట్ కేసు గెలుస్తామనే విశ్వాసం తమకుందన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టును అన్ని విధాలుగా పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. దేవాదుల ప్రాజెక్టు నీళ్లు హుస్నాబాద్ నియోజకవర్గానికి రావడానికి కావల్సిన పెండింగ్ పనులు పూర్తి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, కరీంనగర్, సిద్దిపేట, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, ఇరిగేషన్ అధికారులు, ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## వికసిత్ బెంగాల్ బాధ్యత నాది

మొదటిపేజీ తరువాయి

ఫలితాలను ఇవాళ ప్రజలు చూస్తున్నారని అన్నారు. బెంగాల్ అభివృద్ధి విషయంలో మమతాబెనర్జీ ప్రభుత్వం సహాయ నిరాకరణ చేస్తోందని మోదీ ఆ లేఖలో విమర్శించారు. అయినప్పటికీ ప్రజాసంక్షేమానికి కట్టుబడి కేంద్రం ముందుకు వెళ్తోందన్నారు. 'జన్-ధన్ యోజన'తో పశ్చిమబెంగాల్‌లోని సుమారు 5 లక్షల మందికి బ్యాంకు అకౌంట్లు తెరిచామని, స్వచ్ఛభారత్ అభియాన్ కింద 85 లక్షల టాయిలెట్లను రాష్ట్రంలో నిర్మించామని చెప్పారు. చిన్న వ్యాపారులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు రూ. 2.82 లక్షల కోట్లు రుణాలిచ్చామని, 56 లక్షల మంది సీనియర్ సిటిజన్లకు అటల్ పెన్షన్ యోజన కింద లబ్ది చేకూర్చామని, ఉజ్వల్ యోజన కింద కోటికి పైగా ఎల్పీజీ కనెక్షన్లు ఇచ్చామని చెప్పారు. 'కిసాన్ సమ్మాన్ నిధి' ద్వారా 52 లక్షల మంది రైతులకు నేరుగా ఆర్థిక సాయం అందించామని వివరించారు. 'నేతాజీ సుభాష్ చంద్రబోస్ పుట్టిన గడ్డలో ఇవాళ అక్రమ చొరబాట్లు, మహిళలపై హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

## కలుషిత ఆహారం పెట్టారంటూ విద్యార్థుల ఆందోళన

మొదటిపేజీ తరువాయి

కలుషిత ఆహారం పెడుతున్నారని ఆరోపిస్తూ తరగతులు బహిష్కరించి రోడ్డెక్కారు. మంచి ఆహారం పెట్టి, కనీస వసతులు కల్పించాలని, ప్రిన్సిపాల్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ నిరసనకు దిగారు.

## కామారెడ్డిలో తగ్గని ఉద్రిక్తత

మొదటిపేజీ తరువాయి

ఉండగా.. డాక్టర్లు ఆయన ఇంటికి వెళ్లి ప్రాథమిక వైద్య పరీక్షలు చేశారు. కామారెడ్డి నియోజకవర్గంలో భూ వివాదానికి సంబంధించి జరుగుతున్న గొడవ.. సవాళ్లు, ప్రతి సవాళ్లకు దారితీసింది. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే ఆరోగ్యంపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆరా తీస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు తెలిపారు. అయితే మరికొన్ని రోజుల పాటు ఆయనకు విశ్రాంతి అవసరమని సూచించారు. ఇదిలావుంటే కామారెడ్డిలో ఉద్రిక్త పరిస్థితి కొనసాగుతోంది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నేతల మధ్య సవాళ్ల నేపథ్యంలో స్థానికంగా హైటెన్షన్ వాతావారణం నెలకొంది. సోమవారం జిల్లా కలెక్టర్‌తో బీజేపీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి భేటీ కావాలనున్నారు. తనపై చేసిన ఆరోపణల నేపథ్యంలో అందుకు సంబంధించిన సాక్ష్యాలు తీసుకురావాలంటూ కాంగ్రెస్ నేతలకు ఆయన సవాల్ విసిరారు. ఈ సవాల్‌ను కాంగ్రెస్ నేతలు స్వీకరించారు. అందుకు సంబంధించిన సాక్ష్యాలను కలెక్టర్ వద్దకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. మరోవైపు డిగ్రీ కాలేజీ భూముల విషయంలో తాను అవినీతి చేసినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానని వెంకట రమణారెడ్డి ప్రకటించిన విషయం విదితమే. రాజీనామాకు సిద్ధం కావాలంటూ ఎమ్మెల్యేకు కాంగ్రెస్ నేతలు సవాల్ విసిరారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ భూములపై స్పష్టత ఇవ్వాలంటూ అధికారులను బీజేపీ డిమాండ్ చేసింది. ఇలా ఇరు పార్టీనేతల విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకోవడంతో కామారెడ్డిలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నేపథ్యంలో పోలీసులు వెంటనే అలర్ట్ అయ్యారు. ఇరు పార్టీల నేతలను కలెక్టర్ కార్యాలయానికి పోలీసులు వెళ్లనిస్తారా? లేదా? అన్నదానిపై ఉత్కంఠ నెలకొంది. బీజేపీ ఎమ్మెల్యేకు మద్దతుగా కామారెడ్డి వెళ్లేందుకు యత్నించిన తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావును పోలీసులు ఆదివారం హౌస్ అరెస్ట్ చేశారు. అనంతరం ఆయన్ను అదుపులోకి తీసుకుని బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అదే విధంగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కామారెడ్డి వెళ్తుండగా.. ఆయన్నూ పెద్దశంకర్‌పేట వద్ద అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించిన విషయం విదితమే.

## జిల్లాలా జైలులో బాల్క సుమన్‌కు పరామర్శ

మొదటిపేజీ తరువాయి

ఉన్న బీఆర్ఎస్ ఏనాడు ఇలాంటి చర్యలకు పాల్పడలేదని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నదని పేర్కొన్నారు. కాంగ్రెస్ దురాగతాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. జైలులో అధికారులు సుమన్‌ను మానసిక శోభకు గురి చేస్తున్నారని, దోమలు బాగా ఉన్న పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి తెలిపారు. కొంత అనారోగ్యానికి గురైన వైద్యం అందించడం లేదని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. ఇదిలావుంటే రిమాండ్‌లో ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బెయిల్ పిటిషన్ పై వాదనలను కోర్టు నేటికి వాయిదా వేసింది. జిల్లా జైలులో ఉన్న బాల్కసుమన్‌కు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణకు రాగా కోర్టు పరిశీలించింది. కౌంటర్ పిటిషన్ పై గడువు కావాలని పోలీసులు కోరగా బెయిలు పిటిషన్ పై వాదనలను రేపటికి వాయిదా వేసింది. జిల్లాలోని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు అత్యధిక సంఖ్యలో విజయం సాధించగా చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నికకు కాంగ్రెస్ అడ్డంకులు సృష్టించింది. పోలీసులను, ప్రభుత్వాన్ని నిలదీసిన బాల్కసుమన్‌పై అక్రమ కేసులు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించింది . గత వారం రోజులకు పైగా సుమన్ మంచిర్యాల జిల్లా జైలులో ఉన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు బంద్ నిర్వహించాయి .



# రాహుల్ గాంధీ ప్రధాని చేసేందుకు సిద్ధం కండి



సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ వేముల కుల వివక్షను భరించలేక బలవన్మరణానికి పాల్పడితే రాహుల్ గాంధీ నేరుగా యూనివర్సిటీకి చేరుకొని విద్యార్థులతో చర్చించి పోరాట విధానాన్ని ఖరారు చేశారని తెలిపారు. ఆ సమయంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలను ఎవరిని కూడా యూనివర్సిటీలోకి రానివ్వలేదు అంటరానితనం సమస్యను సమస్యగా చూడాలి తప్ప రాజకీయ జోక్యం ఉండకూడదన్నది ఆయన ఆలోచన అని వివరించారు. ఆయన ఆలోచన మేరకు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో రోహిత్ వేముల చట్టం తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ రాష్ట్రంలో అధికారంలోకి వస్తాం రాగానే వనరులు సంపద సమానంగా పంచుతామని ఎన్నికల ముందు రాహుల్ గాంధీ ప్రకటించారు ఆయన ప్రకటించినట్టుగా అధికారంలోకి రాగానే ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. దేశ స్వాతంత్రం అనంతరం ఎక్కడా జరగని కుల గణనను ప్రజా ప్రభుత్వం 50 రోజుల్లో పూర్తి చేసి శాసనసభలో ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదం పొందాలని వివరించారు.దేశానికి స్వాతంత్రం సాధించడంతోపాటు ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వం సాధించేందుకు అనేక విప్లవాత్మక చట్టాలు చేసిన కాంగ్రెస్ పార్టీని కనుమరుగు చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తుందని తెలిపారు. స్వాతంత్రం ముందు నుంచి దేశంలోని రుగ్మతల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్న కాంగ్రెస్ పార్టీని దేశంలో లేకుండా చేసేందుకు బీజేపీ కాంగ్రెస్ ముక్తభారత్ చేస్తాం, రాజ్యాంగాన్ని మారుస్తాం అంటుంది అన్నారు. ఈ సమాజం సామాజికంగా, ఆర్థికంగా విభజన జరిగి ఇలాగే ఉండాలని కొన్ని రాజకీయ పార్టీలు కోరుకుంటున్నాయని తెలిపారు. కులం అనేది భారతదేశంలో ఒక వాస్తవం, తాను కుల వివక్షణ ఎదుర్కొన్నానని వివరించారు. ఈ సమాజంలో కుల వివక్ష ఉంటుంది అన్న వాస్తవాన్ని మదిలో పెట్టుకుని బలమైన సంకల్పంతో అనుకున్న లక్ష్య సాధనకు ముందుకు పోతున్న క్రమం లో వివక్ష ఎదురైన అది మన లక్ష్యాలను దెబ్బతీయలేదని ముందుకు తీసుకువెళ్లిందని వివరించారు. కాకినాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో అంటరానితనం పూర్తిగా నిర్మూలించాలని, దేవాలయాల్లో అందరికీ ప్రవేశం కల్పించాలని ఉఐ మాధవన్ తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కేరళలో వైకాం సత్యాగ్రహ, మహారాష్ట్రలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో చౌదర్ సత్యాగ్రహం వంటి కార్యక్రమాలను అఖిలభారత కాంగ్రెస్ కమిటీ చేపట్టింది అన్నారు. గాంధీజీ ఆధ్వర్యంలో హరిజనోద్ధరణ పేరిట పెద్ద యాత్ర చేపట్టారని దళితుల దేవాలయల ప్రవేశం, దళిత వాడల్లో పారిశుద్ధ్యం వంటి కార్యక్రమాలు ఈ దేశంలో అంటరానితనాన్ని తొలగిస్తారని గాంధీ ఓ నమ్మకాన్ని ఏర్పరిచారని తెలిపారు.

స్వాతంత్రం వచ్చిన తర్వాత ప్రధాని నెహ్రూ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో దేశంలో అంటరాని తనం నిర్మూలనకు 1049లో ఆర్టికల్ 17 ద్వారా అవకాశం కల్పించారని తెలిపారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని తీసుకురావడం, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ను పూర్తిగా అమలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వాల ద్వారానే సాధ్యమైంది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ సంస్కరణలు, బ్యాంకుల జాతీయ కరణ ద్వారా ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ఆర్థిక స్వాతంత్రం లభించిందని తద్వారా సామాజిక వివక్షను ఎదుర్కొనేందుకు చేయూత లభించిందని డిప్యూటీ సీఎం వివరించారు. సమావేశంలో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డాక్టర్ వంశీ చందర్ రెడ్డి, ఏ ఐ సి సి నాయకులు విశ్వనాథన్, సావంత్, సచిన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# వాట్సాప్ ద్వారా విద్యుత్ సేవలు

## - సేవలను సులభంగా చేయాలన్న లక్ష్యం - టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ

హైదరాబాద్, ఫిబ్రవరి 23 : దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) వినియోగదారులకు మరింత సులభమైన సేవలు అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చింది.

విద్యుత్ సేవలను నేరుగా తమ మొబైల్ ఫోన్ ద్వారానే పొందేలా వాట్సాప్ చాట్ సేవలను ప్రారంభించినట్లు టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ వాట్సాప్‌లో 8712441912 నంబర్‌ను సేవ్ చేసుకుని హాయ్ అని మెసేజ్ పంపడం ద్వారా ఫిర్యాదుల నమోదు, బిల్లింగ్ వివరాలు, విద్యుత్ సరఫరా స్థితి, సమాచారం వంటి వివిధ సేవలను సులభంగా పొందవచ్చని తెలిపారు. సైబర్ నేరగాళ్లు పంపించే మెసేజ్‌లకు వాట్సాప్ చాట్‌బాట్ చెక్ పెడుతుందన్నారు సీఎండీ. విద్యుత్ సరఫరాలో ఫిర్యాదుల నమోదుతో పాటు బిల్లు జారీచేయకపోయినా, ఆన్‌లైన్ బిల్లు చెల్లించాక ఆ సమాచారం అప్డేట్ కాకపోయినా, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏవైనా సమస్యలు తలెత్తినా, విద్యుత్ లైన్లకు చెట్లకొమ్మలు తగిలినా, విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నా.. ఇలా పలురకాల ఫిర్యాదులను వాట్సాప్ చాట్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

# ఎల్ అండ్ టి నుంచి మెట్రో రైలు పూర్తి స్వాధీనం

మొదటిపేజీ తరువాయి

మెట్రోకు సంబంధించ గత ఏడాది సూత్రప్రాయంగా జరిగిన ఒప్పందంలో రూ. 2 వేల కోట్ల ఈక్విటీని ఏకమొత్తంగా ఎల్‌అండ్‌టీకి చెల్లించేలా.. రూ. 13 వేల కోట్ల రుణాలను ప్రభుత్వం బదలాయించుకునేలా అవగాహనకొచ్చిన సంగతి తెలిసిందే. ఆ తర్వాతే స్వాధీన పక్రియ మొదలైంది. మెట్రో ఆస్తులు, వాటి విలువను ఐడీబీఐ క్యాపిటల్.. రైళ్లు, ట్రాక్‌లు, సిగ్నలింగ్ వ్యవస్థ వంటి సాంకేతిక అంశాలపై డీఎంఆర్‌సీ మదింపు చేసి ప్రాథమిక నివేదికలిచ్చాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులతో సీఎం చర్చించారు. హైదరాబాద్ మెట్రోపై తెలంగాణ క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోని నిర్వహిస్తున్న ఎల్‌అండ్‌టీ నుంచి పూర్తిగా ప్రభుత్వాధీనంలోకి తీసుకునేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం ప్రకారం మార్చి 31వ తేదీలోపు మెట్రోను పూర్తిగా స్వాధీనం చేసుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఈ టేకోవర్ మొత్తం విలువ సుమారు రూ. 15,000 కోట్లుగా అంచనా వేసింది. ఇందులో మెట్రోపై ఉన్న అప్పులు రూ. 13,000 కోట్లు కాగా, ఎల్ అండ్‌టీ సంస్థ ఈక్విటీ వాటా రూ. 2,000 కోట్లుగా ఉంది. మెట్రో రెండో దశ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలంటే మొదటి దశ పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని కేంద్ర ప్రభుత్వం షరతు విధించింది. ఈ నేపథ్యంలోనే మెట్రోను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకునే నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయంతో హైదరాబాద్ మెట్రో విస్తరణకు మార్గం సుగమం కానుంది. నగరంలో రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆధీనంలోకి మెట్రో వచ్చిన తర్వాత.. మెట్రో విస్తరణ వేగవంతం అవుతుంది. ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించే అవకాశం ఉంటుంది. రవాణా వ్యవస్థపై ప్రభుత్వానికి పూర్తి నియంత్రణ ఉంటుంది. భవిష్యత్ ప్రాజెక్టులకు కేంద్ర సహాయం పొందడం సులభం అవుతుంది. ఇది నగర అభివృద్ధికి కీలక నిర్ణయంగా భావిస్తోంది. ఇకపోతే ఈ సమావేశంలో రాష్ట్ర పురోగతికి సంబంధించి పలు సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. వైద్య విధాన పరిషత్‌లో మార్పులు , భూ కేటాయింపులపై కేబినెట్ ముద్ర వేసింది. రాష్ట్రంలోని వైద్య రంగంలో కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. 'తెలంగాణ వైద్య విధాన పరిషత్' పేరును ఇకపై 'డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్'గా మారుస్తూ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మార్పుతో పాటు, ఇప్పటివరకు పరిషత్ పరిధిలో ఉన్న ఉద్యోగులను పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని నిర్ణయించారు. దీనివల్ల వేలమంది వైద్య సిబ్బందికి లబ్ది చేకూరనుంది. రాజకీయ పార్టీల బలోపేతానికి సంబంధించి కూడా కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల నిర్మాణానికి భూమిని కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మరికొన్ని కీలక భూ కేటాయింపులపై కూడా కేబినెట్ స్పష్టతనిచ్చింది. ఖమ్మం జిల్లాలో టీటీడీ ఆలయ నిర్మాణం లేదా ఇతర ఆధ్యాత్మిక సేవల కోసం 20 ఎకరాల భూమిని కేటాయించారు. మహబూబాబాద్ జిల్లా గుమ్మడూరు లో కొత్తగా జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీ నిర్మాణానికి గాను 70 ఎకరాల భారీ కేటాయింపుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పరిపాలనా సౌలభ్యం కోసం , రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం తీసుకున్న ఈ నిర్ణయాలు తక్షణమే అమలులోకి రానున్నాయి. స్వల్ప అనారోగ్యం కారణంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశానికి హాజరు కాలేదు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశిరచిన జనగణనపై మంత్రిమండలి భేటీలో కీలక చర్చ జరిగింది. ఈ చర్చలో జనగణన వివరాలను తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు వెల్లడించారు. రెండు దశల్లో జనగణన పక్రియ 2027 ఫిబ్రవరిలో రెండో దశ ప్రారంభం కానుంది. జనగణన కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లపై మంత్రివర్గంలో చర్చించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం నిర్దేశిరచిన జన గణన పక్రియను చేపట్టేందుకు ప్రభుత్వం కీలక ఆమోదం తెలిపింది. ఈ భారీ కార్యక్రమాన్ని రాష్ట్రంలో అత్యంత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సర్వసన్నద్ధమవుతోంది. ఈ సమావేశంలో ముఖ్యంగా నిర్ణీత షెడ్యూల్ ప్రకారం జరగాల్సిన తొలి విడత ఇండ్ల గణన అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ రామకృష్ణరావు ఈ పక్రియకు సంబంధించిన ఏర్పాట్లను కేబినెట్‌కు వివరిస్తూ, మే 11వ తేదీన ఈ గణనను ప్రారంభించి జూన్ 9వ తేదీ వరకు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ హౌజ్ లిస్టింగ్ పక్రియ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్దేశిరచిన 34 ప్రశ్నలతో కూడిన నమూనా పత్రాన్ని ప్రభుత్వం వినియోగించనుంది. క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటిని సందర్శించి వివరాలు సేకరించేందుకు సుమారు 84 వేల మంది ఎన్యుమ రేటర్లను, వారికి దిశానిర్దేశర చేసేందుకు నోడల్ ఆఫీసర్లను కలిపి మొత్తం 89 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులను ఈ విధుల్లో భాగస్వాములను చేయనున్నారు. తొలి దశ విజయవంతంగా ముగిసిన తర్వాత, అసలైన రెండో దశ జన గణన పక్రియను వచ్చే ఏడాది అంటే 2027 ఫిబ్రవరిలో చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతుల అంచనాకు ఈ గణన ఎంతో కీలకం కానున్న నేపథ్యంలో, ఎలాంటి లోపాలు లేకుండా ఈ పక్రియను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎన్యుమరేటర్లతో పాటు నోడల్ ఆఫీసర్లు మొత్తం 89 వేల మంది ఉద్యోగులు జనగణన పక్రియలో పాలుపంచుకుంటారని తెలిపారు.

# కామారెడ్డి లో భారీ ఔషధ మోసం - ప్రజా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

## - ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ బొమ్మెర...






పొలిటికల్ పవర్ ఎన్విఆర్ టీవీ ప్రతినిధి కామారెడ్డి జిల్లా...

కామారెడ్డి జిల్లాలో చాలా సంవత్సరాలుగా అనేక ఆసుపత్రులు నమోదు చేసిన ఫార్మసిస్ట్ లేకుండానె మెడికల్ షాపులను నడుపుతున్నట్లు పలు ఫిర్యాదులు మరియు సమాచారం వెలుగులోకి వస్తున్నాయి అని ఫార్మసిస్టు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ బొమ్మేరా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విధమైన అక్రమ చర్యల వల్ల రోగుల ప్రాణాలు మరియు ఆరోగ్యం ప్రమాదంలో పడే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.అలాగే ఇటీవల డ్రగ్ కంట్రోల్ శాఖ నిర్వహించిన తనిఖీలలో కొన్ని ఆసుపత్రి ఫార్మసీల లైసెన్సులు సస్పెండ్ / సీజ్ చేయబడినట్లు సమాచారం ఉందని తెలిపారు. అదేవిధంగా, ఒక ఆసుపత్రిలో గడువు ముగిసిన (ఎక్స్పైరీ) ఔషధాలు నిల్వ ఉంచి వినియోగిస్తున్నట్లు గుర్తించిన ఘటన కూడా వెలుగులోకి వచ్చిందాని, ఇది ప్రజా ఆరోగ్య భద్రతపై తీవ్రమైన ఆందోళన కలిగించే విషయం అని అన్నారు. ప్రజా ప్రయోజనం దృష్ట్యా, సస్పెండ్ లేదా సీజ్ చేసిన ఆసుపత్రి ఫార్మసీల పూర్తి వివరాలను అధికారికంగా ప్రజలకు తెలియ జేయాలని విజ్ఞప్తి చేసారు.అందువల్ల డ్రగ్ ఇన్స్పెక్టర్ రాజారెడ్డి వెంటనే పబ్లిక్ నోటీస్ విడుదల చేసి, అక్రమ ఫార్మసీలపై కఠిన చర్యలు తీసుకోవాలని కామారెడ్డి జిల్లా ప్రజలు కోరుతున్నారు. ఇలాంటి చర్యలు ప్రజల్లో అవగాహన పెంపొందించడమే కాకుండా, భవిష్యత్తులో ఇటు వంటి అక్రమాలను నివారించడానికి దోహదపడతాయి అని అన్నారు.

# అర్రైవ్, అలైవ్, రోడ్డు భద్రతపై పోలీసుల అవగాహన

పొలిటికల్ పవర్ న్యూస్ అశ్వారావుపేట టౌన్ రిపోర్టర్ (వడితే గణేష్ ఫిబ్రవరి 24)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో రహదారి నిబంధనలు పాటించడం ద్వారానే ప్రాణ రక్షణ సాధ్యమని ఎస్సై అఖిల పేర్కొన్నారు. సోమవారం పోలీసుల ఆధ్వర్యంలో అరైవ్ ,అలైవ్ ఫేస్ టు కార్యక్రమంలో భాగంగా వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ




ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రైడర్ తో పాటు వెనక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలని సూచించారు.

# జిల్లాలో 5 బార్లకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల

## - దరఖాస్తుకు మార్చి 2వ తేదీ వరకు గడువు..
## - మార్చి 4న కలెక్టర్ సమక్షంలో లాటరీ..
## - జిల్లా ఎక్సైజ్ అధికారి డా. సిహెచ్ నరేష్ కుమార్

బాపట్ల టౌన్, పొలిటికల్ పవర్ (ఫిబ్రవరి 23) : బాపట్ల జిల్లాలో ఖాళీగా ఉన్న 5 బార్ల కేటాయింపునకు సంబంధించి సోమవారం గెజిట్ నోటిఫికేషన్ను జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ అధికారి డాక్టర్ సిహెచ్ నరేష్ కుమార్ విడుదల చేశారు. ఈ ప్రక్రియలో భాగంగా బాపట్ల మున్సిపాలిటీ పరిధిలో రెండు (2), రేపల్లె మున్సిపాలిటీ పరిధిలో మూడు (3) బార్లకు లైసెన్సులు మంజూరు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్లైన్ ద్వారా లేదా స్వయంగా బాపట్లలోని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు రుసుము: రూ. 5,00,000/-, ప్రొసెసింగ్ ఫీజు: రూ. 10,000/-, వెబ్సైట్ https://oc.hpfsproject.com ద్వారా దరఖాస్తు చేయవచ్చు. దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 2వ తేదీ, సాయంత్రం 6:00 గంటల వరకు, మార్చి 4వ తేదీ, ఉదయం 8:00 గంటలకు, బాపట్ల కలెక్టరేట్ ప్రాంగణంలోని 'గ్రీవెన్స్ హాల్'. జిల్లా కలెక్టర్ సమక్షంలో పారదర్శకంగా లాటరీ తీయబడుతుంది. ఈ సందర్భంగా ఎక్సైజ్ అధికారి మాట్లాడుతూ, ప్రతి బారు కేటాయింపునకు కనీసం 4 దరఖాస్తులు వస్తేనే లాటరీ నిర్వహించడం జరుగుతుందని స్పష్టం చేశారు. లాటరీలో బారు దక్కించుకున్న వారు వెంటనే 3/6 వంతు లైసెన్స్ ఫీజును చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. లైసెన్స్ ఫీజు ఇతర వివరాల కోసం ఈ క్రింది అధికారులను సంప్రదించాలని కోరారు. జిల్లా ప్రొబిషన్స్ ఎక్స్చేంజ్ అధికారి డాక్టర్ సిహెచ్ నరేష్ కుమార్ (DEO): 63058 95629, జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ బి. వెంకటేశ్వర్లు 98499 90288, సంప్రదించాలని వారు తెలిపారు..

# రజక కులస్తులపై దాడులను ఖండించాలి

- నాగర్ కర్నూల్ లో క్రూర సంఘటన
- రెండు నెలల పాపని కాళ్ళుతో తన్నిన సర్పంచ్
- కేసు నమోదు చేసిన స్పందించని అధికారులు
- రాష్ట్రమంతా ర్యాలీలు నిర్వహిస్తున్న రజక కులస్తులు
- అశ్వారావుపేట లో కొవ్వొత్తులతో భారీ ర్యాలీ



పొలిటికల్ పవర్ న్యూస్ అశ్వారావుపేట టౌన్ రిపోర్టర్ (వడితే గణేష్ ఫిబ్రవరి 24)

రజక కులస్తులపై చేస్తున్న క్రూర దాడులను ఖండిస్తూ , నాగర్ కర్నూలు జిల్లాలోని కుమ్మెర గ్రామంలో మూడు రోజుల క్రితం టికెట్ లేకుండా గుడిలోకి ప్రవేశించిన కారణంగా చాకలి కులస్తులు అయిన గణేష్, చంద్రకళ మరియు వారి రెండు నెలల చిన్నారి మౌనిక లపై ఆ ఊరి గ్రామ సర్పంచ్ తుకారం రెడ్డి వర్గం అంతా కలిసి రాయలేని భాషలో బూతులు తిడుతూ అతి కిరాతకంగా భయంకరంగా వారిపై దాడి చేయడం జరిగింది. అంతేకాకుండా రెండు నెలల పసిబిడ్డ అని చూడకుండా కాలితో తన్ని చంపేశారు. ఈ దురహంకార పూరిత రాజకీయదారులను యావత్తు రజక బిడ్డలంతా తీవ్రంగా ఖండిస్తున్నారు. వారికి సంఘీభావంగా బీసీ, ఎస్టి నాయకులు సంఘీభావం తెలియజేశారు. అదేవిధంగా నేడు అశ్వారావుపేట లోని ప్రధాన సెంటర్లలో రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో కొవ్వొతులతో నిరసన రాలి చేయడం జరిగింది. వెంటనే నిందితులపై మర్డర్ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అగ్రకులాల దాడులు నశించాలి అని స్లొగన్స్ తో నిరసన వ్యక్తం చేశారు. దీనికి మద్దతు తెలిపిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ మండల అధ్యక్షుడు పంబి ప్రసాద్ గౌడ్ మరియు సిపిఎం నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య తదితరులు మద్దతు తెలిపారు.

# శ్రీవారి పుష్కరిణిలో తెప్పోత్సవాల ట్రయల్ రన్ విజయవంతం

## - ఫిబ్రవరి 26 నుండి మార్చి 2 వరకు సాలకట్ల తెప్పోత్సవాలు..
## - ఏర్పాట్లను పర్యవేక్షించిన అదనపు ఈవో సి. హెచ్. వెంకయ్య చౌదరి



తిరుమల, పొలిటికల్ పవర్ (ఫిబ్రవరి 23) : తిరుమలలో ఫిబ్రవరి 26 నుండి మార్చి 2వ తేదీ వరకు సాలకట్ల తెప్పోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో సోమవారం సాయంత్రం స్వామి పుష్కరిణిలో తెప్పల ట్రయల్రన్ నిర్వహించారు. టీటీడీ అదనపు ఈవో సి. హెచ్.వెంకయ్య చౌదరి ఈ కార్యక్రమంలో పాల్గొని ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు ఈవో మీడియాతో మాట్లాడుతూ తెప్పోత్సవాలకు తెప్పలను పూర్తిగా సిద్ధం చేసినట్టు తెలిపారు. ఇంజినీరింగ్, విద్యుత్, ఆలయ అధికారులతో కలిసి తెప్ప సామర్థ్యాన్ని పరిశీలించినట్లు చెప్పారు. తొలిరోజు శ్రీ సీత లక్ష్మణ ఆంజనేయ సమేతంగా శ్రీరామచంద్రమూర్తి, రెండో రోజు రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామివారు తెప్పలపై విహరిస్తారని వివరించారు. చివరి మూడురోజులు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామివారు తెప్పలపై భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. మొదటి మూడు రోజులు మూడుసార్లు, 4వ రోజు ఐదుసార్లు, చివరిరోజు ఏడుసార్లు తెప్పలపై ఉత్సవ మూర్తులు విహరించి భక్తులను అనుగ్రహిస్తారని చెప్పారు. కాగా తెప్పోత్సవాల కారణంగా ఫిబ్రవరి 26, 27 తేదీల్లో సహస్రదీపాలంకార సేవ, ఫిబ్రవరి 28న, మార్చి 01, 02వ తేదీల్లో ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది. ఈ తెప్పోత్సవాల ట్రయల్ రన్లో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ఈఈలు శ్రీనివాసరావు, సుధాకర్, డిఈ చంద్ర శేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణలో వడగళ్ల వాన బీభత్సం.. పంటలకు తీవ్ర నష్టం..

హైదరాబాద్, ఫిబ్రవరి 23: పొలిటికల్ పవర్ న్యూస్ 9టీవీ తెలంగాణ స్టేట్ బ్యూరో కూశనపెల్లి సతీష్:

తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈ రోజు(సోమవారం) అకస్మాత్తుగా భారీ వర్షాలు కురిశాయి. వాతావరణం ఒక్కసారిగా మారిపోయి.. వడగళ్లు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సిద్ధిపేట జిల్లా, నిర్మల్ జిల్లాల్లో వడగళ్ల వర్షం బీభత్సం సృష్టించింది. ఈ వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లగా, విద్యుత్ సరఫరాకి కూడా అంతరాయం కలిగింది.




కాళేశ్వరంలో వడగళ్ల వాన బీభత్సం..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం ప్రాంతంలో వడగళ్ల వాన తీవ్రంగా కురిసింది. భారీ గాలులు, వడగళ్ల కారణంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపడటంతో స్థానికంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ వడగళ్ల వాన కారణంగా ముఖ్యంగా మిర్చి, పత్తి, ఇతర వాణిజ్య పంటలకు భారీ నష్టం వాటిల్లింది. ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన రైతులు ఒక్కసారిగా నష్టపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

సిద్దిపేట జిల్లాలో..

సిద్దిపేట జిల్లాలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూర్, దూల్మిట్ట మండలాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలుల తీవ్రతకు చెట్లు విరిగిపడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. అలాగే సిద్దిపేట, దుబ్బాక పట్టణాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షపు నీటితో పలు రహదారులు జలమయమయ్యాయి. రోడ్లపై నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

నిర్మల్ జిల్లాలో..

నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలో కూడా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. వర్షంతో కొన్ని ప్రాంతాల్లో చెట్లు విరిగిపడటం, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడం వంటి సమస్యలు తలెత్తాయి.

ఒక్కసారిగా మారిన వాతావరణం..

ఈ వర్షాలతో తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఇప్పుడిప్పుడే ఎండ తీవ్రత పెరుగుతండగా.. ఒక్కసారిగా వడగళ్ల వాన, ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలకు ఉపశమనం లభించింది. అయితే రైతులకు మాత్రం తీవ్ర నష్టం కలిగింది.

రైతులకు భారీ నష్టం..

వడగళ్ల వాన కారణంగా ముఖ్యంగా మిర్చి, పత్తి, కూరగాయల పంటలు, ఇతర వాణిజ్య పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వడగళ్ల వర్షంతో పంటలు నేలకూలిపోయాయి. అలాగే మరోవైపు ఈదురుగాలుల కారణంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతున్నారు.

అధికారుల అప్రమత్తత..

వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తమయ్యారు. నష్టాలను అంచనా వేయడానికి సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపడుతున్నారు. రైతులకు నష్టం జరిగిన ప్రాంతాల్లో నివేదికలు సేకరిస్తున్నారు.

# వినతులు స్వీకరిస్తూ.. బాధలకు భరోసా ఇస్తూ..

## - నిమ్మాడలో ప్రజాదర్బార్ నిర్వహించి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళం, పొలిటికల్ పవర్ (ఫిబ్రవరి 23) : కింజరాపు ఎర్రం నాయుడు 69 వ జయంతి సంధర్భంగా నిమ్మాడ లో పర్యటించిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు.. జయంతి కార్యక్రమాల అనంతరం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జయంతి సందర్భంగా వేలాది మందితో నిమ్మాడ పరిసరాలు కిక్కిరిసి పోగా.. వందలాదిమంది వినతులను సైతం కేంద్ర మంత్రికి చేరవేశారు. ఓపికగా వాటన్నిటినీ స్వీకరించిన రామ్మోహన్ నాయుడు.. వారికి భరోసా



కల్పించారు. అవసరమైన వాటికి సత్వర పరిష్కారం అందిస్తూ.. మిగిలిన వాటిని సంబధిత అధికారులకు పరిష్కారంకై సమాచారం ఇచ్చారు.

Regd office HNO 17-41/3 Road No 5 Kamla Nagar medipalli medchal Malkajgiri district Hyderabad Telangana 500098 copyright to Nama group of company publishers and printers telecommunication network private limited cell number 7780 4435 91